శేషాద్రిశర్మ, జనమంచి

కడపమండలచరిత్రము

చెన్నపురము, 1927

Record no. 741

Śēṣādriśarma, Janamañci

Kaḍapamaṇḍalacaritramu

Cennapuramu, 1927

Record no. 741

శేషాద్రిశర్మ, జనమంచి, 1882-1950.
కడపమండలచరిత్రము / జనమంచి శేషాద్రిశర్మ విరచితము.- చెన్నపురము: జనమంచి శేషాద్రిశర్మ, 1927.
4, 91 p. ;18 cm.
Record no. 741

Śēṣādriśarma, Janamañci, 1882-1950.
Kaḍapamaṇḍalacaritramu / Janamañci Śēṣādriśarma viracitamu.- Cennapuramu: Janamañci Śēṣādriśarma, 1927.
4, 91 p. ;18 cm.
Record no. 741

741

కడపమండల చరిత్రము

122

5171

కడప[illegible]త్రము.

కడప మ్యునిసిపల్ హైస్కూలునందు ప్రధానాంధ్రో
పాధ్యాయుఁడగు కావ్యస్మృతితీర్థ
జనమంచి శేషాద్రిశర్మ విరచితము.

చెన్నపురమున
[illegible]ద్రాక్షరశాలయందు ముద్రితము.
1927.
[illegible]లితము.] [మూల్యము. 0—6—0.

		ప్రతి 1-కి రూ.	అ.
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశస్కంధములు, శ్రీశతఘంటము వేంకటరంగశాస్త్రికృతము	...	6	8
డిటో 3 వాల్యములు	...	7	0
శ్రీగురుజాడ శ్రీరామమూర్తిగారి ఆంధ్రకవిజీవితములు	...	3	8
ద్వాదశోపనిషత్తులు, సంస్కృతమునకు సరియైన తెలుఁగువచనము	...	3	0
యజుర్వేదకథాసంగ్రహము	...	0	8
భోజునికథలు	...	0	8
విక్రమార్కునికథలు	...	0	8
రేచుక్కపగటిచుక్క కథలు	...	0	3
మర్యాదరామన్నకథలు	...	0	2
పరిహాస్యవినోదకథలు	...	0	12
ప్రాచీనదేశచరిత్రలు	...	1	12
పతివ్రతలచరిత్ర	...	1	8
వీరాంగనలు	...	0	12
బేతాళునికథలు	...	0	8
పరమానందశిష్యులకథ	...	0	3
వైద్యులకథలు	...	0	4
చార్ దర్వీషుకథలు			8
శుకసప్తతికథలు			
శ్రీవివేకానందవిజయము			

శ్రీ రస్తు.

కడపమండలచరిత్రము.

Kadhepamandhala Charithramu

ఇయ్యది

కావ్యస్మృతితీర్థ

జనమంచి శేషాద్రిశర్మ విరచితము.

Janamanchi Seshadhri Sarma


చెన్నపురమున

వావిళ్ల ముద్రాక్షరశాలయందు ముద్రితము.

1927.

[మూల్యము. 0—6—0.

Printed at
the "VAVILLA" PRESS,
Madras.—1927.



15 పుటలో 16 పఙ్క్తి యాందిన......అనుగుఱుతున్న చోట "పెనగలూరునకు నుత్తరమునఁ గొండలక్రింది" అని చదువవలయును.

FOREWORD

I feel immense pleasure in introducing to the public this small treatise styled "THE HISTORY OF THE CUDDAPAH DISTRICT", by Brahmasri Janamanchi Seshadri Sarma garu, revered Telugu Scholar and Poet. The history of this District was originally written by the late J.D.B. Gribble Esq., I.C.S., after conducting a deep research of many inscriptions and records then available.

C.F. Brackenbury Esq., I.C.S., brought out a History of his own, as part and parcel of his Census-Report of this District, some decades later. This latter may be said to be but an epitome of the former. Inspite of the two publications noted above, it cannot be asserted with any force that theirs was the last word on the matter. Further researches in the field, may yet bring to light fresh and hitherto unexplored material with which the future historian may reconstruct his history on new lines altogether. Brahmasri Janamanchi Seshadri Sarma, the author, has, in the execution of this work, expended considerable labour and trouble, and laid under requisition not only the above-mentioned two recognised publications, but has drawn material from the lives of the poets of the district, the language and literature, as well as from the variegated customs of the people. His sole endeavour in bringing out this publication has been to make it as easily intelligible to school-children as possible by the employment of a simple and easy style. Copious information, much of it

new, is found embodied in this work. Descriptions of sacred places of pilgrimage in the district, spots rendered holy by the lives of great souls, caves, holy rivers, mountains, festivalplaces etc. in simple, elegant and chaste Telugu, constitute the most commendable feature of this work.

I can therefore confidently assert that a book of this kind would be found highly useful to young children. Language employed is unexceptionable, sweet and simple. The work is divided into appropriate chapters and matter is collated under suitable heads. It is my sincere belief that it is a work fashioned on an altogether new and attractive model. The author has placed the Telugu world in general, and the Cuddapah District in particular, under a deep debt of gratitude by publishing this small volume. It is devoutly to be hoped that the members of the Text-Book Committee, Educational Officers, Presidents of the Local Boards and Chairmen of Municipalities in the district, will give due recognition to this treatise by recommending its introduction in all the Elementary Schools in the District.

It is my sincere desire that the author should persevere on similar lines and bring out works of a like kind specially pertaining to the "Ceded Districts," and thus earn the undying gratitude of his countrymen.

CUDDAPAH,
7-8-1927.

K. GUNDU RAO. B.A., B.L.,
High Court Vakil.

శ్రీః.

మహాత్రిపురసుందర్యై నమః.

ధ న్య వా ద ము.

మహాశయులారా ! ఈచరిత్రమును గుఱించి విశేషించి వ్రాయఁదగిన విషయములు లేవు. వాడుకచొప్పున వ్రాయుచున్నాఁడను. చాలకాలమునుండి దత్తమండల కవిజీవితమును వ్రాయఁ దలంపుగలిగి యున్నదని యీవఱకే పెక్కుతావుల వ్రాసియున్నాఁడను. ఆ ప్రయత్నమున నీమండలచరిత్రమునకు సంబంధించిన కవిజీవితములు సంపాదించితిని. విశ్రాంతిచాలమిఁ బ్రస్తుత మావిషయమున విశేషప్రయత్నము జేయక నిలిపితిని. ఈమండలమునకు సంబంధించిన విషయములను బాలురకుఁ దెలుపుట యిప్పటిస్థితియందు మే లని తోఁచినది.

ఇంతకుముందే యిర్వు రాంగ్లభాషాపండితు లీమండల చరిత్రము నాంగ్లభాషయందే వ్రాసిరి. వానిసారమును గ్రహించితిని. బాలుర కద్దానినుండి యెంతమాత్రము తెలుపఁదగునో ఎంతమాత్రము వా రెఱింగిన మండలసాధారణచరిత్రము నెఱుఁగఁగలరో యంతమాత్రమే వానినుండి గ్రహించితి నని విన్నవించుచున్న వాఁడను. నాయనుభవమున నెఱింగిన విషయములు వాని కనుబంధముగాఁ జేర్చితిని. ఇంతకంటె నాచేసిన ఘనకార్యము లేవియును లేవు.

ఆంగ్లభాషారూపచరిత్రద్వయమునుండి సంగ్రహించిన విషయములలో నాకు సాయపడినవారు మ-రా-శ్రీ, విరూరు పిచ్చయ్య బి. ఏ., గారను న్యాయవాదులు. ఈ గ్రంథము వ్రాయుటకు నన్నెక్కుడు ప్రోత్సహించినదియు వారే. దాని

పద్ధతులనుగూడ వారే తెల్పిరి. కాఁబట్టి వారికిఁ గృతజ్ఞుఁడనై యుండువాఁడను. ఈమండలమును గుఱించిన విషయము లింకను వ్రాయఁదగినవి పెక్కులుకలవు. పుస్తకము పెద్దదిగాక యుండవలయు నని యింతమాత్రమే చేర్చితిని. ఇది యీమండలమునకే యుపయుక్తము. కావునఁ బాఠశాలలయం దీచిన్నిపొత్తమును బఠనీయముగా నేర్పుఱచుభారము తదధికారులది. పాఠశాలలయందు దీని నుంచఁదగు భారము పాఠశాలాధికారులదై యున్నది. కడపమండల విద్యాశాఖాధికారులు పాఠశాలాధికారులు నాకుఁ జేయూఁత యొసంగెద రని నమ్ముచున్నాఁడను. ముందు దీనికంటె విశేషవిషయములను జేర్చి యింకను గొంత పెద్దపుస్తకము వ్రాయువాఁడను. దీని వ్యాప్తిపై నది యాధారపడియుండును. మండలాభిమానము గల యుదారచిత్తు లీపుస్తకము నీసరింపక వ్యాపకమగునట్లు చేయుదురు గాక. బాలు రీపుస్తకమును జదివిన మండలాభిమానము వృద్ధియై యిందలి మహాక్షేత్రములు లోనగువాని నెఱింగి మేలుపొందుదురుగాక. ఇంతకంటె విశేషించి నేవ్రాయఁదగిన యద్భుతాభిప్రాయములు లేవు. దీనింగుఱించిన విషయములను నాప్రార్థనము నంగీకరించి వ్రాసిన మ-రా-శ్రీ, కే. గుండూరావు బి. ఏ., బి. ఎల్., గారి యాంగ్లభాషాపీఠికవలనఁ దెలియనగు. తప్పులున్న నెల్లరు మన్నించి నాకుందెల్పి నాచేతనే సవరింపఁ జేయుదురుగాక.

ఇట్లు విన్నవించు సుజనహితుఁడు,

జనమంచి శేషాద్రిశర్మ.

శ్రీ. శ్రీ. శ్రీ.

శ్రీః.

కడపమండలచరిత్రము.

శ్లో. నిందతు నందతు వా సన్నసూయు రనసూయురత్ర కిం తేన
యత్స్నానసగమనార్హైవేదం మమతు పాథేయమ్.

రామకవి.

కడపమండలము తెలుఁగుమండలములలో మిగులఁ బ్రఖ్యాతినిగాంచినదనుటకు సందియమొందఁ బనియుండదు. చరిత్రవిషయమున నన్నింటిలో నిది మొదట లెక్కపెట్టవలసినదనవచ్చును. పక్షపాతముమాని తొలుతటిచరిత్రము నూహించిన నిది ప్రధానమైనదియే యనక తప్పించుకొనుట సులభము కాదు. చూచుట కీమండలము సొగసుగా నుండదని కొందఱందురు. కాని వారికన్నుల కట్లగపడియుండవచ్చు. ఆకాశమున నిలువంబడి యొక్కసారి మండలము నెల్లదిక్కులఁ జూడఁగలవారు చెప్పఁదగిన మాటయగునేమో కాని మానవమాత్రుఁడు ఒక్కతావున నిలువంబడి చూచినచో సొంపుగానుండదనుట సాహసమని నాభావము. పదియోజనములు (80 మైళ్లు) పర్వతములులేక యడవులులేక పంటలుపండుభూములు వరుసగా నీమండలమున లేవని నేను నంగీకరించెదను గాని కొండలుండుట అందమునకు లోపమనువాదము నంగీకరింపఁజాలను. దట్టముగా వృక్షములుగల కొండలుగాక చెట్లులేక

జనుల కేవిషయమున నుపయోగింపని చిన్నచిన్నగుట్ట లీమండలమున నందందుఁ గలవనుట నిర్వివాదాంశము. అంతమాత్రమున మండలము సొగసుఁదనమునకు లోపము గలిగినదనుట కొంచెము వెఱ్ఱివాదమనియే నాభావము.

కొండలు సృష్టివైచిత్రిని గనఁబఱచునని యంద అంగీకరించినవిషయమే. భగవంతునిసామర్థ్యమును మన మూహింపఁజాలమని కొండలు దృఢపఱచుచుండును. ప్రజలకు మహోపయోగమును జేయునవి కొండలే యనకతప్పదు. అట్టిపర్వతము లీమండలమునఁ బెక్కుతావులఁ గనఁబడును. ఆవిషయమును ముందు వ్రాసెదను. సమీపమునఁ గొండలుండినపుడు వానినడుమ నున్నభూభాగము ప్రజలకు వాసయోగ్యమయి యుండును. ఆభాగముల కీమండలమునఁ బ్రజలు "పాయ" యని వాడుదురు. ఆ రెండుకొండలు మిక్కిలి సమీపమున నుండినచోఁ గొన్నివిషయములఁ జిక్కులు కలుగునుగాని యుపయోగము లనేకములున్నవని యొప్పుకోవలసినదియే. అట్టి పాయ లీమండలమునఁ గలవు. కనుకనే యిది చరిత్రాంశమునఁ బేరెన్నికఁగాంచెనని యంగీకరింపవలయునని వ్రాసితిని.

ప్రభువులకుఁ గ్రొత్తరాజ్యమును సంపాదింపవలయునను కోరిక యుండుట సహజము. అది లేనిరాజులు లేరని చెప్పవచ్చును. ఒకానొకఁ డెవఁడైననుండిన నతఁడసమర్థుఁడై యుండునని నాయూహ. క్రొత్తదేశమును సంపాదింపవలయునని కోరుట తప్పుగాదు. అట్టి యూహగలరాజు ప్రజలఁ జక్కఁగాఁ బరిపాలింపఁగలశక్తిగలవాఁడై యుండును. ఏలయనఁగాఁ బ్రజలమన్ననకుఁ బాత్రుఁడైనఁగాని జనసహాయముగలవాఁడు కాఁడు. జన

సహాయము గలిగిననే కాని యుద్ధయాత్ర సాగదు. అది సాగినఁగాని శత్రువుల నిలువరింప వీలుండదు. అదియుండినఁగాని ప్రఖ్యాతిని గాంచఁడు. అట్టిరాజునకే క్రొత్తదేశములు లోఁబడి యాతనిపరిపాలనము నంగీకరింపవు. కాఁబట్టి రాజు ప్రజారంజకుఁడై యుండకతప్పదు. ప్రజలబాధించి లోఁబఱచుకొన్నను వానిపరిపాలనము చాలకాలము నిలువదు. కాఁబట్టి యుద్ధము చేయునేర్పు, ప్రజల లోఁబఱచుకొని వారిమన్ననకుఁ బాత్రుఁడై తానుండఁదగుసామర్థ్యము ప్రభువుల కావశ్యకములు. పర్వతప్రాంతములు యుద్ధయాత్ర కనుకూలములు కావున నట్టితావులుగల దేశముల వెదకుచు రాజులు వాని నాక్రమింపఁ బూనుదురు. అట్టిభాగము లీ కడపమండలమున నెన్నియో కలవు. కనుకనే చరిత్రాంశమున కీమండలము ప్రసిద్ధిని గాంచెనని చెప్పుచున్నాఁడను.

ఈమండలమున నదులు చాల కలవుగాని జలసమృద్ధి వానివలనఁ గలుగుటలేదు. కొన్ని యిసుకమాత్రమే జలముగాఁ గలవి. కొన్నింటియందు గుండ్రముగను వంకరగనుండు ఱాళ్లుగలవు. కొన్నింటియందు జలముకూడ నుండును. వర్షాకాలమున సమృద్ధిగా జలముగలదు. ఇట్టు లుండుటంబట్టి యీనదులవలన విశేషోపయోగము ప్రజలకులేదని చెప్పవలసివచ్చెను. నదులయందు జలము సదా లేకుండుటయు, నడవులు పెక్కుతావులనుండుటయు నీ రెండుకారణములవలన నీమండలభాగము లించుమించుగా వేసవికాలమున నుష్ణమధికముగాఁ గలవగును. కాని యెండవడచే జనుల కపాయము కలుగుటలేదు. ఎండలు మెండుగానుండుటంబట్టి యిందున్న ప్రజల

దేహములు నలుపురంగు ప్రధానముగాఁగలవిగ నుండును. కొలఁదివయస్సునకే ముదిమి సంభవించునని కొందఱిమతము. ఇందుఁ గొంచెమైన సత్యముండకపోదని నే నూహించెదను.

అలవాటులు.

ఇందలి ప్రజలయాచారములు సాధారణముగాఁ బూర్వపుఁబద్ధతుల ననుసరించినవే యనవచ్చును. నవనాగరికుల యలవాటులు తఱచుగా లేవు. దేవతలయందు భక్తి మెండు ప్రతిపల్లియయందును దుదకొక్క రామదేవాలయమైన నుండు నని నాయనుభవమును బట్టికూడఁ జెప్పఁగలను. పుణ్యక్షేత్రము లీమండలమునఁ బెక్కులు గలవు. అందు బ్రహ్మోత్సవములు సాగుచుండును. ప్రజ లాయుత్సవములఁజూడఁ బెక్కుమంది పోవుదురు. తఱచుగా నాయుత్సవములయందు మందు నుబ్రేల్చుట వాడుక. వేశ్యలయాట చూచువేడుక ప్రజలకు మిక్కిలియిష్టము. ఆయుత్సవములందుఁ బామరులు గుంపుగాఁ గూడి భజనములు చేయుచుఁ దాళముతప్పకుండ నడుగులువైచుచు గుండ్రముగాఁ దిరుగుచుందురు. ఆవేడుకనుజూడ ననేకులు ప్రోగగుదురు. సుద్దులు చెప్పువారు వచ్చి యొకచోటఁ గూరుచుండి బొబ్బిలియుద్ధము, దేశింగరాజుకథ చెప్పుచుండఁగా నెందఱో ఆసక్తిచే వినుచుందురు. ఈ వేడుకలే తిరునాళ్లయందు విశేషముగా సాగుచుండును. ఈప్రజలకు విశేషాసక్తి వేడుకలయందే యనవచ్చును. అందును బోగమువారి యాటయందే యనిచెప్పుట సాహసము కాదు. రథోత్సవము నాఁడు గోవిందనామకీర్తనములు మెండు. స్నానముచేసి తడి గుడ్డలతో రథమునులాగిన మంచిపుణ్యము లభించునని వీరి

భావము. ఈవిశ్వాసము శాశ్వతముగా నుండుఁగాక యని కోరెదను. రథముపై వేంచేసియున్న కేశవస్వామిని దర్శించినఁ దమరుచేసిన పాపములన్నియుఁ దొలఁగునన్ననమ్మకము ప్రజలకుఁ గలదు. నాచిన్నతనమున రథోత్సవమునాఁ డిట్లు ప్రజలు చెప్పుచుండఁగా వినియున్నవాఁడను. చలిపందిరులు వేసి యందుఁ జల్లనిజలము, మజ్జిగనిచ్చువారు ప్రతితిరునాళ్లకుఁ బోవుదురు. ఇదియొక భగవత్సేవయని వారినమ్మకము. ఈనమ్మకము సదా వారిమనములఁ బాదుగొనుఁగాక యని భగవంతుని వేఁడుచుందును.

భాష.

ఈమండలమున నుండు ప్రజలు తెలుఁగు మాటలాడువారు. మహమ్మదీయులుగాక యితరులందఱు తెలుఁగు చక్కఁగా మాటలాడుదురు. భాష బాతెఱుదీర్ఘములు గలదిగాక కేవలము కసరినట్లుండక సాధారణముగా నుండును. తెలుఁగు భాగవతమునందుఁగల పెక్కుమాట లీమండలమున వాడుకొనుమాటలే యనక తప్పదు. తఱచుగాఁ బ్రతిమాటకును, "గి" అను అక్షరమును మొదటనుంచి ఆమాటనే పలుకుదురు. అన్నము, గిన్నము, పని, గిని, చదువు, గిదువు, బజారు, గిజారు, ఆట, గీట అను మొదలయినవి. ఇంతియగాక సాధారణముగా మాటలాడునపుడు మాటచివరన "పాడు" అనుపదము నుపయోగింతురు. "పాడు" అనుపదము ఎట్టియపార్థమును గల్పింపదని వీరిభావము. ఏదోపని పాడు, ఆయూర మామిడిపండ్లుండలేదా పాడు. అను మొదలగునవి. మాటలధోరణిలో నీపాడుపదము రసవిహీనముగాఁ దోఁపదుగాని ప్రత్యేకముగ

నామాటల నెత్తివ్రాసినయెడల బాగుండదు. ఇంతియగాక విశేషించి శూద్రులలో "మళ్లి" అనునదియు, "మళ్ల" అనునదియు సమయానుసారము మాటకొసన వాడఁబడును. నేనుజెప్పినానుచూడు మళ్ల, నాయేటుచూడు మళ్లి, అను మొదలగునవి. "మళ్లి, మళ్ల" యను నీరెండును "మరలి, మరల," అను పదములకు గ్రామ్యరూపములు. బ్రాహ్మణులలోఁ దఱచుగా "ఏమి" అనుపదము పాడుపదము చేర్పఁబడనిసమయముల వాడఁబడును. చూచినావేమి, చెప్పినావేమి, నేనాచోట లేనేమి, అను మొదలగునవి. ఇవి కన్నడము పోలికగా వచ్చినవి. మధ్వబ్రాహ్మణులు వీనినెక్కువగ నుపయోగింతురు. కన్నడమున "ఘత్తై" అనుపద ముపయోగింపఁబడును. కన్నడము మధ్వబ్రాహ్మణులు కులభాషగా భావించి మాటలాడుదురు. ఆపోలికయే "ఏమి, మఱి" అను నీరెండునని యూహింపవచ్చును. చెప్పినావేమి మఱి, అనికూడ వాడుదురు. "ఏను మత్తై" అని కన్నడమున వాడుక. ఈజనులతో మాటలాడి యాయలవాటునఁ దెలుఁగువారుకూడ నట్లే మాట్లాడ నలవాటు చేసికొనిరని నా తాత్పర్యము. మధ్వబ్రాహ్మణులు "మనము" అనుమాటకు నన్నిచోట్ల "మేము" అని వాడుదురు. మనము పోవుదమా, అనుటకుబదులు మేము పోవుదమా అనుట వారిధోరణి. ఎవరైన వేయింటికొక్కఁడు మనమనునేమో సంశయమేకాని తక్కినవారందఱు మేమనియే వాడుదురు. ఈదేశమున భాషలో గ్రామ్యపదములు తక్కువయని చెప్పక తప్పదు. ఆంధ్రదేశముననున్న యన్ని గ్రామ్యపదములీమండలమున సాధారణజనుల మాటలలోఁగూడ లేవః

వచ్చును. ఆవకా యెట్టినారు. ఆవకాయ పెట్టినారు. అనునంతటి గ్రామ్య మీభాషయందు లేనేలేదు. ద్రొబ్బుట అనునది శూద్రులలో నీమండలమునఁ బడమరభాగమున వాడఁబడును. అదిత్రోయుట యనునర్థమందే యుపయోగింతురు. అది గ్రామ్యమనుట కేవలము హఠవాదముగాక మఱేమి? ఈపదమునే విశాఖపట్టణము మొదలు గుంటూరువఱకు బ్రాహ్మణులలో స్త్రీలుకూడ నలుగురిలో నుపయోగింతురు. వాఁడు పదిరూపాయలు దొబ్బేసినాఁడు. అను మొదలగునవి. ఈకడపమండలమున బ్రాహ్మణులు అందును స్త్రీలు వాడగా నేనెంతమాత్రము వినలేదు. వాడుట లేదనిచెప్ప సాహసించెద. కడుజాగరూకుఁడనై భాషాపద్ధతులను బరిశీలించితిని. "ద్రొబ్బుట" అను నీపదమునే యుత్తరమండలమువా రాక్షేపింతురు. అది న్యాయముకాదని నామతము. మొత్తముమీఁద నీమండలమున భాష నూఱుపదములలోఁ దొంబది వ్యాకరణవిరుద్ధములు కావు. ఆదిమాంధ్రులు మాటలాడునప్పుడును విశేషము, వృక్షము, మొదలగుసంస్కృతపదము లించుకదీర్ఘముగా వాడఁబడును. మహాకవులుండిన తావులుగనుక వారివాడుకలే వీరికి నేఁటికిని బట్టుపడియున్నవని నానమ్మకము.

కాలముగడపుట.

కడపమండలమున గ్రామములయందు సంచరించి పరిశీలించినయెడల వృథాకాలక్షేపము చేయువా రెక్కువమంది గలరని తోఁపకమానదు. ఎండకాలమున నాలుగునెలలు ఏపనియులేక భోజనముచేసి పులిజూదము నాడువారు నూటికి నెనుబది (80) మంది కలరు. ఇద్దఱాడుచుండఁగాఁ బదిమంది

నామాటల నెత్తివ్రాసినయెడల బాగుండదు. ఇంతియగాక విశేషించి శూద్రులలో "మళ్లి" అనునదియు, "మళ్ల" అనునదియు సమయానుసారము మాటకొసఁగ వాడఁబడును. నేనుజెప్పినానుచూడు మళ్ల, నాయేటుచూడు మళ్లి, అను మొదలగునవి. "మళ్లి, మళ్ల" యను నీరెండును "మరలి, మరల," అను పదములకు గ్రామ్యరూపములు. బ్రాహ్మణులలోఁ దఱచుగా "ఏమి" అనుపదము పాదుపదము చేర్పఁబడనిసమయముల వాడఁబడును. చూచినావేమి, చెప్పినావేమి, నేనాచోట లేనేమి, అను మొదలగునవి. ఇవి కన్నడము పోలికగా వచ్చినవి. మధ్వబ్రాహ్మణులు వీనినెక్కువగ నుపయోగింతురు. కన్నడమున "ఘత్తె" అనుపద ముపయోగింపఁబడును. కన్నడము మధ్వబ్రాహ్మణులు కులభాషగా భావించి మాటలాడుదురు. ఆపోలికయే "ఏమి, మఱి" అను నీరెండునని యూహింపవచ్చును. చెప్పినావేమి మఱి, అనికూడ వాడుదురు. "ఏను మత్తె" అని కన్నడమున వాడుక. ఈజనులతో మాటలాడి యాయలవాటునఁ దెలుఁగువారుకూడ నట్లే మాట్లాడ నలవాటు చేసికొనిరని నా తాత్పర్యము. మధ్వబ్రాహ్మణులు "మనము" అనుమాటకు నన్నిచోట్ల "మేము" అని వాడుదురు. మనము పోవుదమా, అనుటకుబదులు మేము పోవుదమా అనుట వారిధోరణి. ఎవరైన వేయింటికొక్కఁడు మనమను నేమో సంశయమేకాని తక్కినవారందఱు మేమనియే వాడుదురు. ఈదేశమున భాషలో గ్రామ్యపదములు తక్కువయని చెప్పక తప్పదు. ఆంధ్రదేశముననున్న యన్ని గ్రామ్యపదము లీమండలమున సాధారణజనుల మాటలలోఁగూడ లేవన

వచ్చును. ఆవకా యెట్టినారు. ఆవకాయ పెట్టినారు. అనునంతటి గ్రామ్య మీభాషయందు లేనేలేదు. ద్రొబ్బుట అనునది శూద్రులలో నీమండలమునఁ బడమరభాగమున వాడఁబడును. అదిత్రోయుట యనునర్థమందే యుపయోగింతురు. అది గ్రామ్యమనుట కేవలము హఠవాదముగాక మఱేమి? ఈపదమునే విశాఖపట్టణము మొదలు గుంటూరువఱకు బ్రాహ్మణులలో స్త్రీలుకూడ నలుగురిలో నుపయోగింతురు. వాఁడు పదిరూపాయలు దొబ్బేసినాఁడు. అను మొదలగునవి. ఈకడపమండలమున బ్రాహ్మణులు అందును స్త్రీలువాడగా నేనెంతమాత్రము వినలేదు. వాడుట లేదనిచెప్ప సాహసించెద. కడుజాగరూకుఁడనై భాషాపద్ధతులను బరిశీలించితిని. "ద్రొబ్బుట" అను నీపదమునే యుత్తరమండలమువా రాక్షేపింతురు. అది న్యాయముకాదని నామతము. మొత్తముమీఁద నీమండలమున భాషనూఱుపదములలోఁ దొంబది వ్యాకరణవిరుద్ధములు కావు. ఆదిమాంధ్రులు మాటలాడునప్పుడును విశేషము, వృక్షము, మొదలగుసంస్కృతపదము లించుకదీర్ఘముగా వాడఁబడును. మహాకవులుండిన తావులుగనుక వారివాడుకలే వీరికి నేఁటికిని బట్టుపడియున్నవని నానమ్మకము.

కాలముగడపుట.

కడపమండలమున గ్రామములయందు సంచరించి పరిశీలించినయెడల వృథాకాలక్షేపము చేయువా రెక్కువమంది గలరని తోఁపకమానదు. ఎండకాలమున నాలుగునెలలు ఏపనియులేక భోజనముచేసి పులిజూదము నాడువారు నూటికి నెనుబది (80) మంది కలరు. ఇద్దఱాడుచుండఁగాఁ బదిమంది

చూచుచు మెచ్చుచు, నాక్షేపించుచు నుత్సాహమును బౌరుషమును గల్పించుచు నుందురు. ఈయాట వారిపాలిటికి చతురంగమునకన్న మిన్నయనియే తోఁచును. ఎన్ని దినములెన్ని పర్యాయములాడినను విసుగుతోఁపదు. ఒక్కొక్కపర్యాయము గెల్చినవారు వేయుకేకలు ఆకాశము నంటును. పులిజూదమునఁ బందెములుకూడఁ బెట్టువాడుక గలదు. మూఁడు దమ్మిడీల గెల్చినవానికి మూఁడులోకములు గెల్చినప్పుడు కలుగునానందము గలుగును. ఇట్టి యాటలతోఁ గాలముపుచ్చుచు విద్యాగంధములేక పెక్కుమంది యున్నవారు. మఱికొన్నిపల్లియలందు మోసగించి డబ్బునులాగు నాటలు గలవు. వానినన్నింటి నిటవ్రాయు టనవసరమని మానితిని.

పౌరుషక్రియలు.

వరిమొదలగు సస్యములు ఫలించినపుడు కొందఱు పందెములువేసికొని యొండినకొబ్బరిగిన్నెల మనికట్టుతో నేడెనిమిదిముక్కలుగాఁ బగులఁగొట్టఁ గట్టుదిట్టములు చేసికొందురు. గెల్చినచో వానికదియే లాభముగా నిత్తురు. ఓడినచో నట్టిదానినిగొని యీయవలయునని నియమము. ఇట్టిపందెములతోఁ దమరు సంపాదించినధాన్యమును బాడుచేసికొని పనిలేనికాలమునఁ గష్టములపాలగుచుందురు. ఒకఁడింతదూరము పరుగెత్తి మరల నాచోటికివచ్చులోపల నుడికినట్టి అలచందలు ఇన్నితినియెదనని యొకఁడు పందెముపెట్టును. నేను బరుగెత్తి వచ్చి నిన్నోడింతునని యింకొకఁడు పూనుకొనును. పదిమంది పెద్దమనుష్యులందు మధ్యవర్తులుగాఁ జేరి కూరుచుందురు. తినుట కారంభింపఁగనే పరుగెత్తుట కారంభము చేయఁబడును.

అలచందలనుదినువాఁడు మంచినీరు త్రాగరాదు. ఈయిద్దఱిలో నోడినవాఁడు గెలిచినవానికి నియమప్రకారము పందెము నిచ్చును. దానిలో మధ్యవర్తులకుఁ గొంతభాగము గలదు. ఈయాట సాయంప్రాతఃకాలములయందు సాగుచుండును. ఇట్టివానినన్నింటిని వ్రాయఁబూనక మచ్చునకుఁ గొలఁదిగ వ్రాసితిని. ఈపైఁ జెప్పినవన్నియుఁ బెద్దవారు చేయునవి. బాలకులు పుట్టచెండుతో నాడుకొను చుందురు. అంతియకాని చదువు కొందమనియెడియూహ వారికిఁ గలుగనే కలుగదు. విద్యతో లాభములేదనియే చాలమంది యూహ. పెద్దవారుకూడఁ దమ కొడుకులకుఁ జదువుచెప్పింతమని యూహింపరు. చిన్నప్పటి నుండియు నెరువు ప్రోగుచేయఁ బురికొల్పుదురు. పెద్దవారికి విద్యాగంధము లేనియప్పుడు బాలుర కెట్లు చదు వలవడును? ఇట్టులగుటంబట్టియే నెల్లూరు మొదలగు మండలవాసులకంటె నిందలివారు విద్యావిహీను లెక్కువమంది యని యూహింప వలసి వచ్చెను.

సత్కాలక్షేపములు.

ఫాల్గుణమాసము మొదలాషాఢమాసము తుదివనుక నీమండలమునఁ బల్లియలందు రాత్రివేళఁ బురాణముచెప్పుచుండుట కలదు. ఆపురాణముచెప్పుపండితులు కొందఱు గలరు. వారిలోఁ దఱచుగాఁ బలువురకు సంస్కృతమునందుఁగాని తెలుఁగునందుఁగాని పాండిత్యము కొంచెమైన నుండదు. కాని రంగనాథరామాయణమును జదువుటకు నర్థముచెప్పుటకు నేర్చుకొనియుందురు. రాముకథను వారు పలువిధములుగా వర్ణించుచుండ నర్థముతెలియకున్న నానందించుచుందురు. పౌరాణి

కుఁడు తా నెవరియొద్దనో నేర్చుకొన్నపదముల వర్ణించుచుండఁగాఁ బామరులు వారిని మెచ్చుచుందురు. శ్రీరామపట్టాభిషేకమునాఁడు సంతర్పణముచేసి పురాణముచెప్పినవారికి సంభావన నిత్తురు. కొందఱు భారతమున విరాటపర్వము యుద్ధపంచకము పురాణముచెప్పుట కలదు. వారు పైవారికన్న మహాపండితులని పల్లియలలో వాడుక. ఈవిధముగాఁ గొన్ని గ్రామములలో జనులు మంచికాలక్షేపము చేయుదురు. ఆ కొలఁదిదినములుతప్పఁ దక్కినకాలములలో లోపల వ్రాసిన ప్రకార మాటలతోడనో, వ్యవహారములతోడనో కాలము పుత్తురు. కొందఱుమాత్రము సదా న్యాయస్థానముల (కోర్టుల) వార్తలనే స్మరించుచుఁ గాలముపుచ్చువారును గలరు. వారికిఁ బలుకుబడి యెక్కువ. ఇట్లు లీమండలవాసులలో నూటి కెనుబదిమంది కాలముపుత్తురనుట నిర్వివాదాంశము.

పర్వతములు.

ఈమండలమును రెండుభాగములుగాఁ జేసినది శేషాచలము. ఉత్తరదక్షిణములుగా నది వ్యాపించినది. ఈపర్వతమున దక్షిణభాగమునందుఁ దిరుపతియను దివ్యక్షేత్రము గలదు. అది యీమండలమునకును జిత్తూరుమండలమునకుఁ జివరభాగమున నున్నది. ఈపర్వతము ఎత్తుగానుండును. అడవులు రెండుప్రక్కల దట్టముగా వ్యాపించియుండుట నీకొండ నొంటరిగా నెవ్వరు నెక్కఁజాలరు. మృగబాధయుఁ గలిగియుండును. ఈపర్వతభాగములయందుఁ బుణ్యక్షేత్రములు మెండుగాఁ గలవు. వానియందు శివక్షేత్రములసంఖ్య హెచ్చుగా నుండును. ఈమండలమున నెంతదూర మీపర్వతముకలదో

యంతదూరమున నెన్నియో శివాలయములు గలవు. వానికి "కోనలు" అని పేరు.

శేషాచలమే ఈమండలమునఁ బ్రధానపర్వతము. దానికిఁ దూర్పుభాగమున నెల్లూరుమండలము. నీమండలమును వేఱుచేయుకొండ యొకటిగలదు. దానికి "వెలిగొండ" యని పేరు. అదియును రెండుభాగములుగా దక్షిణభాగమునఁ జీలి శేషాచలమున నొకభాగము కలిసిపోవును. రెండవభాగము తూర్పుగా "శ్రీకాళహస్తిక్షేత్రముమీఁదుగా వ్యాపించును. వెలిగొండ శేషాచలమునను నీరెండుకొండలే యీమండలమునఁ బ్రధానములనుట పొరపాటు కాదు. కడపకు దక్షిణభాగమున మిక్కిలిసమీపమునఁ బాలకొండయొకటి కలదు. అది శేషాచలభాగమేకాని క్రొత్తది కాదు. కాని యాశాఖ రాయచోటితాలూకాయందు వ్యాపించి యింకను దక్షిణమున కెన్నియోశాఖలుగా వ్యాపించియుండును. కావుననే దీనిని ప్రత్యేకపర్వతమని వాడుదురు. పాలకొండ యెత్తుగానుండి యడవి మిక్కుటముగా నుండఁగా నీటిపట్టులు విశేషముగానుండ మహోపకార మీమండలమునకు నొనరించుచుండును. దీనియందుఁ గల విశేషములు ముందువ్రాసెదను. ఇవికాక చిన్నచిన్నపర్వతములు కొన్నికలవుగాని యవి భూమికి భారమునుగల్గించుటకును మార్గముననుండుట జనులకు శ్రమముగలిగించుటకేకాని వేఱొకయుపకారము చేయఁజాలవు. పాలకొండ యొకవిధముగానుండక రెండుమూఁడుశాఖలుగాఁ గనఁబడును. అందొక శాఖ తిరుపతిక్షేత్రముచెంత నల్లమలతోఁ గలియును. వేఱొక శాఖ చాలదూరము వ్యాపింపఁజాలక నిలిచిపోవును. వేఱొక

శాఖ రాయచోటిప్రాంతముల కేగును. కావుననే దీనిని జనులు పాలకొండలని పిల్తురు. కొంతకాలమునకుఁ బూర్వ మీకొండ క్రిందియడవి దట్టముగా నుండినట్లును నెల్లూరుమండలము నుండి యావులమందలువచ్చి యిందుఁ గొంతకాలముండి పచ్చిక మేయుచుండినట్లును, వలసినన్ని పాలు అడిగినవారికెల్ల వానిని గాచువా రిచ్చునట్లును, దానిచే నీకొండకుఁ బాలకొండ యను పేరుకలిగెనని కొందఱు చెప్పుదురు. పాలవంటి (నిర్మలముగా నున్న)జల మీకొండయందుఁ బెక్కుతావుల గుండముల యందు దొరకుటంబట్టి పాలకొండయను పేరువచ్చెనని మఱి కొందఱు చెప్పుదురు. కాని యిందేదినిజమో నిర్ణయింపఁజా లను. పై రెండుకారణములు కేవల కల్పితములుమాత్రము కా వని గట్టిగాఁ జెప్పఁగలను. ఈకొండలుగాక తక్కినవి ప్రసిద్ధ ములు కావు. జనుల కుపయోగించునవియుఁ గావు. చాలదూ రము వ్యాపించునవియుఁ గావు. ఏదోయొకయుపయోగము వెదకిచూచిన నుండకపోదు. కాని యాయుపయోగము లేకు న్నను బాధలేనిదే. కాన వానిని వదలితిని.

నదులు.

ఈమండలమును బడమరనుండి తూర్పుగా బ్రవహించు పినాకినీనది రెండుఖండములుగాఁ జేయును. ఇదియే యిందుఁ గలనదులలోఁ బ్రధానత్వమును వహించును. ఈయది మైసూ రు (మహీశూర) రాజ్యమున నందికొండలయందుఁ బుట్టి యీ మండలముమీఁదుగా నెల్లూరుమండలమును బ్రవేశించి తూ ర్పుసముద్రమున (బంగాళాఖాతమున) జేరును. దీనియొడ్డున నొకయామడ కొక్కతావున శివాలయము లుండును. నడుమ

నడుమఁగూడ నింకను గలవుకాని పదిమైళ్ల కొక్కవగా శివా లయములు లేనిభాగము లేదనవచ్చును. ఈరీతిగా నీమండల మునందును నెల్లూరుమండలమునందును గలవని నే నెఱుంగు దును. ఆదినుండి యిట్లే దేవాలయములు గలవని పెక్కండ్రు చెప్పుదురు. విష్ణుదేవాలయములుకూడ నీ పినాకినీతీరమునఁ గలవు. కాని శివాలయములసంఖ్య చాల హెచ్చుగా నుం డును. పినాకినియన్న పేరీకారణముచేతనే వచ్చినదని కొందఱు చెప్పుదురు. ఈయది యుత్తరపినాకిని యనఁబడును. దక్షిణపినా కిని యరవదేశమునఁ బ్రవహించును. పుట్టినతావుననే రెండు భాగములుగా నీనది చీలి యొకటి యుత్తరమునకు, ఇంకొకటి దక్షిణమునకుఁ బోవుటచే నీరెండుపేరులు గలిగినవి. ఈ యు త్తరపినాకినియందు నీ రుండదు. ఈమండలముననే "కుందు" అను నుపనది దీనిలోఁ గలియును. ఆచోటునుండి జలము తఱు చుగాఁ బ్రవహించును. దానికిఁ బడమటిభాగమున వేసవికాల మున జలము కనఁబడదు. కనుకనే దీనిని జీవనదియని పిలువరు. నదికిజీవము జలమని యంద అంగీకరించిరి. కుందునది కందనూ రు (కర్నూలు) మండలమునుండి యొండుమట్టిఁ గొనివచ్చును. విపరీతకాలమునఁ దప్ప ఆకుందులో నీరుండును. ఆజలమే పినా కిని కాధారము. అక్కడనుండి జలము వేసవికాలమునఁగూడఁ గొలఁదిగాఁ బాఱుచుండును. దీనిలోఁ బెక్కుచిన్ననదు లీమం డలముననే కలియును.

చిత్రావతి.

ఇది మైసూరుదేశమున నందిపర్వతమునఁ బుట్టి కడప మండలమునఁ బ్రవహించుచు జమ్ములమడుగుతాలూకాలో

గండ్లూరుదగ్గర నీపెన్నలోఁ గలియును. ఈచిత్రావతియందును వేసవికాలమున నీ రుండదు.

పాపఘ్ని.

ఇదియు మైసూరుదేశముననే పుట్టి కడప, చిత్తూరు, అనంతపురము అను మూఁడుమండలములు కలియునట్టి స్థలమునకుసమీపముగ రాయచోటితాలూకాలోఁ బ్రవేశించి యీయుత్తరపినాకినిలోఁ గలియును. దీనియందును సదా జలము కనుపట్టదు. కాని యీనది కాలువలద్వారా వ్యవసాయమునకు విశేష ముపకరించును. దీనికే గండియేరనియు మఱొకపేరు కలదు. వేంపల్లిదగ్గర గండిగుండ వచ్చుటచే నీపేరు గలిగిన దందురు.

సగిలేరు.

ఇది కర్నూలుమండలమున నల్లమలకు సమీపముననొక కోనలోఁ బుట్టి యీమండలమునకు నీశాన్యభాగముగనుండు బద్వేలు (పెద్దప్రోలు) తాలూకాయందుఁ బ్రవహించి సిద్ధవటముతాలూకాలోని మాధవవరమునకు సమీపమునఁ బినాకినిలోఁ గలియును. సిద్ధవటముతాలూకాలో నిది ప్రవహించుచోటున కిరుప్రక్కలనుండు గ్రామములచాలునకు సగిలిపాయ యని పేరు.

బాహుదానది (చెయ్యేఱు.)

ఈనది శేషాచలశాఖయం దొకచోటఁ జొచ్చి రాయచోటితాలూకాలోఁ గొంతదూరము ప్రవహించి రాజంపేట తాలూకాయందు మిక్కిలి యుపకార మొనరించుచు సిద్ధవటము తాలూకాలోని గుండ్లమడయనుగ్రామమునకుఁ దూర్పుభాగ

మునఁ బినాకినిలోఁ గలియును. ఈనదిలో జల మొకప్పుడు గూడ నుండదు. వర్షము కురిసినపుడు ప్రవహించునుగాని యొక్కసారి ప్రవహించినచో రమారమి ఆఱుమాసముల వఱకు సమృద్ధిగా జలమును కాలువలద్వారా ప్రవహింపఁ జేయును. కృషికర్మముల కీనది ప్రాణమువంటి దనవచ్చును. ఈవిషయమున నీనది యీమండలమున నుండునదులలో నుత్తమోత్తమ మనఁదగును. తిరుపతికి నుత్తరభాగమున శేషాచలమున నొకమూలఁబుట్టి గుంజన యనునొకయేఱు దీనిలోఁ గలియును. అది సదా జలసమృద్ధి గలదు. దానియందు నీరులేకుండుట యరుదు. మట్లరాజులకాలమున నీయేటిమడుఁగులలో నేనుఁగులను స్నానము చేయించుచుండిరఁట. కావున దీనికి "కుంజరనది"యని పేరువచ్చినదనియు, నది మాఱి గుంజనయని యాయెననియుఁ జెప్పుదురు. ఇదెంతవఱకు నిజమోకాని పెద్ద మడుఁగులుండుటయు, జంబు తుంగయు నాచోట విశేషముగ నుండుటయుమాత్రము సత్యము. ఈయేఱు చెయ్యేటిలో... ......కావునఁ గలియును. అచోటనుండి చెయ్యేఱు ప్రవహించుచుండును. గుంజన యొక్కటియేగాక రాయచోటి ప్రాంతమున మాండవి చిట్టేఱు ననునవికూడఁ బాహుదలోఁ గలియును. ఇవి రెండును గలిసినపిదపనే యిది రాజంపేటతాలూకాలోఁ బ్రవేశించునుగాని జలము ప్రవహింపదు. గుంజన కలిసినపిదపనే ప్రవహించును. ఇన్నినదులు తనలోఁ గలిసినందునఁ బినాకిని నెల్లూరుమండలమును జొచ్చునపుడు జలమును గనఁబఱచుచు (దనమహిమమును వెలిపుచ్చును. కొండలనుండి వర్షకాలమున జలమునుగొనివచ్చి దీనిని బ్రవాహవంతే

ముగాఁ జేయువాఁగు లనేకములు కలవు. కాని యవియంతగా వ్రాయఁదగినవి కావు.

మండలస్థితి.

ఈమండలమునకు మూఁడుప్రక్కల గొప్పపర్వతములు గలవు. ఉత్తరమునుండి శేషాచలము (నల్లమల) దక్షిణముగా నీ మండలమును జొచ్చి కొంచెముతూర్పుగావ్యాపించి దక్షిణముగాఁ దిరుపతివఱకుఁ గనఁబడును. అది యుత్తరమునకు హద్దుగా భావింప వీలులేదు గాని యించుక వ్యాపించియుండుటచే నట్లనుకొనినను బాధలేదు. తూర్పుభాగమునమాత్రము నెల్లూరుమండలమునకును దీనికినడుమ వెలికొండయున్నది. అది యందందు భూమికి నించుమించుగా సమానముగా నడఁగియుండును గాన నది యొకమార్గముగా నాకొండను దాఁట నవకాశము గలదు. అట్టితావులు నాలుగైదు గలవు. వానినే కనుమలని పిల్తురు. ఆకనుమలగుండ నెల్లూరుమండలమునకుఁ బోవచ్చునేగాని యవిలేకున్నఁ గొండనెక్కియే పోవలసియుండును. ఆవెలికొండ తూర్పుభాగమం దీమండలము చివరవఱకువ్యాపించి కోటగోడవలెఁ గనఁబడుచు ఆగ్నేయభాగమున నించుక దక్షిణభాగమునకు మరలి నల్లమలలోఁ గలిసిపోవును. ఆనల్లమలశాఖయొకటి దక్షిణముగా వ్యాపించియుండును. అదియే పాలకొండయనునది. పడమటిభాగమునందు ఎఱ్ఱమల యనునది కలదుగాని యదివెలిగొండవలెఁగాక యందందుఁదెగి గుట్టలు గుట్టలుగాఁ గనఁబడుచుండును. దానిశాఖయొక్కటి పడమటిదిక్కునుండి తూర్పుగా వ్యాపించును. కావునఁ బడమటిదిక్కునందును, గొంతవఱకు నుత్తరదిక్కునందుఁ గొండ లీమండ

లము హద్దుగాలేవని చెప్పవచ్చును. మొత్తముమీఁదఁ జాలభాగము కొండలు కోటగోడలవలె నున్నవి. కాఁబట్టియే యీ మండలమును జయించుటకుఁ గష్టమనవచ్చును. పెక్కుమంది రాజు లీమండలమునాక్రమింపఁ బాటుపడుట పైమాటల కొక యాధారము. దీనినాక్రమించి ప్రభుత్వము నెలకొల్పినచో మరల నది నశింపదని వారిభావమై యుండవచ్చును. కొంతవఱకదిబాగుగనే యున్నదని నాభావము. కనుమలను గాపాడుచుండినచో శత్రువులు స్వేచ్ఛగా రా వీలుండదుకదా. కనుమలను రక్షించుటకు గొప్పసైన్య మక్కఱలేదు. కొలఁదిసేనయే చాలును. పరరాజులు పెక్కుసేనలంగొనివచ్చి యెంతోకష్టముల పాలైనఁ గాని యాకనుమలను స్వాధీనముచేసికొనఁ జాలరు. కాఁబట్టి యెట్టులైన నీమండలమునుజయించిన రాజ్యలక్ష్మి మన యింట నుండునన్న నమ్మకము రాజులకుం గలదని మన మూహింపవచ్చును. ఈవిషయము ముందుముం దీపుస్తకమును జదువు నపుడు మీరే కనుఁగొనఁ గలరు. నగరమునకుఁ గోటయుండుట మంచిదని యాకాలమున రాజులవిశ్వాసము. ఈకాలమునఁగల యాయుధవిశేషములంబట్టి కోటలు నిరుపయోగకరములని తెలిసినదికాని యాయుద్ధసాధనములులేని యాకాలమున నవి ముఖ్యములనియే విశ్వాసముండుట తప్పుగాదు. మండలమునకుఁ బర్వతములు సరిహద్దులయందుండుట యాకాలమునఁగాక యీకాలమునందుఁగూడ మిగుల మంచిదనక తప్పదు. ఆయుధములచేఁ గొండలు పిండిచేయుట సామాన్యమా. సాధ్యమా. అందును గొప్పపర్వతములను భస్మముగాఁ జేయుట మనుష్యబుద్ధిచే నూహింప నశక్యమని తోఁపకపోదు.

చుట్టును జాలభాగము కొండలుండుటంబట్టి యీకడపమండలము కోటగోడలనడుమనుండు గొప్పనగరమువలె నుండును. కాని పర్వతము లెత్తుభాగమున నున్నవి. జనులుండు భూభాగము తగ్గుగానుండును. కావుననే కాఁబోలు సాధారణముగా నీభూభాగ మారోగ్యవంతము కాదందురు. కడపనగరమునకే యీపేరుకాని తక్కినభాగమునకుఁ గాదని కొందఱిమతము. భూమి తగ్గుగానుండుటచే నెండలు మెండుగానుండును, వేసవికాలమున నిందున్నవారికి నెండవలని తాప మెక్కువ. ఐనను ఎండవడచే నీకడపమండలమున నపాయములేదని తీర్మానింపఁబడినది. కర్నూలు నెల్లూరు లోనగు తావుల నెండవడచే నపుడపుడు ఆకస్మికమరణములు సంభవించుచుండును. అట్టిదుర్గతి యీమండలమున లేదు గాన నిది నివసింప నర్హమేయని నాభావము. వర్షము లీభాగమునఁ దక్కువ యనవచ్చును. ఏలయనఁగాఁ దూర్పున వెలిగొండ కలదు. సముద్రమునుండివచ్చు చల్లనిగాలి యాపర్వతమున వ్యాపించును. పడమటిభాగమునుండి సముద్రపుగాలి యీపర్వతమును దగులదు. కాఁబట్టి కొండలనడుమనున్న యీమండలమున వర్షము లల్పములు. దూరదేశమునుండి జలమును గొనివచ్చునదులు విశేషించి లేవు. ఈకారణములచే నెండలు మెండుగనుండును. కాని యవి ప్రజలకపాయమును గల్పించునట్టివి కావు. ఎండకాలమున నివసింప నర్హములగు చల్లనితావులు ప్రకృతము కడపమండలమున నొక్కటిరెండుతప్ప లేవు. రాజంపేటతాలూకాలోని కోడూరు వానిలో నొకటి. రాయచోటి రెండవది.

పుణ్యక్షేత్రములు.

ఈమండలమునఁ బుణ్యక్షేత్రములు కొన్నిగలవు. అందుఁ బుష్పగిరియొక్కటి. ఇది పినాకినీతీరమం దున్నది. గ్రామము మిగులఁ జిన్నది. గ్రామమునఁ బ్రాచీనకాలమునఁ గట్టఁబడినశివాలయ మున్నది. పినాకినికిఁ దూర్పుభాగమున నొక కొండ గలదు. దానికిని గ్రామమునకునడుమ పినాకిని యున్నది. ఆగట్టుమీఁదనే చెన్నకేశవస్వామిదేవాలయము గలదు. అందే శివాలయముకూడఁ గలదు. వానిముం దొకగోపురము పెద్దదిగా నలువదిసంవత్సరములకుఁబూర్వము కట్టఁబడినది. వైశాఖమాసమున నక్షయతృతీయాదినమున గొప్పయుత్సవము జరగును తైర్థికు లనేకులు వత్తురు. కొండమీఁదినుండి సోపానముల వరుసగా దాఁటుచు గరుడవాహనారూఢుఁడై శ్రీ చెన్నకేశవస్వామి విజయంచేయునపుడు చూడఁజూడ వేడుకగానుండును. నదియందుఁ బెక్కుతావుల యాత్రవచ్చినవారికిఁ జలిపందిరులుపెట్టి నీరుమజ్జిగ, మంచినీరు, వడపప్పు, పానకము నిచ్చుచుందురు. నేరేళ్లపల్లె రామకృష్ణశాస్త్రులుగారు, మాడుగుల సుబ్బయ్యగారును వచ్చినబ్రాహ్మణుల కన్నదానము మూఁడుదినములు చేయుదురు. పలుతెగలవారి కాయాతెగలవారు కూడ నుచితరీతి నుపకరింతురు. పుష్పగిరిపీఠాధిపతు లగు స్వాములవారిమఠ మిందుఁగలదు. శివాలయమందుఁ బెక్కుశాసనములు గలవు. శివాలయము చాలకాలముక్రిందటఁ గట్టఁబడినట్లు స్పష్టమగును.

ఒంటిమిట్ట.

ఇది సిద్ధవటము తాలూకాలోనిది. పినాకినికి దక్షిణభాగమున మూఁడుక్రోశముల దూరమునం దున్నది. ఇందుఁ గోదండరామస్వామిదేవాలయ మున్నది. అదియొకపర్యాయము కట్టఁబడక మూఁడుపర్యాయములకు గోపురముతోఁటి పూర్తిచేసినట్లు కనుపట్టును. ఇందు సీతారామలక్ష్మణులవిగ్రహము లొక్కరాతియందే శిల్పి నైపుణ్యమున నమర్చెను. ఆకారణమున దీని కేకశిలానగర మనుపేరు కలదు. ఇది పూర్వము చాలపెద్దపట్టణమయినట్లు గురుతులంబట్టి చెప్పవచ్చును. కోట పెద్దదిగా నుండిన గుఱుతులిప్పటికి నున్నవి. గ్రామమున నొకచో బురుజిప్పటికిని గనఁబడును. ఉత్తరమున నొకక్రోశమాత్రదూరమున నుండుభూములకుఁ గోటభూము లనుపేరు గలదు. నాల్గుదెసలదేవాలయములు గ్రామదేవతలకుగాఁ గట్టఁబడినవి. వీనింబట్టి పరిశీలింపఁగాఁ బూర్వమీగ్రామము పెద్దనగరముగా నుండి క్రమక్రమముగా నిట్టిస్థితికి వచ్చినదని యూహించుట న్యాయమేయనక తప్పదు. దేవాలయమునకు మిక్కిలిసమీపమున దక్షిణభాగమున విశేషమువ్యాపించి పశ్చిమభాగమున నించుకవ్యాపించిన తటాకము గలదు. చుట్టును బర్వతములు గలవు. తూర్పుభాగమున చెఱువుకట్ట గలదు. చెఱువునకు నుత్తరభాగమునంగూడఁ గట్ట కట్టఁబడినది. చాలభాగము చిన్నగుట్టయే దీనికిఁ గట్టవలెనుండును. తూర్పున నొకచిన్నమిట్టకు దక్షిణభాగమునందుఁ జెఱువుకట్టకుదగ్గర నొక సరస్సున్నది. అది చిన్నదిగానున్నను సదాజలము సమృద్ధిగా నుండును. దీనికి రామతీర్థమని పేరు. ఇప్పటి కించుమించుగా నాలువందల

సంవత్సరములక్రింద నీయేకశిలానగరమున బమ్మెరపోతన యను మహాకవి యుండెను. ఈరామతీర్థమం దామహాభక్తకవిపుంగవుఁడు స్నానముచేసి శ్రీకోదండరామాలయమునఁ గూరుచుండి శ్రీభాగవతమును దెనిఁగించెనని చెప్పుదురు. రామతీర్థమునకుఁ బ్రక్కన వరిపొలములు గలవు. చెఱువుకట్టమీఁదఁ జక్కనిబాట గలదు. అది తిరుపతిమీఁదుగా రామేశ్వరమునకుం బోవును. పోతనగారి కాచెంత వరిపొల ముండినట్లు, తానే కృషికర్మమును బుత్త్రునింగూడి చేయుచుండినట్లును, శ్రీనాథుఁడు పల్లకిలోఁగూరుచుండి పోతనను జూడవచ్చెననియు నొకకథను జెప్పుదురు. ఈగుఱుతులన్నియు నీయొంటిమిట్టయందుఁ గలవు. బొమ్మారమనుగ్రామము లీమండలమునఁ బెక్కులుగలవు. అందొకచోట నీపోతన పూర్వులో పోతనకవియో కాపురముండి యొంటిమిట్టకుఁ జేరినందున బమ్మెరవారను పేరు వచ్చియుండవచ్చును. బమ్మవరమనియు బొమ్మారమనియు జనులు వాడుగ్రామములు గలవు. తఱచుగా నింటిపేరిట్లేవచ్చును. కావున బమ్మెరవా రనునింటిపేరు పోతనగారికి వచ్చెను. వీరికుటుంబమువారియొంటిమిట్టయందుఁ జిరకాలము నివసించిరని నేటివఱకుఁ బ్రతీతికలదు.

ఈదేవాలయమునఁ బోతనభాగవతమునకుఁ దాంబూలమిచ్చు మర్యాద కలదు. ఈదేవళమున వేంచేసియున్న రామమూర్తినిగూర్చియే

క. నిగనిగ మెఱయు కిరీటము
ధగధగ మనుపట్టుదట్టి తగినకటారుఁ

భుగభుగవాసన నీకే
తగుఁ బగురా యొంటిమిట్ట దశరథరామా.

అనుపద్యమును బఠింతురు. ఈ దివ్యక్షేత్రమునఁ జైత్రమాసమున బ్రహ్మోత్సవము సాగును. దొరతనమువారీ దేవాలయమునకుఁ గొంతద్రవ్య మిత్తురు. ఇది ప్రాచీనరాజపోషితముగాక క్రొత్తదియైన నీసమ్మానము కలిగియుండదనక తప్పదు. విజయనగరరాజులలో నొకఁడగు సదాశివరాయలు శ్రీకోదండరామస్వామిని దర్శించి స్వామికైంకర్యమునకుగా భూదానము చేసినట్లు దేవాలయమునందే శాసనము కలదు. ఇది యాకాలమునకుముందే యీదేవాలయము సుప్రసిద్ధమని తెల్పకమానదు. ఒంటిమిట్ట చుట్టునున్నపర్వతములలోఁ బెక్కుగుహలు గలవు. వానియందు మహర్షు లున్నవారని యొకప్రతీతి గలదు. అందుఁ జిదానందయోగి బమ్మెరపోతనామాత్యునకు దర్శనమిచ్చి మంత్రోపదేశము చేసెననియుఁ బదాదిగా ఆయన కవిత్వముచెప్ప నారంభించెననియుఁ జెప్పుదురు. ఈజనప్రమాదముగ నేచోటనైన శాసనముకలదా యన్నఁ జూపఁజాలనుగాని ప్రతివిషయమునకు శాసనము లున్నవా యని ప్రశ్నించుటమాత్రము న్యాయవిరుద్ధమని చెప్పఁగలను.

లక్ష్మీపాళెము.

ఇది బద్వేలు (పెద్దప్రోలు) తాలూకాలోనిది. బద్వేలునకు నుత్తరభాగమున నొకక్రోశమునఁ గలదు. దీనికి "అనంతరాజపుర"మని పేరుగలదు. ఇదియే దొరతనమువారిచే సంగీకృతమైనది. లక్ష్మీపాళెమను పేరును జను లుపయోగింతురు. ఇది పదునేడవశతాబ్దియందు మట్లి అనంతరాజుచేఁ గట్టింపఁబడినది. పెద్ద

చెఱువు కట్టించి దానిచెంతనే యీయగ్రహారమును నిర్మించి యిందు శ్రీప్రసన్నవేంకటేశ్వరదేవాలయమును గట్టించెను. ఇందు దొరతనమువారిద్రవ్యసహాయముచే నిప్పటికిని బ్రహ్మోత్సవము సాగును. వేనవేలు తైర్థికు లిటఁ జేరుదురు.

రామేశ్వరము.

ఇది ప్రొద్దుటూరుతాలూకాలోనిది. ప్రొద్దుటూరు చెంతనున్నది. ఇం దనేకశాసనములు గలవు. ఇది శివక్షేత్రము. దక్షిణమున నున్న రామేశ్వరక్షేత్రమునకుఁ బోఁజాలనివారు కాశీతీర్థము నిందు నభిషేకించి యాత్ర పూర్తి యయ్యెనని సంభావింతురు.

అత్తిరాల.

ఇది రాజంపేటతాలూకాలోనిది. బాహునదీతీరమునఁ గలదు. ఇది శివక్షేత్రము. మహాశివరాత్రినాఁ డిట గొప్పయుత్సవము సాగును. ఇది ప్రాచీనక్షేత్రము. ఇందు బ్రహ్మోత్సవముసాగునపుడు పుణ్యాత్ములు యాత్రార్థుల కన్నదానము చేయుదురు. ఇందుఁ బరశురామునకు మాతృహత్యవలనఁ బ్రాప్తించినదోషము తొలఁగెననియు నందుననే హత్యరాలుట అత్తిరాల యనియాయెననియుఁ జెప్పుదురు. ఈయర్థము సమంజసముగాఁ దోఁపదు. మట్లిరాజులకాలమున నిందున్న బాహుదానదిమడుఁగులో నేనుఁగులఁగడుగుట యాచారముండినదనియు దానిని గట్టివేయుటకు గాఱాలనందందుఁ బాతియున్నట్టి గుఱుతులు కలవనియు నందున నీపేరు వచ్చినదనియుఁ గొంద అందురు. ఇది యించుకబాగున్నట్లు తోఁచెడిని.

దీనియర్థమేమో తెలిసికొనఁ బ్రయాసమొందుట కాకదంతపరీక్షవలె నిరర్థకము. ఈక్షేత్రమునఁ బ్రతిష్ఠింపఁబడిన శివలింగమునకు "త్రేతేశ్వరుఁడ"ని పేరు. బాహుదానదిగట్టున నైదుశివాలయములు గలవు. వీనియాత్రకుఁ బంచక్రోశయాత్రయని పేరు. సంగమేశ్వర, పాలేశ్వర, కన్నేశ్వర, భీమేశ్వర, త్రేతేశ్వరులని యీ యైదుశివలింగములకుఁ బేరులు. గుడిగుంటపల్లెదగ్గర సంగమేశ్వరాలయము, మందపల్లెయొద్దఁ బాలేశ్వరము, పాటూరుచెంతఁ గన్నేశ్వరము,' శేషమాంబాపురము సమీపమున భీమేశ్వరము, అత్తిరాలకడఁ ద్రేతేశ్వరము అనునవి కలవు. ఈ యైదుశివాలయములు బాహుద కిరుగట్టులయందుఁ గట్టఁబడి నిత్యనైవేద్యదీపారాధనార్థము మాన్యక్షేత్రము లీఁబడినవి. అత్తిరాలదగ్గరనున్న త్రేతేశ్వరమను మాటనువిని త్రేతాయుగము శ్రీరామునికాలముగాన నపుడు పరశురాముఁడుండుటంబట్టి అత్తిరాలయనుమాటకు హత్యారాలయని కల్పించియుండిన నుండవచ్చు. ఈయైదుక్షేత్రములలో నత్తిరాల సుప్రసిద్ధము.

మతములు.

ఈమండలమున నుండుప్రజలు తఱచుగాఁ గ్రొత్తవిషయమును నమ్ముచుండుస్వభావము కలవారు. కాఁబట్టి యీభాగమున వేదాంతులమని పేరుపెట్టుకొని ద్రవ్యము సంపాదించువా రుందురు. దత్తమండలములలో (కడప, కందునూలు, బళ్లారి, అనంతపురములు.) నీవేదాంతవ్యాపారము సాగుచుండును. ఇది యిప్పుడు విశేషముగా వ్యాపించుచున్నది. పామరులెక్కువమందియుండుటయే యిందులకుఁ గారణము.

క. వినఁదగు నెవ్వఁడుచెప్పిన
వినినంతనె వేగపడక వివరింపఁదగున్
గనికల్ల నిజముతెలిసిన
మనుజుఁడెపో నీతిపరుఁడు మహిలో సుమతీ.

అన్న న్యాయమీమండలమునఁ జెల్లదు. ఒక్కొక్క వేదాంతవ్యాపారశీలునకుఁ దక్కువపక్షము నాలుగువందలమంది శిష్యులుందురు. వీరెల్ల వారియొద్ద నుపదేశముపొంది మోక్షమునకుఁ బోఁగలమను నమ్మకముగలవారే. గురువెట్టి తప్పులనొనర్పుచున్నను, అవి తమకుఁ జక్కఁగాఁ దెలియుచున్నను వారిని దప్పులఁబట్టిన మహాపాపమని వారు భావింతురు. ఇట్టిశిష్యులు దొరకినపుడు గురువునకు శ్రీదేవియు భూదేవియు లభించుట చిత్రముకాదు అక్షరజ్ఞానమైనను లేనివారు పురుషులు స్త్రీలుకూడ వేదాంతవిక్రయవ్యాపారము చేయుచుందురు. ఇది నాయనుభవముననే యెఱింగితిని.

విద్య విశేషముగావ్యాపించిన యీకాలమందే యిట్లుండ నిఁక నింతకుఁ గొంతముందటికాలమున నీవిషయ మీభాగమున నెట్లుండునో యూహింపశక్యమే కాని దురూహ్యము కాదు. కాని యీవిషయమునఁ బూర్వకాలమున మతస్థాపకులలో నిద్దఱుముప్వురు తత్త్వజ్ఞు లుండిరని విన్నవాఁడను. ఆ మతస్థాపకులనుగుఱించియే నాలుగుమాటలు వ్రాసెదను.

గోవిందస్వామి.

వీరు బద్వేలుతాలూకాలోని పలుగురాళ్లపల్లెయందుండిరి. నూటయేఁబదిసంవత్సరములకు మించనికాలమున వీ

రుండిరి. వీరు శాక్తులు. పెక్కుమంది శిష్యులు వీరికుండిరి. మాఘశుక్లపూర్ణిమయందు వీరికారాధన మిప్పటికిని సాగుచుండును. వారుండినకాలమున మాఘశుక్లపూర్ణిమ వారికి మంత్రోపదేశము చేసినదినమని యుత్సవము జరపఁబడుచుండెడిది. వారికిఁ ద్రికాలజ్ఞులను ప్రఖ్యాతి కలదు. ప్రతిగ్రామమునుండియు వారికిఁ గ్రొత్తగాఁ బండినవస్తువులను శిష్యులు సమర్పించుట వాడుక.

వారొకనాఁడు శిష్యులనడుమఁ గూరుచుండి మాటలాడుచు నసంగతముగా "హుంకారమును" జేసిరఁట. అదేమని శిష్యు లడిగిరఁట. వారు నవ్వి నల్లమలయందు మాయావును బెద్దపులి పట్టుకొనదుముకఁగా నదలించితిని. మఱేమియుఁగాదని బదులు చెప్పిరఁట. అందుఁ గొందఱు పోయి పరీక్షింపఁగా గోవుదేహమునఁ బెద్దపులిగోరులు దిగియుండి రక్తము వచ్చుచుండెనఁట. దానిని దోలుకొనిరాఁగా వారు కరస్పర్శమున దానిభీతి మాన్పిరఁట. వారు చేసిన మహాకార్యములలో నిది యొకటియని చెప్పుదురు. పలుగురాళ్లపల్లెకుఁ బడమటిభాగమున నల్లమలయుండుట నిజము. అందుఁ బెద్దపులులాకాలమున విశేషించి తిరుగుచుండెననుటయు సత్యము. ఆవుల నవి పట్టిభక్షించుటయు యథార్థము. పులి పట్టుకొనినపుడు వీరు హుంకారమున దానిఁ బాఱఁదోలిరనుట యెంతవఱకు యథార్థమో చెప్పఁజాలను. పులిపట్టుకొనఁబూని పైకి దుముకకమునుపే వీరు హుంకరించియుండిన బాగుండును. ఆదెబ్బలైనను దానికిఁ దప్పియుండును. ఈకథ వారియం దెక్కువ నమ్మకముగల వారెవ్వరో కల్పించియుందురని నాయూహ. జరగియుండినను

జరగియుండవచ్చును. అయితే తత్త్వవేత్త లిట్టివిషయముల నితరులకుఁ దెలియకుండఁ జేయుదురని నానమ్మకము. "మహిమఁ జూపువాఁడు మధ్యముండు." అని వేమనమహాకవి చెప్పియున్నవాఁడు. బుద్ధిమంతు లిట్టివిషయముల నమ్మరు. నమ్మువారుండరని నేను నిర్ణయింపఁజాలను. ఇట్టిమహత్వములు తఱచుగా వీరు జనులకుఁ దెలియఁజేయువారనిమాత్రము చెప్పఁగలను. అందొకకథ యీపైమాటను దృఢపఱచుచున్నది.

కడపమండలాధికారి (కలెక్టరు)గారు ప్రొద్దుటూరు తాలూకా మైదుకూరులోనుండి గ్రామాధికారులతో మాటలాడుచుండిరి. గోవిందస్వామిగారు వారికెదుట నిలుచుండి చేతులు పిసికికొనుచు నయ్యో అయ్యోయని పరితాపపడుచుండిరి. దొరగారదిచూచి యేమియో కనుఁగొనుఁడనిరి. కాంచీనగరమున శ్రీవరదరాజస్వామి కెదుటనున్న తెరవస్త్రము కాలిపోవుచున్నదని చెప్పిరి. ఇప్పుడు కాలుచున్నదా అని మరలఁ బ్రశ్నించిరఁట. అవునని యుత్తరము చెప్పిరఁట. అప్పుడే చెంగల్పట్టుమండలాధికారికి వ్రాయఁగా సత్యమే అని బదులు శ్రీముఖము వచ్చెనఁట. అప్పుడు వారానందించి ప్రొద్దుటూరు తాలూకా రామేశ్వరమునొద్దనుండు దొరసానిపల్లెలో మూఁడుతూముల (3 ఎకరముల) వడ్లు చల్లఁదగినభూమిని పారితోషికముగా నిచ్చిరఁట. ఈభూమి నిచ్చినవార్త సత్యమేయని దొరతనమువారి లెక్కలనుబట్టియే తెలియవచ్చుచున్నది.

దీనింబట్టి యూహింపఁగా నీ గోవిందస్వామి మహిమమును జూపి గౌరవమును ద్రవ్యమును సంపాదింప నిష్టము గలవాఁడనియు, వైరాగ్యసంపద లేనివాఁడనియు స్పష్టము

కాకపోదు. "దూరవార్తను దెల్పుట గొప్పకాదా" యన్న గొప్పశక్తియే యనుట నిస్సంశయము.

వీరబ్రహ్మము.

వీరినివాసము కందిమల్లయ్యపల్లె. ఇదియు బద్వేలుతాలూకాలోనిదే. బద్వేలునకు వాయవ్యమున నల్లమలకుఁ జేరువగా నుండును. చుట్టుపట్లగ్రామము లంతయెక్కువగ లేవు. వేసవికాలమున నీభాగమున నీరుదొరకుట కష్టము. బావులు గలవుగాని యందుదిగి మరల వచ్చునప్పటికి శ్రమపడవలసి యుండును. వీరయ్య యనునతఁడు కంసాలితెగకుఁ జేరినవాఁడు. ఆ గ్రామమున నీతఁడు పదునెనిమిదిమందిపనివాండ్రలో నీతఁ డొకఁడు. చిన్నతనమునుండి వారి తెగలోనివారివలెఁగాక వెఱ్ఱివాఁడుగా నుండువాఁడు. ఎవఁ డేపనిచెప్పినను జేయుచుండును. ఈతని నందఱు పిచ్చివాఁడని పరిహాసముగాఁ బలుకుచుండువారు.

ఒకనాఁడు గ్రామాధికారి వీరయ్యను బిలువనంపి గ్రామదేవతకు నుత్సవము చేయవలయును. ఈవేడుకకు (జాతరకు) అమ్మవారికి బండి చేయవలయును. ఆపని నీది. సాయంకాలమునకు సిద్ధపఱుపుము. అని యుత్తరువుచేసి తనపని చూచుకొనుచుండెను. ఆయుత్సవము సందడిలో నీతనిమాటమఱచి అమ్మవారిని బండిమీఁద నెక్కింపవలసినసమయమున వీరయ్యను బిలిచి బండి సిద్ధము చేసితివా అని యడుగ లేదని యుత్తరమిచ్చెను. బండి ముఖ్యమని తెలియదా యని యధికారి గద్దించి యడిగెను. వీరయ్య యూరకుండెను. అమ్మవా రెట్లుసాగిపోవునను కొంటివిరా మూఢుఁడా యని యాయుద్యోగి పలికెను. అప్పుడు వీరయ్య "బండిలేకున్న అమ్మవారుపోలేదా" యని బదులిడెను. అధికారి కోపమున, ఛీఛీ మూర్ఖుఁడా యెట్లునడిపింతువో నడిపింపుము. నడువకయున్న నిన్నుఁ బ్రహరింతునని పలికెను. వీరయ్య ముసిముసినవ్వులు కనఁబఱచుచు నెల్లవారువినుచుండఁగా నా "పోలేరమ్మ" యెదుటికిఁ బోయి "ముండా లేచిరా. రథముమీఁదఁగాని సాగిపోఁజాలవా" అని గట్టిగాఁ బలికెను. ఆమాట యతనినోటనుండి వెడలఁగానే గునగుననడిచి యూరు దాఁటిపోయి తా నుండఁదగుతావున నిలువఁబడియెను. అప్పు డాయూరివారెల్ల నితఁడు మహాత్ముఁడని తలంచి గౌరవించిరి. గ్రామాధిపతి యపరాధమును మన్నింపుము. పామరుఁడనై యెఱుఁగక పలికి నని వేఁడుకొనియెను. వీరయ్య సంతోషమున నతనిభీతిని బాపి తనయింటికిం బోయెను.

అదిమొదలా వీరయ్యను భక్తిచే నెల్లవారు కొలుచుచుండిరి. ఆయన రాఁబోవుకాలమును గుఱించి యందఱ కుపదేశించుచు వేదాంతమును పాటలమూలమున నందఱకుఁ దెలుపుచు నుండెను. అట్టిస్థితియం దాతని వీరబ్రహ్మమని పిలువసాగిరి. వీరయ్యయే బ్రహ్మమని యంద అభిప్రాయపడిరి. ఆపాటలే యివియని యెందఱో యిప్పుడును పాడుచుందురు. ఒక్కపాట నిందు వ్రాసెదను

"గొప్పకులములెల్లఁ గూలిపోవుచునుండు
తప్పకయల్పులు తలయెత్తుచుందురు
హరిగోవిందా గోవింద.

కందిమల్లయపల్లె కాశీయేయయ్యాని
కాశికేగెడువారు కలుగరుబ్రహ్మాము
హరిగోవిందా గోవింద.

బంగారమెల్లను బరువుగాఁ దోఁచును
పాడుసొమ్ములు మేలుపడునయ్య బ్రహ్మాము
హరిగోవిందా గోవింద."

ఇట్టివి వేనవేలుకలవు. వారిపేర మఱెవ్వరైనవ్రాసినను వ్రాయవచ్చును. వీరబ్రహ్మాము భార్య యీశ్వరమ్మ. వీరిబంధువులు అల్లాడుపల్లెలో పోతులూరయ్య యనువా రుండిరి.

అల్లాడుపల్లెలో హరిపోతులూరయ్య
అయ్యచెప్పినవాకు దప్పదుబ్రహ్మాము
హరిగోవిందా గోవింద.

అనుపాట పైయర్థమును దృఢపఱచెడిని.

ఈవీరబ్రహ్మామునకు దూదేకులసిద్దయ్య శిష్యుఁడుగానుండెను. ఆతనిది ముడుమూల యనుపల్లె. ఈగ్రామములన్నియు నేను జూచితిని. కందిమల్లయపల్లెలో వీరబ్రహ్మాముగారిని స్థాపించిన సమాధి గలదు. దానికే వీరబ్రహ్మాముమఠ మందురు. ముడుమాలలో సిద్ధయ్యగారికి మఠముకలదు. వారివంశస్థులమని చెప్పుకొనుచు జీవించువా రెందఱో కలరు. వీరు ద్రవ్యార్జన మాపేరులను జెప్పుకొనియే చేయుచుందురు. శివరాత్రికి కందిమల్లయపల్లెలో గొప్పయుత్సవము సాగును. దూరదేశములనుండి కంసాలివారును మఱికొందఱుభక్తులును వచ్చి చూచిపోవుచుందురు. ఈవిషయమంతయు నాఁటినుండి నేఁటివఱకు

జనులు చెప్పుకొనుచున్నవియే కాని నాకల్పించినది కాదు. బద్వేలుతాలూకాలో నెల్లరకు నీకథలు కాలక్షేపమున కుపయోగించుచుండును. నాచిన్నతనమున నీకందిమల్లయపల్లియుత్సవమును జూచితిని. వీరబ్రహ్మాము సమాధిస్థాపింపఁబడిన కొంతకాలమున కెవఁడో భక్తుఁడు పైనిస్థాపించియుండు పాషాణము తీసి చూడఁగా వీరబ్రహ్మాము కూరుచుండియుండినట్లు దీప మానాఁడుపెట్టినది యట్లె వెలుఁగుచుండినట్లు కనఁబడెననియు నావెంటనే యీభక్తునకుఁ గన్నులు కానరాకపోయెననియుఁ జెప్పుదురు. ఇట్టికథలకు మేరయుండదు. ఇం దెంత సత్యమున్నదో పాఠకులే యూహింతురుగాక. దీప మానాఁటి దట్లె యుండెననుట యసంగతప్రసంగమేయనుట కేసందియము లుండవు. ఇట్టివి కల్పించుటలోఁ బామరుల కెక్కుడుశక్తిగలదనుటయుఁ బైయట్టిదే.

ఇందూరు అప్పయ్య.

ఈయన యోగి. పోరుమామిళ్లయొద్ద రంగసముద్రమను గ్రామమున నుండెను. మాధ్యందినీయశాఖకుఁ జేరినబ్రాహ్మణుఁడు. ఈదేశమున నీశాఖవారినిం బ్రథమశాఖవా రందురు. వీరిది శుక్లయజుర్వేదము. ఈయన చిన్నతనమునఁ జదువుకొని పండితుఁడై యుండలేదు. నియతవ్రతుఁడు మాత్రమేయైయుండెను. మహిమములఁ జూపఁదలఁచుకొన్నవారిలో వీరి పేరు చేర్పరాదు. క్రమముగా బ్రహ్మచర్యము, గార్హస్థ్యము ననురెండాశ్రమములఁ జక్కఁగా నెఱవేర్చెను. ఒక్కకుమారుఁడు కల్గెను. ఆమీద భార్య మృతినందెను. తదాదిగా వానప్రస్థమునాశ్రయించి వనములలోను, దేవాలయములలోను

నివసించువాఁడు. తెల్లవాఱుజామున స్నానముచేసి యొకజాముపఱకు ధ్యాననిష్ఠ నుండువాఁడు. అత్తఱి నీయనదేహము నిండఁ బెద్దచీమలు ప్రాకుచుండెడివి. ఇంచుకంతయుఁ జంచలింపక తననియతిని దీర్చువాఁడు. ఆ నియతిం గాంచి చాలమంది తమకేమే నుపదేశింపుమని ప్రార్థింప వారికి శ్రీరామనామము జెప్పుచుండెను. ఈయనను జూచినవారిలో నాతండ్రియు నొక్కరు. ఈయనభార్య మృతినొందినపిదప భోజనమును మాని యొకదారుపాత్రము ధరించి యది పట్టినన్నినీరు త్రాగి యుసిరికకాయయంత వరిపిండి ముద్దచేసి భక్షించియుండెడివాఁడు. సదా మనుష్యసంగతి కెడముగానుండుట యీయన యలవాటులలో నొకటి. పలువురను జేర్చుకొని గొప్పపేరు సంపాదింపఁ బూనినవాఁడు కాఁడు. గ్రామములకు దూరముగా నుండు దేవాలయములలో నివసించుట యీయనకు మిగులఁ బ్రీతి. ఈయన నెఱింగినవారు నాబంధువులలో నిప్పటికిద్దఱున్నవారు. వీ రీశ్వరసంవత్సరమున ననఁగా నేఁటి కేఁబదిసంవత్సరముల క్రిందటనే సిద్ధిపొందిరి.

కడపకాపురముగా వారణాశి వెంకోబరావుగా రుండిరి. వారు బద్వేలుతాలూకా కధికారిగా నియమింపఁబడిరి. వీరికి సంతానము లేకుండెను. వీ రొకతఱిఁ బోరుమామిళ్లకుఁ బోయియుండి యాయనమహాత్వమును విని రంగసముద్రమునకుఁ బ్రాతఃకాలముననే వెళ్లిరఁట. రంగసముద్రము పోరుమామిళ్లకు సగముక్రోశము (ఒక్కమైలు) దూరమున నున్నది. అప్పయ్యయపుడు మామిడిచెట్టుసమీపమున దున్నియున్నభూమిలోఁ గూర్చుండి నియతవ్రతమును సాగించుచుండెనఁట. నాలుగు

గడియలప్రొద్దుకు మించియుండెనఁట. దేహమునిండఁ జలిచీమలు క్రమ్మి తిరుగుచుండెనఁట. ఆయనరూప మప్పు డొకవృక్షమును బోలియుండె ననవచ్చుఁగదా. వీరందఱు నందుఁ జెట్లక్రిందఁ గూర్చుండిరఁట. మఱికొలఁదిగడియలకు వారు నియమము మాని మెల్లన లేచి చీమల మెల్లమెల్లనఁ దొలఁగించుకొనుచు లేచి చెట్టుక్రిందికి వచ్చి యందఱకుశల మడిగెనఁట. వెంకోబరావుగా రొకవెండిపళ్లెమునిండ రూప్యములను బోసి యాపై నొకపట్టువస్త్రము నునిచి వారిపాదములకడ నునిచి శిష్యుని గృహార్థుని జేయుఁడని ప్రార్థించెనఁట. క్షణమూరకుండి యాయన నవ్వి యీద్రవ్యముతో భూతతృప్తి చేయవలయుననియు, ద్రవ్యము నీచేతముట్టననియుఁ జెప్పి యాపట్టువస్త్రమును వెంకోబరావుమెడపై వేసి దీనిధరించి భగవంతుఁ బ్రార్థింపుము. సంవత్సరమునకుఁ గొడుకుపుట్టును. అని మఱియాదగాఁ బలికి తనంతన లేచిపోయెనఁట. వారా తాలూకాలోనుండఁగనే కొడుకు పుట్టెనఁట. వారానందించి యిట్టివారే త్రికాలజ్ఞులనిరఁట. ఈ వార్త నెఱింగినవారు పెక్కుమంది గలరు.

ఈయనతోఁబుట్టు వొకవితంతు వుండెను. ఆయమ యొకనాఁడు తమ్మునిబిలిచి యెల్లప్పుడు సంసారముతోడనే కాలము గడచెను. ఒక్కసారియైనను గంచిగరుడోత్సవమును జూడనైతినని వగచెనఁట. అప్పయ్య యామెనుజూచి అమ్మా! అదియొక గొప్పకార్యమా.? యనఁగా నాఁడే కంచికిం బోవువారిం దెలిపి నేఁ బోదుననియెనఁట. ఇపుడు వలదని వారించి చతుర్దశిపగటిపూట యామె మది కలఁతనొంది యుండు టెఱింగి రాత్రిజాముకాఁగా ఆమెనుబిలిచి తొడపైఁ గూర్చుండి కన్ను

లుమూసికొమ్మని తెలిపి యామె యట్లుచేయఁ గాంచీనగరమును జూడుమనియెనఁట. కన్నులు తెఱచునప్పటికిఁ గంచిలో నుండెనఁట. ఆరాత్రిగడపి వారిద్దఱు స్నానముచేసి శ్రీవరదరాజస్వామిని ద్వారమున దర్శించిరఁట. తమయూరివారందఱు కనఁబడి యెప్పుడువచ్చితిరనఁగా నిన్ననని బదులిచ్చెనఁట. ఉత్సవము తృప్తినొందింపఁజాలెనా యన నామె నాకిఁక నేయుత్సవములు వలదని సోదరుశక్తి మధ్యాహ్నమున కింటికిం జేరెనఁట. కంచి నుండి పిదపవచ్చిన యాయూరివారుచెప్పఁగా నీవార్త యెల్లకడల వ్యాపించెను. ఇట్టికథలు పెక్కుగలవు. స్థాలీపులాకన్యాయమున నొకటిరెండింటిని వ్రాసితిని. ఈకథలవిషయ మెట్లున్నను ద్రవ్యమునం దాశలేక యాహారమును మాని వైరాగ్యసంపద గలిగియుండిన ట్లెల్లవా రెఱుంగుదురు. ఈయోగి తన మహిమమును గనఁబఱుపకపోయినందునఁ గాఁబోలు ఈయన సమాధి నాశ్రయించినమఠము ప్రఖ్యాతిని గాంచలేదు. వీరి సమాధికి నిప్పటికిని నిత్యపూజ జరుగుచున్నది.

వేమనయోగి.

ఈయోగినివాసము కడపమండలమున కదిరితాలూకాలోని కటారుపల్లె. ఆగ్రామ మిపు డనంతపురమండలమునకు సంబంధించునట్లు చేయఁబడినది. ఐనను వారికుటుంబమునకు సంబంధించినవారమని చెప్పుకొనువా రీమండలమునఁ బెక్కుతావులఁ గలరు. కావున నీయోగిచరిత్ర మించుక వ్రాయక తప్పదు. ఈవేమన కాఁపుకులమునకుఁ జేరినయోగి. తన యనుభవమంతయు గీతపద్యములతో లోకమునకుఁ దెల్పెను. ఆ పుస్తకమును బట్టిచూడఁగా నాత్మజ్ఞాన మీయోగికి నుగ్గుతోఁ

బెట్టినట్లు తోఁపకమానదు. చిన్నతనమునుండి విరాగియై తిరుగుచుండును. ఎవ్వరైన బలవంతము చేసినఁగాని భుజించువాఁడు కాఁడు. జనసంఘమునకు దూరముగానుండుట యీయన కిష్టము. కుప్రశ్నము లెన్నివేసినను గోపపడక చక్కఁగా సమాధానము చెప్పువాఁడు. కాఁబట్టి యొక్కసారి యీయనతో మాటలాడినవాఁడు తన జన్మమధ్యమున నీయోగిని మఱచిపోవఁ జాలఁడు. వీరిమహిమమును దెలుపుకథలలో నొక్కదానిని వ్రాసి ముగించెదను.

ఒకనాఁ డొక్కయూరిలో గ్రామదేవతకు నుత్సవము సాగుచుండెనఁట. ఈయోగి యందుండెను. దేవతకు ముందు అన్నరాశిని (కుంభము)బోసి "అమ్మా దీనినిభక్షించి మాయూర నేలాటిబాధలు లేకయుండఁజేయుమా" అని ప్రార్థించుచుండిరఁట. వేమనయోగి యాత్రోవఁ బోవుచుఁ దనలోఁదానే నవ్వుకొనుచుఁ బోయెనఁట. కొందఱు యోగివెంటఁబోయి యేల నవ్వితిరని యడిగిరఁట. "ఱాలు దేవతలేని రాసుల మ్రింగవా" యనుపద్యము చదివిరఁట. వారిమాటల కచ్చెరువంది తమరు చేయుపని పామరజనసమ్మతమే యని యంగీకరించి యాయనకు శిష్యులై యాయనయుపదేశములఁ బరిగ్రహించి జ్ఞానులైరఁట.

ఇట్టికథ లెన్నియో చెప్పుదురు. వీరికుటుంబమువారమని చెప్పుకొనుచుఁ బ్రతిగ్రామము తిరుగుచు వేమనయోగిమహిమములఁ జెప్పుచు జీవించువారు పెక్కుమం దిప్పటికిని గలరు. వారు యోగులనియే జనులకు విశ్వాసము. ఇట్టివారి నీమండలమున నున్నవాఁడే కాఁడని వ్రాయఁబూనుటకన్న ఘోరతరకార్యము వేఱుగనుండదని నాయాశయము.

రాజ్యపాలనము.

ఈమండలమునఁగల విశేషస్థలములఁ గొన్నింటిని దెల్పితిని. ఇఁక నీమండలభూభాగము నెవరెవరు పాలించిరి? అను విషయము ముఖ్యముగా నెఱుంగఁదగినది. దానింబట్టి యీభాగ మీవిషయమునఁ బ్రసిద్ధమైనదని తేలును. మనము గ్రహింపఁదగినవిషయ మద్దియేకదా. కాఁబట్టి యాచరిత్రము నించుక వ్రాసెదను.

ఈమండలము కృతయుగమున నుండినదా లేదా. అప్పటి దీనిచరిత్ర మేమి? అనునవి కుప్రశ్నములు. కావున నట్టివిషయములకుఁ జోటీయక దొరతనమువారినుండి తెలియవచ్చినంత వ్రాయుట సరసము. ఈమండలము లోఁబడిన నిందు రాజ్యమును స్థాపించుకొని చుట్టునున్న రాజ్యముల నాక్రమింపవచ్చుననునూహ రాజులకెల్లఁ గలుగకమానదు. ఏలయన నీ కడపమండలమునకుఁ జుట్టుపట్ల నుండుపర్వతములు శత్రువులను రాకుండఁజేయ మిక్కిలి సాయపడును. కావున నిట్టితావుననుండి యల్పసైన్యముతో నితరరాజ్యమును సంపాదించుట సుకరమని యెల్లరకుఁ దోఁపకమానదు. కావున నెందఱో రాజులు దూరదేశములనుండి దండెత్తి వచ్చి చక్కనిపద్ధతులఁ బరిపాలింపఁబడకయున్న యీభూభాగము నాక్రమించిరి. చిరకాల మిటనుండి పరిపాలించి యన్యరాష్ట్రముల నాక్రమింపఁ గల్గిరి. ఈమండలమున మంచికోటలుండుటయు నవి సులభముగా జయింపశక్యముగాకుండుటయుఁ గ్రొత్తరాజుల కాశను బుట్టించెను. మఱియు నిందుండురాజులు కొలఁదిభాగములనే యాక్రమించి పరస్పరము కలహించుచునుండుటయు రెండవకారణముగాఁ

గ్రొత్తవారిని రప్పించెను. కొండలనుండి చిన్నచిన్ననదులు ప్రవహించుచుండుట, వేఁట కనుకూలము లగుతావులు పెక్కులుండుటయు మూఁడవకారణముగా నితరరాజులను రప్పింపఁజాలెను. ఇట్టి వెన్నియో కారణము లుండుటంబట్టియే యెందఱో దీని నాక్రమింపఁ గల్గిరి. కోటలలోఁ గొన్ని శత్రువులకు భేదింప శక్యముగానివిగ నుండినవి. వానినెట్లైన భేదించినఁగాని మనపౌరుషము ఫలింపదన్న యూహ కొందఱికుండెను. కాఁబట్టి యొకరిపైనొకరుగా నెన్నియోపర్యాయములు రాజులు దండెత్తి యీమండలమును బాధించిరి. ఇన్నికష్టములు కలుగుటచేతనే యీమండలమును విశేషించి ధనసంపన్నముగా నుండఁజాలనుండెను. యుద్ధములతోఁ బ్రజలకుఁ గష్టములు గలుగుటయేగాని భూమి తనసారమునుగూడఁ గోల్పోవును. ప్రజలు భీతులై యేవేళ కేరాజు యుద్ధముచేయవచ్చునో యని యఱచేతిలోఁ బ్రాణము లుంచుకొనియుండ నారాజ్య మెట్లు సారవంతముగ నుండఁగల్గును? అట్టిచిక్కు లీమండలమున కనేకపర్యాయము లనేకసంవత్సరములు తటస్థించెనని ముందు మీకుఁ దెలియఁగలదు.

ఇప్పటిస్థితి.

ప్రకృత మీమండలము తన పూర్వగౌరవము గొంత పోఁగొట్టుకొని యున్నదనవచ్చును. మదనపల్లి, వాయిల్‌పాడు, కదిరి అను మూఁడుతాలూకా లీమండలమునుండి వేఱుచేయఁబడినవి. వేసవికాలమునఁ జల్లనితావు లీభాగముల నొకటియగు మదనపల్లితాలూకాలోఁ గలవు. అట్టిభాగములు వేఱుచేయఁబడినందున వైశాల్యమునం దేకాక మఱికొన్ని విషయము

లందును వెనుకఁబడినదని చెప్పుట పొరపాటు గాదు. పర్వతమునకు శిఖరమును బోఁగొట్టినట్లు పైభాగములు విడదీయఁబడినవి. కాఁబట్టి యిప్పటి యీమండలము చాల స్వల్పమైనది. ఇప్పటి దీనివిస్తీర్ణము 5884 చదరపుమైళ్లని దొరతనమువారిచే నిర్ధారణ మొనర్పఁబడినది. చెన్నపురిరాజధానిలో ము న్నీమండలము రెండవదిగాఁ బరిగణింపఁబడి యిప్పు డాస్థానమునుండి తొలఁగవలసిన దైనది. జనసంఖ్యకూడ దీనితోఁ దగ్గినదనక తప్పదు కదా. పోయిన భూభాగములలోఁ గొన్నిముఖ్యములనఁదగినకోటలు గలవు. వానిచరిత్ర మీపుస్తకమున వ్రాయఁబడవు. పూర్వమర్యాదను గాపాడుటకొఱ కందందు సంగ్రహముగా మూఁడుముక్కలు వ్రాయఁబడును. కావున నిప్పటి యీమండలచరిత్రమునుమాత్రమే మీరు గ్రహింపఁగల్గుదురు.

పూర్వచరిత్రము, పల్లవరాజులు.

క్రీస్తుశకము 400 సం. లకు ముం దీమండలచరిత్రమును గనుఁగొనుట కష్టమని యంద ఱంగీకరించిరి. అనఁగా నప్పటిస్థితి అయోమయముగా నుండెను. దానిని బరిశీలించుటకైన నవకాశములు లేవు. అప్పటినుండి (400) కనుఁగొనునాధారములు కలవు. క్రీ. శ. 400 సం. పల్లవులను నొకతెగరాజులు కాంచీపురమున నుండిరి. పరాక్రమమున నాపల్లవరాజులు కాంచీపురముమొదలు కృష్ణానదివఱకు రాజ్యమును విస్తరింపఁజేయఁగల్గిరి. సముద్రతీరముననే వారు కృష్ణవఱకు దండయాత్రసలిపి రాజ్యమును స్థాపించుచు నెల్లూరుమీఁదుగా పినాకిని యుత్తరభాగమునుండి ప్రయాణముసాగించి కడపమండలము నాక్రమించిరి. ఆకాలమున నీభాగమున నున్నవారు శూరులుగాక

యల్పులై వారిని మార్కొనఁజాలక యున్నందునను గొందఱు మార్కొనినను వారి నోడింపఁజాలకయు నున్నందునఁ బల్లవులు నిరాబాధముగా నీరాజ్యమును లోఁబఱచుకొనఁ జాలిరి. వీరిరాజ్యము క్రీస్తు. ఐదవశతాబ్దిలో ఇంచుమించుగా కొసవఱకు అడ్డములేక సుఖముగా నుండెను.

అయిదవశతాబ్ది కొసభాగమున దక్షిణమునుండి చోళరాజులు (కరికాల చోళరాజులనిపేరు) ఉత్తరమునుండి చాళుక్య (విజయాదిత్యుఁడు) రాజులు పల్లవుల మార్కొనుచుఁ బోరునందు విజయము గాంచుచుండిరి. ఆయుద్ధము లంతపెద్దదిగాకున్నను పల్లవు లాసమయమున నపజయముగలవా రగుచుండిరి. విజయాదిత్యుఁడను చాళుక్యవంశపురాజు అయోధ్యనుండి దండెత్తివచ్చెనని వాడుకగలదు. ఈయపజయములు గలుగుసమయమునఁ ద్రిలోచనపల్లవుఁడు రాజుగా నుండెను. ఈతనికాలమున పల్లవులరాజ్య మున్నతస్థితినుండి తప్పినదనుట నిర్వివాదాంశము.

త్రిలోచన పల్లవునిసేనలతో విజయాదిత్యునిసేనలకు ముదివేము అనుగ్రామముదగ్గర ఘోరయుద్ధము జరగెను. విజయాదిత్యుఁడే జయమందెను. కాని యేదోకారణమున నతఁడందే మరణించెను. విజయాదిత్యునిభార్య యాగ్రామమునందే పురోహితునింట దాఁచుకొని ప్రాణమును గాపాడుకొనియె. ముదివేమే ఇపుడు జమ్ములమడుగు తాలూకాలోని పెద్దముడియమని పిలువఁబడుచున్నదని యెఱుంగవలయు.

దక్షిణమునుండి దండెత్తివచ్చిన చోళులు పల్లవుల నోడించి కాంచీనగరము నాక్రమించుకొనిరి. అందులో నొక

తెగవా రుత్తరమున దండయాత్రసలిపి నెల్లూరువఱకు నాక్రమించుకొని పాలించిరి. ఈ రాజ్యము చోళులలో నాల్గుతరముల వారిచే బరిపాలింపఁబడినదని మాలెపాడులో దొరకిన (తామ్ర) శాసనము. పెద్దముడియము, ముద్దనూరు అనుతావుల నుండు శిలాశాసనములు పైవిషయమును దృఢపఱచుచున్నవి.

ఆంధ్రచోళులు.

క్రీస్తుశకము 640-వ శతాబ్దిలో ఆంధ్రచోళులు విజృంభించి గొప్పసేనలతో దండయాత్రసలిపి కడప, కందనూలు (కర్నూలు),అనంతపురముల నాక్రమించుకొనఁ గల్గిరి వారితోఁ బోరాడి నిలువఁజాలినవారీ రాజ్యముల లేరని స్పష్టమగుచున్నది. స్వల్పయుద్ధములు జరగినవి కాని వారి నోడింపఁజాలు సేన లిందున్నవారికి లేకుండినవి. వీరిరాజ్యము ఎనిమిదవశతాబ్ది కొసవఱ కుండెను.

కాంచీనగర మొకరిపాలనమునఁ జాలకాల ముండినది కాదు. ఓరంగలు దేశస్థు లగురాష్ట్రకూటులు మూఁడవగోవిందరాజుకాలమున క్రీ. 783, 84 సంవత్సరమునుండి 814, 15 వఱకు రాజ్యముచేసినట్లు పల్లవులనుండి కాంచీపురి నాక్రమించినట్లు కనుపట్టెడిని. అనఁగా నైదవశతాబ్ది చివరభాగమునఁ బల్లవులనోడించి చోళులు కాంచీపురము నాక్రమించుకొన్న పిదప మరలఁ బల్లవులు చోళులనోడించి కాంచీనగరము నాక్రమించిరనియు, ఏడవశతాబ్దికడపట రాష్ట్రకూటులు పల్లవులలో నొకరగు మూఁడవగోవిందరాజు నోడించి కాంచి నాక్రమించిరనియు దీనిసారము.

కడపమండలమును రాష్ట్రకూటు లాక్రమించి పాలించినట్లు చెప్పఁగల శాసనములు, ఇతరాధారములు లేవు కాని బాణులను నొకతెగరాజులు కొంతకాల మీమండలమున నున్నయట్లుమాత్రము కనఁబడియెడిని. ఈయూహను క్రీ. 884 సంవత్సరమున జమ్ములమడుగుతాలూకా పొట్టిపాడులోని శాసనము దృఢపఱచుచున్నది. ఆశాసనమున ధవళేయరసుఁ డను బాణవంశస్థుఁ డొకఁడు దానముచేసినట్లు లిఖింపఁబడినది. బాణులీప్రాంతముల లేకయున్నను, వారికిందధికారమేమాత్రములేకున్నను దానశాసనము వేయింప నవకాశముండదుకదా. దీనిచే 9-వ శతాబ్ది కడపటికాలమునందు బాణులను రాజులు తెలుఁగుచోళరాజ్యమున నున్నయట్లు కనఁబడును. మఱికొంతకాలమున కీ కడపమండలము బాణులకు స్వాధీనముకాఁగా నిందున్నచోళులు దీనికి నుత్తరముగాఁ బోయి యందు రాజ్యముస్థాపించినట్లు స్పష్టమగును. ఈబాణులు పడమటిభాగమునుండి పాపఘ్ని (గండియేఱు) నదిగుండ కడపమండలములోని వేంపల్లె సమీపప్రదేశములకు వచ్చియుందురని యూహించుట మంచిది.

రాష్ట్రకూటులు.

ఈరాజులపేరునకుఁ గడపట ఇంద్రుఁడని యుండును. ఇది యొకబిరుదమని మన మూహింపవచ్చును. క్రీ. శ. 915 వ సంవత్సరమున మూఁడవయింద్రుఁడు రాజ్యముచేయుచుఁ దమరాజ్యమును విస్తరింపఁ జేయనూహ కలిగెను. ఆయూహను సార్థకము చేయఁబూని పడమటిభాగము నాక్రమించెను. "దానవులపాడు" అను గ్రామమున నొక కర్ణాటకభాషా

శాసనము కలదు. దానియం దీరాజు సేనాధిపతిని స్తోత్రము చేయు పద్యములున్నవి. కావున నింతదనుక రాజ్యము రాష్ట్రకూటులు విస్తరింపఁజేసిరని తోఁచెడు.

క్రీ. 940 మొ. 956 వఱకు ఈవంశస్థుఁడగు మూఁడవ కృష్ణుఁడు రాజ్యముచేయుచుండఁగా రాజ్య మౌన్నత్యస్థితికి వచ్చెను. శేషాచలమునకుఁ దూర్పుభాగము కొంచెముతప్పఁ దక్కిన మండలభాగమంతయు రాష్ట్రకూటులదైయుండినట్లూహింపవలసి యున్నది. ఈ మూఁడవకృష్ణభూపతీంద్రుఁడు ప్రకృతము చిత్తూరుమండలములోఁ జేర్పఁబడిన మేల్పాడు అను గ్రామమువఱకు దండయాత్ర వెడలినట్లు పెక్కుదృష్టాంతములు కలవు. కడపమండలమున స్థానికప్రభువులుగా నున్న వైదుంబులనురాజు లీతనికి లోఁబడి కప్పముకట్టుచున్నట్లు స్పష్టము.

వైదుంబులు.

ఈ వైదుంబులు అనంతపురము దక్షిణభాగమును మొదటినుండి పాలించుచు క్రీ. 8-వ శతాబ్దిలో రాయచోటి (రాచవీడు) తాలూకాయందుఁ దమయధికారమును వ్యాపింపఁజేసిరి. సురభిలోయలోనున్న నెఱసుపల్లెయొద్ద దొరకినశాసనమునందు వైదుంబులు ప్రస్తావింపఁబడియున్నందునఁ బైయూహ సత్యమని చెప్పవచ్చును.

మూఁడవకృష్ణుఁడు చావఁగా రాష్ట్రకూటులయధికారము క్షీణించెను. 975-996 సంవత్సరములలో వైదుంబులయధికారము కమలాపురముచెంతనున్న "అనిమల" యను గ్రామ

మువఱకు వ్యాపించెను. తమరే రాజులుగా నీభాగమును బాలించిరి.

క్రీ. 982 సం. లో చోళరాజగు ప్రథమరామరాజునకు వైదుంబప్రభువు లోఁబడి కడపమండలములో నున్న ఇంగుల్లూరునాడును బాలించినట్లూహించుట కవకాశములు గలవు. ఇంగుల్లూరు ఇపుడు పులివెందులతాలూకాలోని ఇనగులూరు అని తెలియవలయు.

క్రీ. 1056, 57 సం. లో నున్న శాసనమువలన వైదుంబరాజులలో నొకఁడగు భీమమహారాజు కమలాపురముతాలూకాలోని పాలగిరిదేవాలయము నుద్ధరించిరని తెలియందగు.దీనింబట్టియే యీ దేవాలయమునకు 956 సం. న మృతినొందిన రాష్ట్రకూటుఁడగు మూఁడవకృష్ణభూపేంద్రుఁడు దానమిచ్చినట్లు తెలిసికొనవచ్చును.

క్రీ. శ. 1102 సం. మున వైదుంబులు చోళరాజునకు లోఁబడినట్లు రాయచోటిలో దొరకినశాసనము తెలియఁజేయుచున్నది. ఈకాలమునందే ప్రథమకులోత్తుంగ చోళరాజు రాజ్యముచేయుచుఁ దనరాజ్యపుహద్దును కందనూలువఱకు జరపినట్లు, ఈరాజ్యమున నతనియధికారము సాగినట్లు వేఱొకయాధారమువలనఁ జెప్పవచ్చును. ఈకాలమునఁ గడపకుఁ దూర్పుననున్న సిద్ధవటము, పుల్లముపేటతాలూకాలు తెలుఁగుచోళులకు లోఁబడియున్నను, మండలమంతయుఁ జోళరాజునకు లోఁబడియేయుండెనని చెప్పుట పొరపాటు గాదు.

తెలుఁగుచోళులు.

క్రీ. 11-వ శతాబ్దిలో తెలుఁగుచోళులు పుల్లముపేట సిద్ధవటము బద్వేలుతాలూకా లనఁబడుభాగమును బాలించిరి. క్రీ. 1000 సం. నందు పుల్లముపేటతాలూకాలోని పొత్తపిలో తెలుఁగుచోళులలో నొక్కఁడగు దాసవర్మ రాజ్యమును స్థాపించెను. వీరివెనుక నాదేశమును బాలించినచోళులకు మధురాంతక పొత్తపిచోళు లనుపేరు వచ్చెను. వీరు చోళరాజునకు లోఁబడినవారే.

నెల్లూరుమండలము కడపమండలములోని తూర్పుభాగము కలిసినభాగమునకుఁ బాకనాడని పేరు. క్రీస్తు శ. 1070 మొ. 1118 వఱకుఁ బ్రథమకులోత్తుంగచోళుఁడు రాజ్యముచేసినట్లు నెందలూరునం దున్నశాసనము తెల్పుచున్నది. ఇతఁడు కళింగదేశమును జయింప దండయాత్ర పోవునపు డీమార్గమునఁ బోయియుండవచ్చునని తోఁచెడిని. నెందలూరునందే 1121, 1126 సం. లలో వ్రాయఁబడిన రెండుశాసనములు దొరకినవి. వానింబట్టి యాలోచింపఁగా కులోత్తుంగచోళునిపిదప విక్రమచోళుఁడు రాజ్యమునకు వచ్చినట్లు కనుపట్టెడిని. నెందలూరునందున్న మఱియొక శాసనముమూలమున నెల్లూరుమండలముకూడఁ దనరాజ్యమునఁ గలిపికొని మూఁడవకులోత్తుంగచోళుఁడు క్రీ. 1178 మొ. 1216 వఱకు రాజ్యపాలన మొనర్చినట్లు తేలుచున్నది. మఱియొకశాసనముకూడ నందే దొరకినది. దానిని బరిశీలింపఁగా మూఁడవరాజరాజదేవుఁడు పైవానివెనుక పాలించుట కేర్పడినట్లు స్పష్టమగును.

క్రీ. 12-వ శతాబ్దియందును 13-వ శతాబ్దియందును ఈదేశమును, తెలుఁగుచోడులే పాలించినట్లు, వంశావళిగలిగిన కొన్నిశాసనములంబట్టి వారిప్రతినిధులు వంశపారంపర్యముగా వచ్చినట్లును దెలియవచ్చెడు. కాలక్రమమున మొదటి చోళులబలము క్షీణింపఁగా వారిప్రతినిధులగు మధురాంతక పొత్తపిచోళులు తమరే ప్రభువులుగా నేర్పడి పాలించిరి. వారి కీదశాకాలము పండ్రెండవశతాబ్ది కొసభాగమునఁ గల్గినది.

ఈసమయమునందే కడపసమీపమున నున్నవల్లూరులో నివాస మేర్పఱచుకొనియున్నరాజప్రతినిధి తాను కంచిరాజుల నుండి కప్పము గైకొన్నయట్లు డంబములు పల్కెను. ఇట్టిసమయమున నీమండలమునఁ బరిపాలనము చక్కనిపద్ధతిగా లేక పొడవుచేతులఫలము లన్నట్లుండెనని యూహించుట తప్పుగాదు. చోళులరాజ్యము క్రీ. 1268 సం. తో క్షీణించెను. అప్పుడు వీరిని బాండ్యులను నొకతెగరాజులు జయించిరి. మరలఁ జోళులు వీరినిజయింప శక్తిగలవారు కారైరి.

కాకతీయులు.

ఆమీఁద నీమండలము కాకతీయులపరిపాలనమునకు లోఁబడెను. అంబదేవుఁడను కాకతీయరాజు కడపనుండి పడమటిభాగమునంతయు నాక్రమించి వల్లూరు రాజధానిగాఁ జేసికొని పాలించెను. ఈయంబదేవుఁడు పెద్దినాయఁ డనునుద్యోగిని నియమించి భూములను గొలిపించి(సర్వేచేయించి) లేబాక సమీపమున నొకపెద్ద యేటికాలువను ద్రవ్వించెను. అత్తిరాలదేవాలయము బాహుదానదీజలముల మునిఁగిపోవకుండఁగా కట్ట కట్టించెను. ఈమూఁడు ఘనకార్యములను జేయించి

ప్రజలయానందమునకుఁ దాను బాత్రుఁ డయ్యెను. ఇంతకు ముందున్న వారెవ్వరిపనులఁ జేయింపకుండుటయు, నీరాజు పట్టుదలఁబూని యీపనులు చేయించుటయుఁ గారణముగా జనులీరాజునందు విశేషప్రీతిగలవారైరి.

అంబదేవుఁడు చనిపోఁగాఁ గాకతీయరాజ్యమునఁ బ్రతాపరుద్రుఁ డధిపతి యయ్యెను. అదిమొదలు పొత్తపినాడు కాకతీయులకు లోఁబడియె. తెలుఁగుచోళు లేమయిరో మరలఁ దెలియ వలనుపడదయ్యె. వారు కాకతీయులధాటి కోర్వఁజాలకపోయిరో ముందే తమగొప్పఁదనమును బోఁగొట్టుకొనిరో నిర్ణయింపఁదగు నాధారములు కనఁబడలేదు.

మహమ్మదీయుల దండయాత్ర.

క్రీ. 14 వ శతాబ్దిప్రారంభమున రాయచోటిభాగము తప్పఁ దక్కినమండలమంతయుఁ గాకతీయులవశమున నుండెను. రాయచోటిభాగముమాత్రము 13 వ శతాబ్దికడపట హోయిసలరాజులకు లోఁబడెను. క్రీ. 1309 సం. లో మహమ్మదీయులు దక్షిణదిశను జయింపఁగోరి దండయాత్ర వెడలిరి. అపుడు ఖిల్జీవంశస్థుఁడగు అల్లాఉడీన్ చక్రవర్తిగా నుండెను.

ఓరంగల్లుప్రభువు లగుకాకతీయులు మహమ్మదీయులదాడికి నోర్వఁజాలక నామమాత్రావశిష్టులైరి. ఈదండయాత్ర 1325 సం. తో ముగిసెను. ఓరంగల్లు పట్టుపడి ప్రతాపరుద్రుఁడు బందీకృతుఁడై ఢిల్లీకిఁ గొంపోవఁ బడియె. ఈరాజులలో నోరంగల్లునుండి తప్పించుకొనిపోయిన హరిహరబుక్కరాజు లనునిరువురు విజయనగరరాజ్యమును 1336 సం. మునందు స్థాపించిరి. ఓరంగల్లునందుండి మహమ్మదీయుల దండ

యాత్రనాపి వారిని దక్షిణమునకు సాగకుండఁజేయుశక్తి కాకతీయులకు లేకుండెననియు,వారికేరాజులును సాయపడక పోయిరనియును, ఆకాలమున నోరంగల్లుసమీపమున నున్న రాజులకంతఃకలహములు గలిగియుండెననియు, నీవిషయములను దమచారులద్వారా తెలిసికొని మహమ్మదీయులు దండయాత్ర వెడలి గెలుపొందుటయేగాక ప్రతాపరుద్రుని బందీకృతుని జేసిరనియు మనమూహించుట న్యాయమే.

ఓరంగల్లు మహమ్మదీయులకు లోఁబడఁగా నందుండిన హరిహరబుక్కరాజు లిద్దఱు చక్కఁగా నాలోచించి మనమిటనుండి స్వశక్తిచే మహమ్మదీయుల నాపఁజాలమనియు, సహాయసంపద యిందుండిన లభించుట కష్టమనియు, ఇపు డీదాడికి నోడినను దగుసహాయము గలిగించుకొని వీరిని వెడలనడువవలయుననియు,నాకార్యమునకై ప్రయత్నించి యెట్టియిక్కట్టులపాలైనను గార్యము సాధింపవలయుననియు భావించి యుపాయమున నెట్లో యోరంగల్లునుండి తప్పించుకొని దక్షిణభాగమునకు వచ్చి యుద్ధముచేసి శత్రువులు తమ్ముబాధింపకుండ నుండుతావును వెదకి విజయనగర మనుపేర రాజ్యమును స్థాపించునగరమును గట్టించిరి.

క్రీ. 1334 సం. నందు ఓరంగల్లు ప్రతాపరుద్రునికుమారుఁడును విజయనగరప్రభువు నగుకృష్ణనాయకరును, మహిసూరు హోయిసలరాజు నింకను గొందఱు ఒక్కటిగాఁ జేరి గొప్పసేనతో నోరుగల్లునుండి మహమ్మదీయులను బాఱఁదోలి వారిసేనాప్రవాహము నాపఁజాలిరి. దీనికి ఫలమేమనఁగా విజయనగర సామ్రాజ్యస్థాపనమే. ఈవిజయనగర సామ్రాజ్యము

మిగుల నున్నతదశలో రెండువందలసంవత్సరము లుండెను. ఈ కడపమండల మా రెండువందలసంవత్సరము లీవిజయనగరరాజులకు లోఁబడియే యుండెను. ఆకాలమునమాత్ర మీమండలము శత్రుబాధలు కొంచెమేని లేకయుండె ననవచ్చును.

విజయనగరసామ్రాజ్యము.

క్రీ. 1400 మొదలు 1700 సం. ములలోఁ గడపచరిత్రమున నిటీవల దొరకినశాసనములద్వారా కొన్ని ముఖ్యవిషయములు తేటపడుచున్నవి. విజయనగరసామ్రాజ్యము స్థాపించిన కొలఁది కాలముననే కడపమండలమంతయు నెల్లూరుమండలమునం దధికభాగము ఉదయగిరిమండలాధిపతిచేఁ బాలింపఁబడియె. ఈమండలమున క్రీ. 1356 సం. లో మొదటి కంపరాజుకొడుకు ప్రభువుగా నుండెను. దీనిచే విజయనగరప్రభువులు తమసమీపబంధువులను దూరపురాష్ట్రములకుఁ బ్రతినిధులనుగా నియమించు పద్ధతిగలవారని తెలియవచ్చెడిని. పై శతాబ్దియందును జక్రవర్తికుమారులలో నొకఁడీయుదయగిరి రాష్ట్రప్రభువుగా నుండుటంబట్టియే దీనిప్రాముఖ్యము తెలియవచ్చును.

క్రీ. 1369 సం. లో బద్వేలుతాలూకాలోని పోరుమామిళ్లయం దుదయగిరి రాష్ట్రరాజప్రతినిధియు, ప్రథమబుక్కరాయపుత్త్రులలో నొకఁడు నగుభాస్కరునిచే నొక గొప్ప తటాకము గట్టింపఁబడియె. ఈబుక్కరాజు 1352 మొ. 1376 వఱకు రాజ్యమేలెను.

క్రీ. 1382, 83 సం. న రాజ్యమేలుచున్న రెండవహరిహరచక్రవర్తికుమారులలో నొక్కఁ డుదయగిరిరాజ్యము

నకు రాజప్రతినిధిగా నుండినట్లు చిలమకూరునొద్ద నిటీవల దొరకిన శాసనము తెలుపుచున్నది. ఆకుమారునిపేరు దేవరాయఒడయరు అని. "ఒడయర్" అనునది విజయనగరరాజుల కుండు బిరుదములలో నొక్కటియని స్పష్టమయ్యెడిని. ఇది రాజప్రతినిధుల కిచ్చుబిరుదమని యూహింపవచ్చును. ఈరాజపుత్త్రుఁడు చక్రవర్తియై 1406 మొ. 1417 వఱకు రాజ్యమేలెను.

బద్వేలుతాలూకా కత్తెరగండ్ల యనుగ్రామమున దొరకినశాసనమునుబట్టి యాలోచింపఁగా నుదయగిరిరాష్ట్ర రాజప్రతినిధికిఁ బ్రతినిధిగా ఎల్లమరుసయ్య నియమింపఁబడి సగిలిసీమను (సిద్ధవటమునకుఁ దూర్పుగానున్నభాగమును) బాలించినట్లును, చక్రవర్తియగు శ్రీకృష్ణరాయలు 1530 సం. వఱకు రాజ్యమేలుచున్నట్లును స్పష్టమయ్యెడిని. 1544 మొదలుకొని యుండినశాసనముల యాధారమునుబట్టి యూహింపఁగా నపుడు సదాశివచక్రవర్తి యున్నట్లు తేలెడిని.

బద్వేలుతాలూకా మున్నెల్లి యను గ్రామమునందు 1557, 58 సం. లలోని శాసన మున్నది. అందు సదాశివుఁడు పేరునకుమాత్రము చక్రవర్తిగా నున్నట్లును, ఆతని బావమఱఁదియగు తిరుమలరాజు రాజ్యభారమును వహించెననియు, ఆతనిసోదరుఁడు రామరాజు ఉత్తరభాగమునుండి దాడిసలుపవచ్చు శత్రువులతోఁ బోరాడుచుండినట్లు వ్రాయఁబడినది. దీనినిబట్టి చక్కఁగా నాలోచింప సదాశివచక్రవర్తి యసమర్థుఁడనియు నాతని బావమఱఁదియగు తిరుమలరాజు రాజ్యపాలనమునందు నిపుణుఁడనియు, నాతనితమ్ముఁడు రామరాజు సేనాధిపతిగా నియమింపఁబడియెననియు, నపుడుత్తరమునుండి మహా

ష్మదీయు లీరాజ్యము నొక్కయెత్తుగా మ్రింగఁదలఁచి సేనాస స్నాహాముతో దాడిసలుపఁ బూనిరనియు, సేనాధిపతి యాబలములతోఁ బోరాడుచు వారినినిలుపుచుఁ దనప్రతాపమును జూపుచుండెననియుఁ దేలుచున్నది. ఆకాలమున రాజుల కెట్టికష్టములుండెనో తెలిసికొనవచ్చును. అట్టితఱిఁ బ్రజల కెట్టి సౌకర్యముల రాజు కలిగించినను శాంతికుదురక నిరంతరభయము వారిమనసులఁ బాదుకొనియుండుననియుఁ దోఁపకమానదు.

బద్వేలుతాలూకా వరికుంట్ల యనుగ్రామమున నున్న శాసనమును బరిశీలింపఁగా కడపమండలమును 1602 సం. న వేంకటపతిచక్రవర్తి చంద్రగిరినుండియే పాలించెనని కనుపట్టెడు. 17-వ శతాబ్దిలో కడపమండలము కొలఁత (సర్వే.) చేయఁబడినది.

క్రీ. 1687 సం. లో గోలకొండనవాబు ఔరంగజేబుచే నోడింపఁబడినప్పుడు ప్రధానులుగా నున్నవారు గండికోట నవాబు, కడపనబాబు, ఈ యిద్దఱే.

పాళెగాండ్రు.

ఈవిషయమై నాలుగుపంక్తులు వ్రాసినఁగాని ముందు వ్రాయఁబోవుచరిత్రము బోధపడదు. కావున వ్రాసెదను. ఈ కడపమండలమునఁ జాలమంది పాళెగాండ్రుండిరి. ఈశబ్దమున కర్థమేమో విచారింతము. పాళెమనఁగా దండు దిగుచోటు. దానియధికారి పాళెగాఁడు అని పిలువఁబడును. అనఁగా సేనలుదిగుటకు నాయాచోటుల నేర్పాటుచేసికొనుట రాజులయాచారము. అట్టితావుల దండుదిగినవుడు ఆ దేశరహస్యములఁ

దెలుపుటకును, వారికి భోజనపదార్థముల నాయత్తపఱచియుంచుటకును నొకపెద్దమనుష్యు నియమింతురు. ఆతనికిఁ గొంత యధికార ముండును. అతఁడు పాళెగాఁడని పిల్వఁబడును. కొన్నిగ్రామములయం దతనికధికారము నిరంకుశముగా సాగుటంబట్టి యతఁడు తానే రాజనని యెంచుకొనుచుఁ దనయిష్టానుసారము ప్రజలనుండి దండుగలంగైకొనుచు నుండును. ఆతనిగ్రామములకుఁ జుట్టుపట్లనుండు గ్రామములనుండి రావలసిన ద్రవ్యమును రాజునమతిని దానే రాఁబట్టి ప్రభువునకుఁ బంపుచుండునధికారము కొందఱకుండును. ఆతఁడు తా నారాజునకు సామంతరాజునని డంబములు పలుకుచుఁ బ్రభుత్వము చేయుచుండును. యుద్ధమునకు సహాయముచేయునిమిత్తమే యాతనికిఁ గొన్నిగ్రామము లీఁబడునుగాని వేఱుగాదు. ఇదియే పాళెము. పాళెగాఁడు. అనుశబ్దముల కర్థము.

కడపమండలమునఁ బాళెగాండ్రు పెక్కుమంది యుండిరి. వారెల్ల కళ్లికోటయుద్ధము మొదలుకొని రెండువందల సంవత్సరములు కడపనబాబునకు లోఁబడక యతఁ డశక్తుఁడైనందున విచ్చలవిడిగా విజృంభించిరి. వారియార్భాటము నోర్వఁజాలక ప్రజలు పలుబాముల పాలగుచుండిరి. ఆంగ్లేయ చక్రవర్తిసైన్యములు, అనర్గళప్రవాహమగు సర్ థామస్ మంద్రో గారి రాజ్యతంత్రనైపుణియు నీపాళెగాండ్రయుద్ధతి నాపి వీరు లోఁబడునట్లు చేసినవి.

మట్లిరాజులు.

క్రీ. 17 శతాబ్దిలోఁ బాళెగాండ్రకన్న మర్యాదగా గొప్పరాజ్యముగలిగిన మట్లి కుటుంబ[illegible]రుదమును

వహించిరి. క్రీ. 1524-వ సం. నందు నీకుటుంబములో నొకరు సిద్ధవటముసీమలోని పొత్తపిమండలమున నధికారమును వహించియుండెను. ఆకుటుంబములోని మఱియొకరాజు కోడూరు సమీపమున ఆనుకట్ట నొకదానిని గట్టించెను. విజయనగరరాజులలోని సదాశివరాయలకాలమున నీ మట్లికుటుంబమువారు వివాహసంబంధములు కలవా రగుటవలన వీరికి మర్యాద యెక్కువ యయ్యెను. కావున వీరు ప్రఖ్యాతినివహించి ధర్మముగా రాజ్యము నేలుచు గొప్పకార్యము లనేకములొనర్చి ప్రజాసమ్మోదమునకుఁ బాత్రులైరి.

క్రీ. 1570 సం. లో పొత్తపినాఁడుభాగమును బరిపాలించు మట్లి తిరుమలరాజు పొందలూరుగ్రామములోని కొన్నిభూములయాదాయము నందలిదేవాలయమున కిచ్చెను. పదునేడవశతాబ్ది ప్రారంభమున మట్లిరాజులు బద్వేలు సిద్ధవటము పుల్లమ్మపేట తాలూకాలపైన నిరంకుశాధికారమును వహించియున్నట్లు కనుపట్టు. ఇది వారివంశములో మిగుల విఖ్యాతులైన యనంతరాజుకాలమునఁ బైయధికారము సాగెను. అనంతరాజునకు అనంతరామరాజను నామము కలదు. ఈ రెండుపేరులతో నాయన రాజ్యమును బాలించినట్టు లనేకాధారము లున్నవి. ఈ యనంతరామరాజే బద్వేలుచెఱువును గట్టించి యనంతరాజపురమను (లక్ష్మీపాళెము) గ్రామమును గట్టించెను. ఆగ్రామమునఁ బ్రసన్న వేంకటేశ్వరాలయ మిపుడుకూడ సుప్రసిద్ధిని గాంచియున్నది. ఈచెఱువు కట్టించి యెన్నియోకుటుంబములకు భూదానములుచేసి యాచంద్రతారార్కముగాఁ గీర్తిని నిలిపెను. బద్వేలుకు నైఋతిభాగమునఁ

జెన్నంపల్లె యనుగ్రామమును దనభార్యయగు చెన్నమ్మపేరఁ గట్టించెననియు నం దఱువది విప్రకుటుంబముల నిలిపెననియుఁ బ్రతీతి కలదు.

ఈ యనంతరామరాజే క్రీ. 1604-వ సం. లో సిద్ధవటమున దేవాలయప్రాకారాదులను జక్కఁగాఁ గట్టించినదే కాక కోటను గట్టింప నారంభించెను. కాని దానిని బూర్తిచేయఁజాలక పోయెను. దానిని కడపనబాబు కొంతకాలముపిదపఁ బూర్తిచేసెను. కాకుత్థ్సవిజయమను తెనుఁగుప్రబంధమును వ్రాసిన యనంతరాజున కీతఁడు సోదరపుత్త్రుఁడు. పైఁజెప్పిన తిరుమలరాజునకు సోదరుఁడు.

ఈ మట్లిరాజులు జలము భూముల కుపయోగించుకార్యములకు ద్రవ్యమును మిక్కిలి వెచ్చించిరి. వీరివెనుక రాజ్యపాలనమునకు నియోగింపఁబడిన పెరుమాళ్లరాజు క్రీ. 1718 సం. లో లేబాకయనుగ్రామము తటాకమునకు మంచి జలమార్గము (తూము) గట్టించెను. వీరివంశమున మఱియొకరాజు బాహుదానదినుండి పొత్తపిగ్రామము దనుక నొక నీటికాలువను ద్రవ్వించెను. పదునేడవశతాబ్ది కడపట వేంకటరామరాజుకాలమునందు పొత్తపినాడు పులుగునాటిసీమయని పొత్తపిసీమ యని రెండుగా విభజింపఁ బడియె.

ఈవిభాగమునకు హేతువేమి?

యుద్ధము సంభవించినపుడు పొత్తపియం దున్నయెడల స్వరక్షణముచేసికొనుట కష్టము. శత్రువులఁ బాఱఁదోలుటకుఁ దగినపరికరము లందులేవు. కాఁబట్టి యాచోటును మార్చిరని

యూహింపవచ్చును. అప్పటిమట్లిరా జిచ్చటినుండి తన ముఖ్యస్థానమును ఎఱ్ఱగుంట్లకోటకు మార్చెను. అందును జాలకాల ముండక పులుగునాటిసీమకు ముఖ్యస్థానముగా నీకోటను మార్చెను. కొంతకాలము పొత్తపిసీమను టంగుటూరులో తానుండి పాలించుచుండెను. మఱికొంతకాలము తాను చిట్టివేలునందుండి పరిపాలనమును సాగించెను. ఈ మార్పులన్నియు అబ్దుల్‌నబీఖాన్ అనునతఁడు కడపనబాబుగా నుండినకాలమున జరగియుండవలయునని యూహింప నయ్యెను.

వేంకటరామరాజపుత్త్రుఁడో లేక ఆతనితండ్రియో అగు తిరువేంగళనాథరాజు క్రిందనుండు తిరుపతిలో గోవిందరాజస్వామికి గోపురమును గట్టించెను. రెండవ తిరువేంగళనాథుఁడు 1705 సం. లో రాజుగా నుండెను.

హైదరాలీకాలమునందు మదనపల్లి కదిరి వాయిల్పాడు రాయచోటితాలూకాలకుఁ జేరిన కడపమండలమును గుత్తముకొండ రాజప్రతినిధి (వైస్రాయి) యగు మీర్‌సాహేబు పాలించెను. క్రీ. 1780 సం. లో హైదరాలీ మీర్‌సాహేబుసహాయమునఁ గడపనబాబును, అతని కుటుంబము వారిని బందీకృతులంజేసి శ్రీరంగపట్టణమునకుఁ గొనిపోయెను. ఈకార్యముచేఁ గడపమండలములో నున్న పాలెగాండ్రును, మట్లిరాజులును భయంపడిరి.

క్రీ. 1792 సం.లో టిప్పుసుల్తాన్ (హైదరాలీకొడుకు) కంపరాజ్యములోని భాగమును నైజాము కీవలసి వచ్చెను. దానివలన స్థానికప్రభువులు మరలఁ దమకధిపతి యసమర్థుఁడని తెలిసికొని తమస్వాతంత్ర్యమును బ్రకటించిరి.

పాఠకులారా! మట్లిరాజులప్రస్తావమున మఱియొకచరిత్రము వ్రాసిన బాగులేదని వరుసగా వ్రాసితిని. 18-వ శతాబ్ది వఱకుఁ జరిత్రము వ్రాసిన ట్లయ్యెను. కాని 16 వ శతాబ్దియందలి కడపచరిత్రమున నబాబులచరిత్రము వ్రాయవలసి యుండెను. దానిని బాఠకులసౌకర్యముకొఱకు అందువ్రాయక యిచ్చట వ్రాయుచున్నాఁడను. మన్నింతురుగాక. లోపలి చరిత్ర మిదియని మఱువక పఠింతురుగాక.

కడప నబాబులు.

క్రీ. 1640, 50 సం. లలో మొదటినబాబు అబ్దుల్‌నబీఖాన్ ప్రభుత్వమునకు వచ్చెను. 1564 సం. నందు తల్లికోట యుద్ధమునకుఁదర్వాతఁ గొలఁదికాలమునకు మహమ్మదీయరాజ్యమీ కడపమండలమున స్థాపింపఁబడినది. అబ్దుల్‌నబీఖాన్ కుటుంబము రాజకుటుంబములోఁ గ్రొత్తది. ఈతని తరువాతవచ్చిన రెండవనబాబు పేరేదియో తెలిసికొనఁదగిన సాధనములు లేవు. కొలఁదికాలము రాజ్యమేలియైన నుండవలయు. లేక యీతనిరాజ్యకాలము పేరు తెలియఁదగినంతయవసరము కలిగియుండకపోయినను బోయి యుండవచ్చును. ఈ నబాబుకాలమున చరిత్రమునకుఁ గావలసినవిషయములు లే వనునదిమాత్రము సిద్ధాంతము.

క్రీ. 1714 సం. లో మూఁడవనబాబు అబ్దుల్‌నబీఖాన్ అనునతఁ డుండెను. ఈనబాబు పుంగనూరును జయించి లోఁబఱచుకొనియె. కాని 1732 సం. కు ముందే యీనబాబుప్రభుత్వము నిలిచిపోయిన ట్లూహింపవచ్చును. ఈతనికొడుకు మహజీద్ ఖాన్ 1732 సం. నకు ముందే ప్రభువయ్యెను. అని యొక

శాసనము తెలుపుచున్నది. ఈనబాబు చనిపోవునపుడు కుమారుఁడు బాలుఁడగుట నితనిసోదరుఁడు మహాసీంఖాఁ రాజయ్యెను. ఈయనకు మూచీమీర్ అను రెండవపేరు కలదు. ఇతఁడు క్రీ. 1751. సం. న నెవరిచేతనో చంపఁబడఁగా బాలుఁడగు నీతనియన్న కుమారుఁడు అబ్దుల్ అలీంఖాఁ ప్రభువయ్యెను. ఈతఁడే యీకుటుంబమునందుఁ గడపటివాఁడు. ఈతని 1780 సం. నందు హైదరాలీ జయించెను.

గుఱ్ఱముకొండకోట.

గుఱ్ఱముబయలు అనునది కదిరితాలూకాలో నున్నది. ఇదియే మహారాష్ట్రదేశపు దొంగకిచ్చిన బహుమానమని యొక కథకలదు. ప్రకృత మీతావు కడపమండలమున లేదుగానఁ బెంచి వ్రాయలేదు. కాని దీనిచరిత్రముతో ముందు సంబంధముకలదు గాన నిట నించుక వ్రాసితిని.

క్రీ. 17-వ శతాబ్ది యంతమునందును, 18-వ శతాబ్ది ప్రారంభమునను గడపమండలచరిత్ర మయోమయముగనున్న ట్లూహింపవచ్చును. అనఁగా ముఖ్యవిషయములని పేర్కొనఁదగినవి లేకుండుటయే గాక రాజ్యపాలనము సువ్యవస్థముగా లేదు. మండలమంతయు నొక్కరాజు పాలించుటగాని, సామంతరాజుల పాలనమును బరీక్షించు నొక్కప్రభువుగాని లేక యెవరికి వారే స్వతంత్రులై కొలఁదిభాగము నాక్రమించుకొని యేలుచున్న ట్లూహింపవలయుననియే దీనిసారము.

క్రీ. 1757 సం. లో మహారాష్ట్రులకుఁ బ్రతినిధిగా వచ్చిన బలవంతరావు కడపసమీపమునఁ బటానులతోఁ బో

రాడి గెలుపొందెను. 1759 సం. అక్టోబరునెలలో నైజాం మఘూజుఖాఁ పేర బజాలత్ జంగ్ ఫ్రెంచిసేనలతోఁగూడి కడపలోఁ బ్రవేశించెను. ఈనెలలోనే ఫ్రెంచి జనరల్ బూసికూడఁ గడపకు వచ్చెను.

1766 సం. న నొకప్పుడు మహారాష్ట్రులు గుఱ్ఱముకొండకోటను మీర్ సాహేబున కిచ్చివేసిరి. మీర్ సాహేబు హైదరాలీకి బావమఱఁది. కడపచరిత్రమున నిది ముఖ్యము. పిదప హైదరాలీకి గుఱ్ఱముకొండను మీర్ సాహెబు స్వాధీనము చేసి యతనితో స్నేహము చేసికొనెను.

1769 సం. ప్రాంతమున నైజాముతోఁ జేసికొన్న రహస్యపు టొడంబడికప్రకారము కడప కర్నూలు హైదరాలీకి లోఁబడినవనవచ్చును. హైదరాలీ కడపకు వచ్చి నబాబుచేఁ గప్పముదీసికొని పాళెగాండ్ర నోడించెను. ఇంతలో మాధవరావు అడ్డపడఁగా హైదరాలీ వెనుకకుఁబోఁగా గుఱ్ఱముకొండను సయ్యద్ సాహేబు సేనాధిపత్యముక్రింద రెండునెలలు ముట్టడించి స్వాధీనము చేసికొనెను. ఇదియే యీకోట ముట్టడింపఁబడి యితరులకు స్వాధీనమగుట కారంభము. ఇంతకు ముం దెవ్వరికి నీకోట స్వాధీనము కాకుండెను.

1791· 92 సం. లలో ఈకోట ఇంగ్లీషువారి శతఘ్నుల (ఫిరంగుల) సహాయమున నైజాంసేనచే నొకసంవత్సరము ముట్టడింపఁబడియె. అంతదనుక కోటలోనివారు లోఁబడలేదు.

క్రీ. 1780 సం. ప్రాంతమున కుందునదిసమీపమున దువ్వూరులో నొకయుద్ధము జరగెను. ఆసంగరములో హైదరాలీచే కడపనబాబుగా నున్న అబ్దుల్ అలీంఖానుసేనలు పూర్తి

గా నోడింపఁబడి సిద్ధవటముకోటకుఁ బాఱిపోయెను. హైదరాలీకూడఁ బోయి సిద్ధవటమునుగూడఁ బట్టుకొనియెను. అలీంఖానుని శ్రీరంగపట్టణమునకు బందీకృతుం జేసికొని పోయెను. కోటలోనున్న ద్రవ్యము కొల్లఁగొట్టఁబడియెను.

తరువాత ఆనబాబుతోడఁబుట్టువు మిక్కిలి సుందరాంగి పదునెనిమిదిసంవత్సరముల యీడుగల స్త్రీ ఈతనికిం దొరకెను. మొదట ఆమె యీతని నంగీకరింపకపోయెను. మరల నంగీకరించి భార్యయై పట్టపురాణిగూడ నయ్యెను. తర్వాత హైదర్ కడపను సిద్ధవటమును గుఱ్ఱముకొండకుఁ జేర్చి మూఁడువేలగుఱ్ఱములనుంచుకొని యుద్ధములఁ దనకు సహాయముచేయవలయునని కట్టుపాటుచేసి తన బావమఱఁదియగు మీర్ సాహేబున కిచ్చి మైసూరునకుఁ బోయెను.

క్రీ. 1782 సం. లో హైదర్ చావఁగా కడపనబాబునకు అల్లుఁడుగానున్న సైయద్ మహమ్మద్ కడపను దనకు లోఁబడునట్లు ప్రయత్నించెను. ఈతఁ డింగ్లీషువారి సేనలసహాయమున కంభమును ముట్టడించెను. గుఱ్ఱముకొండలో రాజుగానున్న కుమరుద్దీన్ (మీరుసాహెబుకుమారుఁడు) కంభమునకుఁ బోయి సైయద్మహమ్మదు నోడించి ఇంగ్లీషుసేననుగూడఁ జయించెను.

1790 సం. లో మహారాష్ట్రులు నైజాము బ్రిటీషువారు ఏకమై టిప్పుగర్వము నడఁపఁ బ్రయత్నించిరి. ఆసమయముననే నైజాము కడపను రాఁబట్టుకొనఁ బ్రయత్నించి సేనలఁబంపఁగా వారు మెల్లమెల్లఁగా 1791 సం. లో గుఱ్ఱముకొండను ముట్ట

డించిరి. పాళెగాండ్రందఱును వారికి లోఁబడిరి. గండికోటకూడఁ గొలఁదికాలమునకు నైజాముకు లోఁబడియెను.

1791 సం. మొదలు 1794 సం. వఱకు కడపరాజ్యము పుట్టచెండువలె మహారాష్ట్రులయొక్కయు, టిప్పుసుల్తానుయొక్కయు, నైజాముయొక్కయు, చేతులలో మాఱుచుండెననుట స్పష్టము. ఈకాలమున నీమండలముస్థితి వర్ణింపఁ దరముగాకుండును. అనుదినము యుద్ధవార్తలే. ప్రతిదినము జయాపజయవృత్తాంతములే. అప్పు డీమండలవాసులబ్రదుకు అరచేతిలో నుండవచ్చును.

క్రీ. 1795 సం. లో నైజాము మహారాష్ట్రులతో యుద్ధముచేసెను. అందు మహారాష్ట్రులను జయించియుఁ దెలివితక్కువచే దనయంతఃపురాధికారి యాలోచనమునకు లోఁబడి కుర్ద్లాకోటలోనికిఁ బోయి తనసేనలకును దనకును సంబంధము లేనియట్లు కాఁగా విధిలేక మర్యాదలేనిసంధిని గుదుర్చుకొనవలసినవాఁ డయ్యెను.

తర్వాత నవీనదేశాక్రమణసమాలోచనాధురీణుఁడైన ఫ్రెంచిరైమండ్సును సహాయముగాఁ గొని యతనికి సేనలసహాయము చేయునిమిత్తము నైజాము కడపప్రాంతములను వారికిచ్చెను. 1799 సం. న శ్రీరంగపట్టణము నైజాముకు లోఁబడుతఱి నాతఁ డాంగ్లేయసైనికులకు నీయవలసిన జీతములకుగా కడపమండల మిచ్చెను. ఈసంధి క్రీ. 1800 సం. అక్టోబరు 12-వ తేది హైదర్బాదులో సాగినది. అదిమొదలుగా నొకక్రొత్త శక మారంభమైనది. ఈశక మారంభముకాఁగా యుద్ధములు సాగక నిలిచినవి. జనులకుఁ బ్రాణభీతి తప్పినది. దొంగలగుం

పులు గ్రామములపైఁబడి కొల్లఁగొట్టుపద్ధతి రూపుమాసినది. ఉన్న ధాన్యము, వండుకొనినయన్నము తమ రనుభవింపఁగల మనునమ్మకము ప్రజలకుఁ గలిగినది. ఏసమయమున నేదిక్కునుండి సేనలు వచ్చునోయని యెదురుచూచుకష్టము తప్పినది. వీథులలో నిర్భయముగాఁబరుండి గుండెలపైఁ జేతులువైచుకొని హాయిగా నిద్రించునదృష్టము ప్రజలకు లభించినది. దండుగలు తీయునధికారులు, బలవంతముగాఁ గానుకలఁ దెమ్మని చెప్పుప్రభువులు లంచములు ప్రతిదినము తీయునుద్యోగులు కనఁబడకపోయిరి.

కడపనగరము.

దీనింగురించి నాలుగుమాటలు వ్రాయకతప్పదు. కడపనబాబులలో నధికారమును వ్యాపింపఁజేసినవారిలో అబ్దుల్ నబీఖాన్ మొదటివాఁడు. ఆనవాబు 1714 సం. లో కడపలో రాజ్యము చేసెను. కడపనగరమును అబ్దుల్ నబీమియా అను నతఁడు కట్టించెననియు, నాతఁడు ఢిల్లీనబాబుచే నబాబుబిరుదమును సంపాదించెననియు ప్రతీతి కలదు. 1570 సం. నందుఁ గడప కట్టఁబడినట్లూహింపఁబడెను. ఈయూహకుఁ దగినయాధారములు కానరావని యందఱంగీకరించిరి.

కడపయను పేరువచ్చుటకు హేతువేమన్న ప్రశ్నమొకటి కలదు. తిరుపతియాత్రపోవువారు పూర్వ మిందు దిగి వేంకటేశ్వరులను దర్శించి మ్రొక్కుబడులఁగొన్నింటి నిందే చెల్లించిపోవుట పూర్వకాలమునుండి నేఁటివఱకాచారము గలదు. ఉత్తరమున నిది తిరుపతికిఁ గడప. కనుక నీపేరు వచ్చినదన వచ్చును. గడపయనుదానిని కడపయనివాడుట లోకవ్యవహారసిద్ధము. పూర్వకాలమున నిపుడున్నకడపకు నుత్తరభాగమున నున్న ప్రాఁతకడపయే యుండెననియుఁ దర్వాత క్రీ. 1570-వ సం. న అబ్దుల్ నబీమియా కట్టించెననియుఁ గొంద ఱందురు. ప్రాఁతకడపకు కృపావతి యనుపేరుకలదని గొందఱందురు. ఈ రెండుహేతువులకుఁ దగినయాధారములు కనఁబడవు. ప్రాఁతకడపలో నొకనంది గలదు. ఆచెంత దేవాలయ మిపుడులేదు. పూర్వ ముండక తప్పదు. శిథిలమై యిపు డానందిమాత్రము మిగిలియుండఁగాఁ దనయవస్థయిట్టిదని యాస్థలము మొఱ్ఱయిడుచున్నది. అది యూరికిముందే కలదు. త్రవ్వించిచూచినఁ గొన్నియాధారములు దొరకకమానవు. అంతటిశ్రద్ధగలవారిపు డీప్రాంతములలేరని నాయూహ. ఊహాలు కొందఱకుండవచ్చునుగాని వానికి ఫలములేదనిమాత్రము చెప్పఁగలను.

ఆంగ్లేయప్రభువులు.

క్రీ. 1800 సం. నైజాము స్వదేశరక్షణార్థము పరరాజుల నడంచునిమిత్తము ఆంగ్లప్రభువులకు సంవత్సరమునకు 63 లక్షల రూప్యము లాదాయము వచ్చుదేశము నిచ్చెను. ఆదేశము దత్తమండలము లనఁబడుచున్నది. 1807 సం. కడపట సర్ థామస్ మండ్రోలు మండలాధికారిగా నుండి ఆపనికి రాజీనామానిచ్చి స్వదేశమునకుం బోయెను. ఈమండల మాంగ్లేయప్రభుత్వము కలదియైనదిమొద లేబాధలులేక నెమ్మదిగాఁ బ్రజలుండఁగాఁ జూడఁదగియున్నది. కడపనగరము సకలబాధారహితమై యింతదనుక హాయిగా నున్నది.

టిప్పుసుల్తాన్ కాలమున మంత్రిగానున్న పూర్ణయ్యపంతులయొద్ద బచ్చేరావుగారు పనినేర్చుకొనుచుండి టిప్పు పట్టుపడఁగాఁ గడపకువచ్చి యింగ్లీషువారి యాదరణమునకుఁ బాత్రుఁడయ్యెను. సర్ థామస్‌మండ్రోలు వీరిని బిలిపించి నెలకేడువందలరూప్యముల జీతముగల మండలాధిపతిక్రింద మంత్రిగా (హుజూరు సిరస్తాదార్) నియమించెను. ఈబచ్చేరావు క్రీ. 1837 సం. విశ్రాంతిని బుచ్చుకొనిరి. వీరిసేవకు మెచ్చి దొరతనమువారు కడపతాలూకాలోని పుట్లంపల్లె, పులివెందలతాలూకాలోని యిడుపులపాయె, యను రెండుగ్రామముల నొసంగిరి. వీనియాదాయము సంవత్సరమునకు నైదువేల యాఱువందల రూప్యములు. ఇది మూఁడుతరములవఱకు జరగునని యాజ్ఞ. అందు బచ్చేరావు జీవించియుండునంతదనుకఁ బన్నులేదు. ఆవల నాదాయములో సగము దొరతనమువారికిఁ జెందునట్లుత్తరు వీఁబడినది. వీరియాలోచనలను మండలాధిపతి యవసరముగలప్పుడు గ్రహింపవలయుననియు నాయుత్తరువునఁ గలదు.

చదువరులారా! ఇంతదనుక మండలసామాన్యవృత్తాంతముల వ్రాసితిని. ఇంక నాయాప్రదేశముల (తాలూకాల) వృత్తాంతము నించుక వ్రాసెదను.

పులిమందలు. (పులివెందల)

ఇపుడు వాడుకలోనున్నపేరు పులివెందలయని. పులిమందలు అని పూర్వము వాడుకొనుపేరని పెద్దలు చెప్పుదురు. మున్నీప్రాంతములఁ బెద్దపులులు విశేషించియుండెననియు, మందలుగానుండు తావులకుంబోయి వేఁటకాండ్రు చంపుదు

రనియు, నాకారణమున దీని కీపేరు వచ్చెననియుఁ జెప్పుదురు. ఇది కొంతదనుక నమ్మఁదగియున్నది. పులివెలఁదులు అని వేరుండవచ్చుననియు, ఆఁడుపెద్దపులులు విశేషించి యుండుననియుఁ గొందఱు చెప్పుదురు. ఈయర్థ మవకతవక సిద్ధాంతమువంటిది. ఆఁడుపెద్దపులులకు వెలఁదులనిచెప్పుట స్వభావవిరుద్ధము. కాన నీకథ యసంగతము. ఈయూరు కడపకు దక్షిణపశ్చిమభాగమున నున్నది. ఈ తాలూకాయందుఁ బెక్కుకోటలుండెను. అందుఁ బాళెగాండ్రుండిరి. వారిచరిత్రములు ప్రత్యేకముగా వ్రాయఁదగినవికావు. వ్రాసినను జదివి లాభమునొందఁదగువిషయము లందులేవు. ఒక్కకోటచరిత్రము వేడుకగా నుండును. కాన దానిని వ్రాసెదను.

వేములకోట.

వేముల యనుగ్రామమున నొకకోట గలదు. అందొక పాళెగాఁ డుండువాఁడు. ఆకోట సమీపమునుండి యొకమార్గము కలదు. అది కదిరిమీఁదుగా మైసూరుకుఁ బోవునది. ఆబాటయే యాకాలమునఁ బ్రసిద్ధము. కోట యెత్తుగానున్న భూమిపైఁ గట్టఁబడినదిగాన నాగోడనెక్కి చూచినచోఁ జాల దూరము కఁనబడును.

అందున్న పాళెగాఁ డాప్రాంతములకు గొప్పప్రభువు. ఆతనిక్రిందఁ బెక్కుమంది వేఁటకాండ్రుండిరి. వేఁటకాండ్రనుటకంటె వేడుకకాండ్రనుట మేలని మీకు ముందు తోఁపక మానదు. మార్గస్థులెవరైనఁ బోవుచుండఁగా నాకోటగోడనెక్కి యొక్కఁడు చూచును. వచ్చువారుగాని పోవువారుగాని దూరమునఁ గనఁబడఁగా వెంటనే కొందఱు తగుమ

నుష్యులుపోయి వారిం బ్రహరించి వారియొద్ద వస్తువులందీసికొని యేత్రోవననో వచ్చి కోటలోఁ జేరుదురు. ఇదివృత్తిగా నాపాళెగాఁడు జీవించుచుండెను. పాప మాబాటసారులలోఁ గొందఱు వెట్టివారువచ్చి వీరితో మొఱ్ఱపెట్టుకొనుచుందురు. ఫలములేకున్నను మంచిమాటలు నాలుగుచెప్పి సాగనంపుట వాడుక. ఇట్టిప్రభుపాలనమున నారాజ్యభాగ మెట్లుండునో యూహింపవచ్చును.

ఈతాలూకాయందు భూభాగములు సారవంతములు. జొన్న ప్రత్తి పూర్వమునుండి ఫలించు ప్రధానసస్యములు. వరిపైరు చాల తక్కువ. ఇపుడు వేఱుసెనగయు సమృద్ధిగాఁ బైరగుచున్నది. జనులు ప్రత్తివడఁకి నూలుచేసి దానినేయించి కట్టుకొనువారు. ఇప్పటికి నావాడుక కలదు. అయితే పూర్వముండినంత యలవాటు లేదు. ప్రజలు కడుబీదలు కారు. ఇతరులకు సహాయముచేయుస్వభావము కలవారు. పౌరుషప్రధానులు. ఆపౌరుష మొకప్పుడు హానికరము నగుచుండును. విద్య చాలతక్కువగా నుండును. పాఁడిపంటలకుఁ దక్కువలేదు. తమలపాకు లీభాగమునఁ బ్రసిద్ధిగాంచినవి. వానికి కాఱపాకు లందురు. పులివెందలగ్రామమున నంజూరపుఁబండ్లు, నిమ్మపండ్లలో నొకవిధముగ నుండునవి, గొప్పనేరేడుపండ్లు గలవు. నీటివసతి సామాన్యము. వేంపల్లి (గండి) అను నొక ప్రసిద్ధగ్రామము కలదు. అందు ఆంజనేయులు వేంచేసియుండును. మండ్రోగారికం దొక్కబంగారుతోరణము గనఁబడియెననియు వారు దానినిగాంచి యాదేవునకు మాన్యమిచ్చెననియు వాడుక గలదు.

జమ్ములమడుగు.

పినాకినీతీరమున నిది గలదు. పెన్నలో నిట సర్వకాలము జలముండదు. ఈతాలూకాలో తుంగభద్రనుండివచ్చు నీటికాలువ కొంతభాగమునఁ బ్రవహించును. అందు వరిపండును. తక్కినభాగమున జొన్నలు, వేఱుసెనగ, ప్రత్తి, మొదలగునవి పైరగును. గ్రామములలోఁ జాలభాగముల నీరు తక్కువ. పాఁడిపంటలు సమృద్ధిగా నుండును. ప్రజ లారోగ్యవంతులు. దానముచేయుటలో వెనుదీయువారు కారు. విద్య సామాన్యముగా వ్యాపించియుండును. జనులకుఁ బౌరుషము ప్రధానము. ఈవిషయము నీభూభాగము పులివెందలతో సరితూఁగును. వస్త్రము లిందు మిక్కిలి ప్రసిద్ధములు దొరకును. పర్వతభాగము లిందుఁ జాలతక్కువ. సుప్రసిద్ధమగు గండికోట యీ తాలూకాలోనిదే. పూర్వ మీభాగము ములికినాడని పిలువఁబడునది. గండికోటలో సకలఫలములు శాకములు దొరకును. అంత సారవంతములగునవి మఱెందును దొరకవు. పినాకిని సంపూర్ణజలపూరమునఁ బ్రవహించుచుండఁగా గండికోటనుండి చూచినచోఁ గన్నులపండువగును. ఈతాలూకా కడపకుఁ బశ్చిమోత్తరభాగమున నుండును.

ప్రొద్దుటూరు.

ఈయూరు చాలఁ బెద్దది. ధనసమృద్ధము. పినాకినికి నుత్తరభాగమునఁ గలదు. దీనిచెంత రామేశ్వరమను శివక్షేత్రము గలదు. అది ప్రాచీనకాల నిర్మితము. ఈతాలూకాయందుఁ గొంతభాగము తుంగభద్రనుండివచ్చు నీటికాల్వచే జలసమృద్ధి గలదిగాఁ జేయఁబడినది. కుందునది ప్రవహించుభాగము మిగుల

సారవంతము. జొన్న, ప్రత్తి, వేఱుసెనగ లోనగునవి యిందుఁ బైరగును. జను లారోగ్యవంతులు. విద్యావంతులుకూడఁ గలరు. నాగరకత వ్యాపించుచున్నది. అన్నదానమున నీప్రజలకుఁ బ్రీతిమెండు. పౌరుషము సర్వసాధారణము. ప్రొద్దుటూరునందుఁ బ్రసిద్ధిఁగాంచిన కన్యకాంబదేవాలయము కలదు. ఈగ్రామమున నీలిమందు, బంగారువస్త్రములవ్యాపార మధికము. ధనవంతు లిందుఁ బెక్కుమంది గలరు. వేడుకలయం దీప్రజలకు విశేషప్రీతి. కడప కీయూరు వాయవ్యభాగమున నున్నది. దీనికిఁ దూర్పుభాగమున నల్లమల కలదు. అదియే యీమండలమును రెండుభాగములుగాఁ జేసినది. ఆకొండ నీతాలూకాకుఁ దూర్పుభాగమున రెండుతావులఁ దెగిన ట్లుండును. ఆద్వారములద్వారా మనుజులు ప్రయాణము చేయుదురు. మెట్టపైరు హెక్కుడు.

బద్వేలు (పెద్దప్రోలు)

ఇద్ది కడపకు నీశాన్యభాగమున నున్నది. నల్లమల (శేషాచలము) వెలికొండ యీ రెండింటికినడుమ (నీతాలూకా) దీని భాగము కలదు. సగిలేరు ఈభాగమునఁ గలనది. ధనసమృద్ధి యీప్రదేశమునఁ జాల తక్కువ తటాకములు పోరుమామిళ్ల బద్వేలియను నీరెండుగ్రామములకుం గలవు. వరిపైరు ప్రధానము. ప్రత్తి లోనగునవి చాల స్వల్పము. జనులు విద్యాధికులు గారు. ఇపుడిపుడు విద్య వ్యాపించుచున్నది. బద్వేలి పోరుమామిళ్ళ శేకూరుపేట యనుతావులఁ బూర్వము మంచికోట లుండెను. ఇపుడు వానిచిహ్నములు గలవు. ఇంకను గొన్నితావులఁ జిన్నచిన్నకోటలు గలవు. పాళెగాండ్రప్రాంతములలేరు. దేశాయీలను నొకతెగకాఁపులు గలరు. వీరియిండ్లస్త్రీలకు వెలుపలరాకయుండు (ఘోషా) పద్ధతి గలదు. వీరు భూస్వాములు. పాళెగాండ్రపద్ధతులు గలవారు కారు. జనసంఖ్య సామాన్యము. ధనముకొఱకు నీలిపైరు పెట్టుదురు. బెల్లము సిద్ధమగును. చల్లగిరిగెల యనుగ్రామమున శ్రీకోదండరామాలయము గలదు. ప్రతిశనివారము భక్తు లరుదెంచుచుందురు. ఈతాలూకాయందే మఠము లెక్కువ. నాగరికత సామాన్యము. పౌరుషము జనులకిందుఁ బ్రధానము కాదు. భాష ప్రొద్దుటూరుతాలూకా భాగమునకన్నఁ దేటగానుండును. చెవులకింపుగానిపదముల నెవ్వరును దఱచుగా నుపయోగింపరు.

సిద్ధవటము.

కడపకుసమీపమునఁ దూర్పున నీగ్రామము గలదు. పినాకినికి నుత్తరభాగమున నున్నది. ఇందు మిక్కిలి చక్కని కోట గలదు. చాలభాగము శిథిలమైనను ఇప్పటికిని బాగుగ నున్నది. ఉత్తరము తూర్పు కొండలు గలవు. కృషికనుకూలము లగుభూము లీగ్రామమునకుఁ జాలకొంచెముగ నున్నవి. దోసపండ్లు వేసవికాలమున నిందు సిద్ధములగును. ఇది ప్రాచీన గ్రామమని యొకపురాణము తెల్పుచున్నది. అది స్థలపురాణము. ఇది శివక్షేత్రము. సిద్ధవటము పవిత్రతమమని యీస్థలపురాణము తెల్పుచున్నది. పినాకినికి గంగయనుపేరు గలదు. గంగనపల్లి, గంగపేరూరు లోనగుగ్రామము లీనదిపేరుననే కట్టఁబడినవి. రంగనాథస్వామియాలయ మిటీవలఁ గట్టఁబడినది. ఈతాలూకాయందు చిన్నచిన్నకొండలు మెండు. కావున భూభాగములు ఒక్కరీతిగా చాలదూరముండుటకు వీలుకాదు. ఆకొం

డలలోఁ గొన్ని నిరుపయోగములుగ నున్నవి. పశువులకు మేతయు నందు దొరకదు. అడవులుండుభాగము చాలగలదు. బావులయాధారమున సస్యములు విశేషముగాఁ బండును. జొన్న ప్రత్తి యిందుఁ జాలతక్కువ. సగిలేరు ఈతాలూకా తూర్పుభాగమునఁ బ్రవహించి పినాకినిలోఁ గలియును. ఆభాగమునకు సగిలిపాయ యందురు. జనులు విద్యాధికులు గారు. భాష మంచిది. చెవులకు వినసహింపనిపదము లుపయోగించువారు విశేషసంఖ్యాకులు లేరు. నాగరకత సామాన్యము. ధనసమృద్ధి యత్యల్పము. ఒంటిమిట్ట సిద్ధవటమునకు దక్షిణభాగమున మూఁడుక్రోశములదూరమున నున్నది. ఈతాలూకాభాగమునఁ బినాకినీతీరమునఁ బెక్కుశివాలయములు గలవు. బమ్మెరపోతనకవి భాగవతము రచించుటకుముం దీసిద్ధవటమునకుఁ జంద్రగ్రహణకాలమున వచ్చి సిద్ధగంగయందు మునింగి యిసుకదిన్నె మీఁదఁ గూరుచుండి యీశ్వరధ్యానము చేయుచుండ రాజముఖ్యుఁ డొకఁడు ప్రత్యక్షమై తనను భాగవతము రచింపఁ బ్రోత్సహింపఁగాఁ గొన్ని దినంబు లందుండి యేకశిలానగరంబునకుం జనుదెంచి గురువృద్ధబుధబంధుజనానుజ్ఞాతుఁడనై ప్రారంభించితినని చెప్పుకొన్న భాగ మీ సిద్ధవటమే. పినాకినికి గంగయని పేరులేదనువారు దేవానాంప్రియులే. గంగవరము గంగనపల్లె గంగపేరూరు సిద్ధవటమునకు సమీపముననే కలదు. కడపమండలములో గంగనపల్లె, గంగవరము, గంగాయపల్లె, గంగపేరూరు, లోనగుగ్రామములు గలవు. కావున నదికి గంగపే రున్నదనుట నిర్వివాదాంశము. గోదావరికి నీపేరుకల దందురు. గోదావరికేగాదు గొప్పనదులన్నింటికి నీపేరుగలదని నాభావము. బొమ్మ

రమనుగ్రామములు పెక్కులుండుట, యేకశిలానగర మనుపేరు ఒంటిమిట్టకుండుట, శ్రీకోదండరామమూర్తి దేవాలయము పూర్వరాజగౌరవసమన్వితముగ నుండునది యందుండుట, ఆదేవాలయమున నాంధ్రభాగవతమునకుఁ దాంబూలమర్యాద నేఁటివఱకుండుట లోనగుకారణములచే నిదియేయని సిద్ధాంతమని పెద్దలు చెప్పుదురు. పోతనకవి యీయూరఁబుట్టి యీచోటఁ జేరిగి యిందుఁ బొలముదున్ని యిందు భాగవతము రచించెనని శాసనములు వేఱొకచో నున్నయెడల నిదికాదని యప్పటికిఁ జెప్ప వీలులేదు. ఏలయన నిట్టిశాసనములు కల్పితములుగాక వాస్తవముగా నుండవు. కావున నెన్నివిధముల నాలోచించినను ఒంటిమిట్టయేయని సిద్ధాంతము సుజనులచేఁ జేయఁబడును.

సిద్ధవటమునకు నుత్తరపశ్చిమభాగమునఁ బినాకినియొడ్డున జ్యోతియను నొకక్షేత్రము గలదు. అందలిశివాలయ మిసుకలోఁ బూడియుండెను. ఇటీవల దొరతనమువారు ధనమువెచ్చించి త్రవ్వించిరి. కాని యది పూర్తిగా వెలువరింపఁ బడలేదు. అది చతుర్ముఖబ్రహ్మదేవాలయమని కొంద ఱందురు. సత్యమిదియని యింతదనుకఁ దేలకున్నది.

రాజమపేట.

ఇది కడపకుఁ దూర్పుభాగమున నున్నది. ఈదేశమునకు రాజువారిసీమయని పేరు. పొత్తపి మొదలగు పూర్వరాజనివాసగ్రామము లీ భాగములోనివే. మండలచరిత్రమున కీభూభాగము ప్రధానము. మట్లిరాజులు చక్కఁగా దీనిని బాలించిరి. బాహుదానది యిందుఁ బ్రధానము. గుంజనయనునది.

యొకటిగలదు. అది జలసమృద్ధిగలది. బాహుదానది సదా ప్రవహించునది గాదు. ఒకసారి ప్రవహించిన సంవత్సరము వఱకు నందలికాలువలో నీరు ప్రవహించును. ముక్కారు సస్యము లిందుఁబండును. ఈయేటి యిరుతటముల నుండుభూములేగాక యీ తాలూకాలోనిభూములు మిగుల సారవంతములని ప్రసిద్ధిగాంచినవి. మట్లిరాజు లీతాలూకాలో పండితులకు నలువదినాలు గగ్రహారము లొసంగిరి. వారివంశము వారు నేఁటివఱ కున్నవారు. ఈ ప్రదేశము కడపమండలరాజ్యలక్ష్మికి హృదయమువంటిది. విశేషఫలవృక్షము లీభాగమునఁ గలవు. ప్రతిగ్రామమందును జలసమృద్ధిగలదు. జనులు నాగరకతగలవారు. వరి ప్రధానసస్యము. నీలి ధనమును దెచ్చు సస్యము. ఫలములు చాలదేశములకుఁ బంపఁబడును. కొబ్బెర చెట్లు, పోకచెట్లు మామిడిచెట్లు లెక్కకు మించియుండును. నిమ్మపండ్లలో నొకజాతి యిందు ఫలించును. వానివలన ధనలాభమెక్కువగాఁ గలదు. పూర్వ మీప్రాంతమున నాలుగువేదములునేర్చి పూనానగరమున పీష్వాయొద్ద గొప్పసమ్మానమునందిన ఛాలీశావధాను లుండిరి. ఆఱుశాస్త్రములలో "మదన్యఃకోవిద్వాన్" అను బిరుదముపలుకుచు నెందు నోటమిలేకయుండిన ఆలూరు నృసింహశాస్త్రులుగా రుండిరి. ఆలూరు గంగాధరసోమయాజి మంత్రశాస్త్రపండితుఁ డుండెను. పండితరాట్టను బిరుదమును భరతఖండమంతయు వినుతించునట్లు ప్రవర్తిల్లిన జగన్నాథపండితు లీరాజువారిసీమయం దుండినవారే. ఇట్టిమహనీయులుండిన భాగమిది. ఏటిభాగములకు జలసమృద్ధిగలుగఁగాఁ దక్కుభాగములఁ జెఱువులు కట్టింపఁబడినవి. దీనికిదక్షి

ణమున శేషాచలక్షేత్రము గలదు. పూర్వము కోడూరునుండియే నడచి తిరుపతికిఁ బోవువారఁట. ఇపుడామార్గములు దుర్గమములుగ నున్నవి. ఈతాలూకాకుఁ దూర్పుహద్దుగా శేషాచలము కలదు. దానిశాఖయొక్కటి పశ్చిమభాగమున వ్యాపించినది. ఉత్తరమునఁ బినాకిని తూర్పుగాఁ బ్రవహించును. దానితీరమునఁ బర్వతములు గలవు. కావున నీతాలూకా పర్వతప్రాకారపరివేష్టితమగు నొకనగరమువలె నుండును. పుల్లమ్మపేట మున్నుతాలూకాగా నెన్నఁబడియుండెను. ఆభాగ్యమిపుడు రాజమపేట కబ్బినది. మట్లివారివంశమువారి స్త్రీలు ఈ రెండు గ్రామములను గట్టించిరని ప్రతీతి కలదు. రామక్క అగ్రహారము, శేషమాంబాపురము, వెంగమాంబాపురము లోనగు గ్రామములు రాజకుటుంబములోని స్త్రీలపేరుననే కట్టింపఁబడినవి. మట్లివారిధర్మ మనన్యాదృశము. ఆచంద్రతారార్కము వారి యశఃకీర్తులు వ్యాపించియుండఁగలవు. నెందలూరు, అత్తిరాల, ఎల్లమ్మపేట యనుతావుల దేవతోత్సవములు జరగును. ఇందలి జనులభాష మనోహరముగా నుండును. పరదేశము నుండి యెందఱువచ్చినను అన్నదానముచేయువా రిందుఁగలరు. మట్లిరాజుల యౌదార్యముదెలుపు చిన్నకథనువ్రాసి యీచరిత్రమును ముగించెదను.

మట్లిరాజులలో నొకరు వేఁటకుఁబోయి యడవిలోనుండువారి వేషమునుదాల్చి యొంటరిగ నొకయగ్రహారమునకు వచ్చెనఁట. అది సాయంకాలము. బ్రాహ్మణుని యింటికిరాఁగా గృహపతి యింట లేకుండెనఁట. ఆయనపత్ని రాజునుగుఱుతించి యలువదినాలుగువిధములుగా కూరలు, పచ్చడులు, లోనగు

వానిని సిద్ధపఱచి యన్నము పెట్టెనఁట. ఆమెవిశ్వాసమునకు సంతోషించి యారాజు అఱువదినాలుగుకుంటలు భూమిదానము చేసిపోయెనఁట. ఈకథ యెంతదనుకనిజమో వచియింపఁజాలను. కాని యాభూమి పచ్చడులమాన్య మనుపేరున నేఁటివఱకుమాత్ర మున్నది. అట్టి దానకర్ణులకీర్తి శాశ్వతముగా నిలుచుననుటలో వింత యేమున్నది?

కడప.

ఈభాగమున వరి ప్రధానసస్యము. తక్కినవి పేరునకు మాత్రమే పండును. పాలకొండలు దక్షిణభాగమున నొకక్రోశమాత్రమున నున్నవి తూర్పున దానిశాఖయనఁబడు కేవల పాషాణమయాల్పపర్వత మొక్కటికలదు దానిదాఁటి సిద్ధవటమునకుఁ బోవలయు. దానికి బండికనుమ యని పేరు. రాజమార్గ మద్దానిపైనుండియే కలదు. ఇట్లు పర్వతములు సమీపముననుండుటచేతను గ్రామభాగము తగ్గుప్రదేశమున నుండుటచేతను ఎండలు మెండుగా నుండును. జనులు నాగరికతగలవారనవచ్చును. భాష గ్రామ్యపదభూయిష్ఠము కాదు.మహమ్మదీయులేలిన నగరముగావున నాచిహ్నము లింకనుగలవు. కోట పాడుపడి రూపఱియున్నను బురుజులు రెండుగలవు. అవి పూర్వచరిత్రమును స్మృతికిఁ దెచ్చుచుండును. ఉత్తరమున రెండుక్రోశములదూరమునఁ బెన్నకలదు. పాలకొండనుండి యూఁటజలము ప్రవహించునది యొకటి కడపచెంతనుండి పినాకినిలోఁ గలియఁబోవును. దానిజలము పానార్హమని దొరతనమువారు గొట్టములద్వారా తెచ్చిరి. దేవునికడప, పుష్పగిరి యనుచోట్ల దేవతోత్సవములు సాగును. దేశము ధనసమృద్ధముకాదన వీలు

లేదు కాని విశేషధనముగలవా రరుదు. భూభాగములు సారవంతములు. ఫలవృక్షము లీకడపచెంతఁ గలవు. రావుజీ గండి యనునది కడపకునుత్తరమున రెండుక్రోశములదూరమున నున్నది. పినాకిని రెండుకొండలనడుమఁ బ్రవహించును. చూడఁదగినస్థలము. పర్వదినములయం దీనగరవాసు లచ్చటికిం బోయి స్నానముచేసి యందున్నశివాలయమును దర్శించి వత్తురు.

కామలాపురము.

కడపకుఁ బడమర నీగ్రామ మున్నది. గండేరు (పాపఘ్ని) దీనికిఁ దూర్పున నున్నది. దీని కాలువలు జలమును దెచ్చును. వరిపంటయే ప్రధాన సస్య మనవచ్చును. భాష శ్రుతిహితము. ఏటికాలువలక్రింద భూములు సస్యసమృద్ధిగలవిగ నుండును. చాలభాగ మీభాగమున జలమునకుఁ గష్టము లే దనవచ్చును. దేశము ధనసంపన్నము కాదు గాని యన్నమునకుఁ గఱవులేక జీవించు ప్రజ లిందుఁ గలరు. ఈ గ్రామమునకు నుత్తరము తూర్పు వీని నడుమ నదులు పినాకినిలోఁ గలియును. ఆభాగము చూడ వేడుకగా వర్షకాలమున నుండును. ఇతరమాసములలో నిసుకప్రవాహామని భావించునెడల బాగుగనేయుండును.

కామలాపురమునకు సమీపమున మూడుక్రోశముల దూరమునందుఁ గోకటమనుగ్రామము కలదు.అదిపినాకినికి దక్షిణభాగమునఁ గలదు. అందు వరి పండదు. ఆగ్రామమును వలయునని కోరఁగా సంతోషమున నల్లసాని పెద్దన్నగారికి శ్రీకృష్ణదేవరాయ లిచ్చెను. పెద్దనకవి దీనిని గోరనేల? అన్నది యొకప్రశ్నము. ఇది శఠకోపస్వామిగారికిఁ బెద్దనగా రిచ్చిరి. ఆశఠ

కోపస్వామి పెద్దనకు హయగ్రీవమంత్ర ముపదేశించె నఁట. దానఁ గవిత్వ మలవడె నఁట. ఇది యొక వాడుక కథ.

క. కొలుతుఁ మద్గురు విద్యా
నిలయుం గరుణాకటాక్షనిబిడజ్యోత్స్నా
దళితాశ్రితజనదురిత
చ్ఛలగాఢధ్వాంతసమితి శఠకోపయతిన్.

అని పెద్దనగారు మనుచరిత్రమున వ్రాసికొనిరి. విద్యాగురు వని కూడఁ బ్రసిద్ధిగలదు. మఱియు దీనికి సమీపముననే పెద్దనపాడు అను గ్రామము కలదు. ఆగ్రామమున నెవరియింట వివాహాదిశుభకార్యములు సాగినను అల్లసాని పెద్దనగారి తాంబూలమని తొలుత నిత్తురు. నేఁటికి నా యాచార మున్నది. ఏల? ఇది యొక ప్రశ్నము. ఈగ్రామసమీపమునందే పెద్దన చెఱువని యొకతటాక మున్నది. దాని జనులకు సస్యములకు నుపయోగింప గట్టించినది కాదు. అడవిమృగములకుఁ బశువులకు నుపయోగింపఁ గట్టించినది. ఇదేల? అనునది యొక ప్రశ్నము.

ఈమూఁడింటిని బట్టి చూడఁగా అల్లసాని పెద్దన్న తొలుత నీగ్రామములఁగాని యీప్రాంతమునఁగాని పుట్టి పెరిఁగినవాఁడనియు రాజాశ్రయణమును గోరి విజయనగరమునకుం బోయియుండు ననియు నొక యూహ చేయఁదగియున్నది. ఇట్లూహించుట పాపము కా దని మాత్రము చెప్పఁజాలుదు. మఱి కొన్నితావుల నీమహాత్మున కగ్రహారము లీఁబడినవి. అంత మాత్రమున నిదియే జన్మస్థాన మని మొండిపట్టుదలచే సిద్ధాంతమిదియే యని, నేనే యేలేశ్వరోపాధ్యాయుఁడ నని, నాకన్నఁ జరిత్రాంశమునఁ దెలిసిన మిన్నలు లేరని, ఎంతటి యసంగతము లున్నను నామాటయే గెలువవలయునని అభిప్రాయ ముండుట యవివేకమూలమని నే నెఱుంగుదును. కాని యగ్రహార ముమాత్రమేగాక యాయనపేరున గ్రామము చెఱువునను నీ రెండును పైనాయూహ కాధారములని విన్నవించెదను. ఈభాగమునందు భాష మూఁడుభాగములు శ్రుతిహితము ఒక్కభాగము నాగరకత కలియని భాష. గ్రామ్యపదసమ్మిళితము. పులివెందలవారిభాషను బోలియుండును.

దీనియందుఁ గొన్నిభాగములలో గనులుగలవు. అందు నీలపాషాణములు దొరకును. అవి పెక్కుదేశములకుఁ బంపఁబడుచుండును. వీనిమూలమున ధనము కొంద ఱార్జింతురు. బీదలకు సాయముగ నుండును.

రాయచోటి, (రాచవీఁడు).

కడపకు దక్షిణభాగమునఁ బదునాలుక్రోశముల దూరమం దున్నది. రాయచోటి యనఁగా రాజులున్నచోటు అని యర్థము. చోటు అనునది చోటి అని మాఱినది. రాచవీడు అను మఱియొకనామము దీనికిం గలదు. అది పై యర్థమును స్పష్టపఱచుచున్నది. రాజుల కునికిపట్టు. అని దాని యర్థము. ఈభూభాగమునఁ బెక్కు యుద్ధములు జరగినవి. గుఱ్ఱము కొండకీమార్గముననే దండునడచుట వాడుక. అరణ్యభాగము లెక్కువయుండుట, అందందుఁ గోటలుండుట, పాళెగాండ్రు పెక్కుమంది వాని నాక్రమించుకొనియుండుట మొదలగు కారణములచే నీభాగము యుద్ధమున కనుకూల మని స్పష్టమ

య్యెడిని. పూర్వము యుద్ధముల కాటపట్టుగా నున్నందునఁ బెద్దపెద్దగ్రామములు లేక యందందుఁ జిన్నిగ్రామముల నిర్మించుకొని మనుజులుండువారు. ఇందుఁ జల్లనిభాగములు పెక్కుగలవు. ప్రజ లనాగరికులు గారు. బావుల యాధారమున భూములు పండును. మరియు, జొన్నయుఁ బండును. చెఱకు విశేషించి పైరుచేయఁబడును. చింతచెట్లు మిక్కిలిగా నుండును. కందులు పెసలు లోనగునవి యిందుఁ బండును. వ్యాపారమున కిది ప్రధానస్థానము. కడపనగరమున కిది ముఖ్యస్థానము. పెక్కువస్తువు లిచ్చట నుండియే కడపకుఁ దేఁబడును. విద్యాధికులు తక్కువ. భాష గ్రామ్యపదభూయిష్ఠము కాదు. కాని యించుక దీర్ఘముగ మాట లీడ్వఁబడుచుండును. ఫలవృక్షము లిందు మెండు. ప్రజలు బీదతనమున నలంకరింపఁబడియుందురు. విశాలభూభాగములు లేవు. చిన్నచిన్న కొండలు మెండుగ నుండుటయే దీనికిఁ గారణము. ప్రజలు పౌరుషప్రధానులు కా రనిచెప్ప వలనుపడదు. కాని యది యెక్కువ కా దని చెప్పవచ్చును.

రాయచోటిలో వీరభద్రస్వామికి నుత్సవము ఆశ్వయుజమాసమున జరగును. విజయదశమినాఁడు పార్వేటయుత్సవము సాగును. ఊరికి వెలుపలనుండు మండపమునకు స్వామిని గొనిపోయి యందుఁగల మండపములో వేంచేయునట్లు చేయుదురు. ఆమండపముక్రింద నున్న పాషాణముల సందుల వృశ్చికములు (తేళ్లు) పెక్కు లుండును. వీరభద్రస్వామి వేంచేసియుండుదనుక నాతేళ్లు ఎవ్వరిని గుట్టకుండును. వేడుకకు వానిం బట్టుకొందురు. వాలము చివరన విషకలశముండును. ఐన నెవ్వరి

నేమాత్రము బాధింపవు. ఈ ర్త వాస్తవమా యని విచారింపఁగా నాప్రాంతములనున్న యధికారి (తహసీల్దారు) వాస్తవమే యని బదులు వ్రాసిరఁట. ఇది భగవంతుని మహిమమని యచ్చటిప్రజలవిశ్వాసము.

గనులు, లోహములు.

కడపసమీపమున నున్న చెన్నూరుదగ్గర పెన్న గట్టున గుజ్జముపా డనుచోటున వజ్రములు దొరకును.

నంద్యాలముపేట సమీపభూములలో ఇనుము దొరకును. ఎఱ్ఱగుంట్లకోట, బిట్టివేలు, మడిచెలువు అనుచోటులంగూడ నినుము గలదు.

బద్వేలుగ్రామమునకుఁ బడమటగానున్న జంగమరాజుపల్లెదగ్గర నుంచి సీసము దొరకును. వెండికూడ నీచోటఁ గలదు. రాగియు నిందే మిక్కిలి కొంచెముగా దొరకును.

ఈలోహములను దీయుటకుఁ బూర్వము ప్రయత్నించిరఁట. ఏకారణముచేతనో యాప్రయత్నము సాగలేదు. ఇప్పుడాప్రయత్నముచేయ నూహించినట్లును వినరాదు. కారణమేమో.

కోనలు (కొండగుహలు)

ఈమండలమున నీకోన లెక్కుడుగలవు. మఠము లున్నట్లే యివియు నున్నవి. కాని మఠములవలనఁ గలిగెడు దుర్వ్యయము వీనివలనఁ బ్రజలకు లేదని నాయూహ. ఈకోనలచరిత్రమంతయు వ్రాయక కొలఁది కోనలచరిత్రమును వ్రాసెదను.

నిత్యపూజ గుహ.

ఇది సిద్ధవటమునకు నుత్తరభాగమున మూఁడున్నర
క్రోశముల దూరమునఁ గలదు. దీనియం దొక పెద్ద చట్రాయి
గలదు. దానిక్రింద రెండువందలమంది కూరుచుండవచ్చును.
ఆగుహాలో శివలింగము కలదు. ఆలింగమునకు రాత్రులయందు
మహర్షులు పూజచేయుదురని ప్రజలవిశ్వాసము. జలము దొర
కును. కార్తీకమాసమున నచ్చటికి భక్తులు పోయి యభిషే
కము చేసి వత్తురు. రాత్రిపూట అచ్చట శయనింపరు. మును
లాగ్రహింతురనియు, వారు పూజించుట కభ్యంతరము కలుగు
ననియుఁ గొందఱకు విశ్వాసము.

పంచలింగముల కోన

సిద్ధవటమునకుఁ బదునైదుక్రోశముల దూరమునఁ దూ
ర్పుగా మల్లెముకొండ యందుఁ గలదు. ఆగుహాలో నైదులిం
గములు దొరకినవి. కార్తీకమాసమున నాల్గుసోమవారములు
భక్తు లక్కడికింబోయి యభిషేకోత్సవము జరపి రాత్రి కిండ్లకుఁ
బోవుదురు. అందును మునులాలింగపంచకమును బూజింతు
రనియే ప్రజలకు కమ్మకము.

వేణుగోపాలస్వామి గుహ.

ఇది లంకమలలో నున్నది. సిద్ధవటమునకు నుత్తరమున
నైదుక్రోశములదూరమున నున్నది. వేణుగోపాలవిగ్రహ మిం
దుఁగలదు. వారమున కొక్కపర్యాయము పూజ జరగును.
ఇతరదినములలో మునులే పూజింతు రని ప్రతీతి. ఇందు సదా
జలము గలదు. మడుగుగలదు. అగాధ మని పేరు. నిర్మలోద

కము దానియం దెట్టి తాపసమయమునైన నుండును. అర
ణ్యము దట్టముగా నుండును. క్రూరమృగములసంచారము
గలదు. ఆదేవాలయమున నుండినచో నేక్రూరమృగమైనను
బాధింపఁజాల దని నమ్మకము.

భైరవగుహ. (భైరవుని కోన)

ఇది బద్వేలునకు నుత్తరమున నిరువదెనిమిదిమైళ్లదూరమున
జిల్లేళ్ల యనుగ్రామమునకుఁ బడమరభాగమునఁ బర్వతమున ను
న్నది.మార్గమునఁ బోవువారల కగపడుచుండును. ఆగుహదగ్గర
మారేడుచెట్లు గలవు. అందొక ముని యున్నవాఁ డనియు
నెవ్వరికాముని కనఁబడునో వారు వెఱ్ఱివా రగుదు రని ప్రతీతి
కలదు. ఒక్కని నేఁ జూచితిని. ఇక్కారణమున వెఱ్ఱివాఁ డయ్యె
నని వాడుక గలదు. ఈకారణముననో వేఱుకారణముననో
నేఁ జెప్పఁజాలను. మధ్యవయస్సున వాఁడు వెఱ్ఱివాఁ డయ్యెను.
శివరాత్రినాఁ డచ్చటికిఁ బోయి పూజింతురు. గుహలోనికిఁ
బోవ నవకాశము కలదు కాని భయము గలుగక మానదు.

ఓనూతులకోన (వేయినూతులకోన).

ఇది కడపతాలూకా పెండ్లిమఱ్ఱిగ్రామను సమీపమున
నున్నది. ఇందు వేయినూతులు (చేదబావులు) కలవని ప్రతీతి.
ఇందు నృసింహస్వామి యాలయము గలదు. చాలమంది యిచ్చ
టికిం బోయి నృసింహమూర్తిని బూజించి వత్తురు. రాత్రికాల
మట నుండరా దని వాడుక కలదు.

పాలఁతులకోన.

ఇది గంగనపల్లెకు సమీపమున నున్నది. కడపతాలూకా
లోనిదే. ఇందక్కదేవత లయిదుగు రుందు రని వాడుక. పిశా

చబాధగలవా రచ్చటికిం బోవుదురు. ఈఱైదుగురు దేహములోఁ బ్రవేశింతురు. పిశాచమును దఱిమివేయుదురని విశ్వాసము. ఇందుఁ గొందఱకు కోనేటిగట్టున నంతకుముందే యెవ్వరో స్నానముచేసి పసపుముద్ద పెట్టిపోయిన ట్లగపడు నఁట. అట్టి వారి కాదేవతానుగ్రహము త్వరగాఁ గలుగు నఁట.

ఇట్టి మహిమములు గల కోన లీమండలమునఁ బెక్కులుగలవు. వానినన్నింటిని వ్రాయక మచ్చునకుఁ గొలఁదిగ వ్రాసితిని. ఇంతట నీవిషయము నుజ్జగించి యొకవిచిత్రమగు కథను వ్రాసి మఱియొకవిషయమునకు లేఖినిని ద్రిప్పెదను.

భాకరాపంతులు (భాస్కరపంతులు.)

(1) సుమారు మూఁడువందలసంవత్సరముల క్రిందనఁగా 16-వ శతాబ్దిలో గోలకొండక్రింద సిద్ధవటము మొదలగు భాగము లుండినపుడు వానికధికారిగా భాకరాపంతులు నియోగింపఁబడెను. సంవత్సరమునకుఁ జెల్లింపవలసిన ద్రవ్యమింత యనియు నిర్ణయింపఁబడియె. భాకరాపంతులు వచ్చిన ద్రవ్యమంతయుఁ దన్నాశ్రయించిన బ్రాహ్మణుల కిచ్చుచుండెను. యాచకు లందఱు యజ్ఞోపవీతములు, అక్షతలు పంతులకు సమర్పించి ద్రవ్యమును గొనిపోవుచుండిరి. కొన్నిసంవత్సరము లీరీతిగా జరగెను. నైజాము నలువదియేనుఁగులను బంపి యిన్నిసంవత్సరము లీవలసినద్రవ్యమును గొనిరండనియు, భాకరాపంతులను గూడఁ బిలుచుకొనిరండనియు భటులను బంపిరి. వారు కోపఘూర్ణమానమానసులై వచ్చి పంతులకు రాజశాసనమును విన్నవించిరి. పంతు లించుకయైన భీతిల్లక యిన్నిసంవత్సరములనుండి సేకరించియున్న యక్షతలను, యజ్ఞోపవీతములను సంచుల నింపి యేనుఁగులపై నునుపఁబంచి నైజామును దర్శింపఁబోయిరి. సంచులను డింపునప్పటికి సంచులనిండ బంగారు నాణెము లుండెను. ఆనాణెము లీయవలసిన ద్రవ్యమునకన్న నెక్కువగానుండెను. నైజాము పంతులను మర్యాదపూర్వకముగా సమ్మానించి బహుమానముగా ద్రవ్య మిచ్చి సాగనంపెను.

(2) వీరిని గుఱించిన యింకొక్క గాథ కలదు. సిద్ధవటమున కొక బ్రాహ్మణబాలుఁడు వచ్చి పెండ్లికై ద్రవ్య మడిగెను. భాకరాపంతులు కన్యకను నిర్ణయించుకొనివచ్చిన నూఱువరా లిచ్చెద ననెను. అతఁడు పోయి కన్యకను నిర్ణయించుకొని సిద్ధవటమునకు రాఁ బయనముచేసి తిరుపతి చెంతకు రాఁగా భాకరాపంతులు పల్లకిలోఁ గూరుచుండి యెచ్చటికో యరుగుచుండి కనఁబడఁగా నాబ్రాహ్మణుఁడు ద్రవ్య మిమ్మని యడిగెను. సిద్ధవటమునకు రమ్ము. ద్రవ్యము సిద్ధముచేసి పసపుగుడ్డలోఁ గట్టియుంచితి నని చెప్పి యెచ్చటికో పోయెను. ఆబ్రాహ్మణుఁడు నాల్గవదినము సిద్ధవటముచేరి పంతులయింటికింబోవఁగా భాకరాపంతులు మృతినొంది నాల్గుదినము లయ్యె ననిరి. తిరుపతి దగ్గఱఁ గానఁబడి యీవిషయము చెప్పి రని యావిప్రుఁడు చెప్పి చింతించెను. అందున్నవారు పంతులగుణము నెఱింగినవారు గాన వెదకిరి. ఇంటిలో నొకతావునఁ బసపుగుడ్డలో నూఱువరాలు కట్టి పేరువ్రాసియుంచిన మూట దొరకఁగా నాబ్రాహ్మణున కిచ్చి పంపిరి. ఏదినమున నేకాలమున నీపంతులు తిరుపతిచెంత నాయనకుఁ గనఁబడియెనో ఆదినమున నాకాలమునకే సిద్ధవటములో స్వగృహమున మరణించెను. ఈ రెండు

కథలు విశ్వాసపాత్రము లని యందఱు అంగీకరించిరి. ఈవఱకు నెవ్వరు వ్రాయని యొకకథను జనప్రవాదమును బట్టి వ్రాసి యీవిషయమును వదలెదను.

(3) సిద్ధవటముకోటలో నొక నబాబు నివసించెను. భాకరాపంతులు ప్రధానమంత్రిపదవియం దుండెను. ద్రవ్య మంతయు మంత్రియధీనమం దుండెను. ఇష్టానుసారము మంత్రి వ్యయించెను. నిరతాన్నదానతత్పరుఁ డనువిఖ్యాతిఁ గాంచెను. మహమ్మదీయు లీమంత్రి క్రింది యుద్యోగముల నియమింపఁబడిరి. వారీ విషయమంతయు నప్పుడప్పుడు నబాబుతోఁ జెప్పుచుండిరి. నబాబు నమ్మకయే యుండి యొకానొకప్పుడు ఎట్టకేలకు నమ్మి ధనమంతయు బొక్కసమున లేకుండుట కన్నులారం గాంచి యాగ్రహావేశంబున భాకరాపంతులను పట్టి తెండని యాజ్ఞాపించెను. యమదూతలంబోలు కింకరులు హుంకరించుచుం జనుదెంచి రాజశాసనమును దెల్పిరి. పంతులు భగవంతుని ధ్యానించి భార్యను బిలిచి పసపురంగుచీరెను గట్టుకొనుమని చెప్పి తాను నట్టివస్త్రములను గట్టుకొని పళ్లెరముల నిండ పండ్లు పుష్పములు చందనము నునిచి తెం డని సేవకుల కాజ్ఞాపించి మేళతాళములతోఁ బయనము సాగించెను. కన్ను లెఱ్ఱవాఱ నవాబు పంతులరాక నిరీక్షించుచుండెను.

శుభవాద్యపురస్సరముగాఁ బంతులుపోయి కానుకలు నవాబు ముందటం బెట్టించి భార్యంగూడి నిలుచుండెను. నబాబు మఱేమియుఁ బ్రశ్నింపక 'బొక్కసమంతయుఁ గొల్లగొట్టితివా' యని ప్రశ్నించెను. పంతులు ప్రభుభక్తి మోమునఁ

జిందులాడుచుండ మహాప్రభూ! ఏలినవారిపాదముల నుద్యోగముచేయు కుమారుఁడు నాకు లేనందున, తమ సముఖమున సదా యుద్యోగముచేయు వానిఁ బడయంగోరి పెండ్లియాడితిని. ఏలినవారి మర్యాదకు లోపము రాకుండఁ జేయుటకై వచ్చినవారికి బహుమానము లిచ్చితిని. ఈయకున్న నబాబు మంత్రి లోభియందురు. నావలన మహాప్రభువుల కపకీర్తి రాఁగూడ దనుకారణమున వారిని సమ్మానించితిని. కానఁ గొంచెము విత్తము వ్యయ మయ్యెను. బొక్కసమునం దపారధన మింకను గలదు. ఎవరో దుష్టులు నబాబుగారికడ ధన మంతయు నశించిన దను నపకీర్తి తమకుం గల్పింపఁగోరి యట్లు చెప్పిరి. దయచేయుఁ డని ప్రార్థింప నబాబు నిరుత్తరుం డై యాయన వెంటఁబోయి పరీక్షింపఁ బెట్టెలనిండ బంగారు నాణెములు గనఁబడియె. అచ్చెరువంది పంతులను గౌరవించి చేసినపని చాల మంచిది. అని పంపించి క్రిందియుద్యోగులను ద్రోసివైచి రాజ్యమును బాలించెను.

ఇక్కథయం దెంత సత్యముకలదో వచింపఁజాలను గాని భాకరాపంతులు ధర్మనిరతుఁ డని యందఱు చెప్పుచుండఁగా వినినాఁడను. వారివంశముననే పుట్టిన భాకరా విఠోబరావు నే నెఱుంగుదును. ఐశ్వర్యము క్షీణించిన నౌదార్యము క్షీణింపకుండుట నాయనుభవముచే నెఱుంగుదును. కావున నిట్టికథలు కేవలకల్పితములు కావనియు నిందించుక యతిశయోక్తి యుండినను జాలభాగము సత్యము కలదనియు నమ్ముచున్నాఁడను.

కడపమండల కవిసత్తములు.

ఈమండలమునఁ బూర్వకాలమున మహాకవులుండిరి. వారిచరిత్ర మెల్ల నిచ్చట వ్రాయు నవకాశము లేదు. మండల గౌరవమునకుఁ బ్రధానులు సత్కవులే కాన వారిపేరులు వ్రాయక వదలుట మర్యాదకాదు. కావునఁ గొందఱను వ్రాసెదను.

నాచన సోమకవి.

ఈమహాకవి యుత్తరహరివంశమను ప్రౌఢకావ్యమును రచించెను. వసంతవిలాసమను ప్రబంధమును గూడ రచించి నట్లు కనుపట్టుచున్నది. ఎఱ్ఱాప్రగడ వ్రాసిన హరివంశములోఁ గొంతభాగము నాధారముగా నుత్తరహరివంశమును వ్రాసెను. ఎఱ్ఱాప్రగడ హరివంశము ప్రౌఢము కా దని యీకవి యతి ప్రౌఢముగాఁ దాను రచించె నని కొంద ఱూహింతురు. అది న్యాయము కా దని నాభావము. భక్తిభావమున భగవత్కథను గ్రహించి రచించుట స్వభావము. దానిచే నంతకుమున్నె యాకథను దెనిఁగించియున్నవారిని దిరస్కరింప నీతఁడు వ్రాసె ననుట యించుకయు న్యాయమునకు సమీపముగాని యూహయే యనవచ్చును. ఈయుత్తరహరివంశమును హరిహరనాథున కంకితము చేసెను. ఈ హేతువుచే సోమకవి నెల్లూరుమండలములో నేపల్లెలో నున్నవాఁడో యని యూహించుట, దానినే నమ్మి సిద్ధాంతము చేయుట సాహసకార్యము. గండికోట కడపమండలములో నున్నది. ఆగండికోట మొదలు గుత్తివఱకు గలదేశమునకుఁ ములికినాఁ డని పేరు. కొంతకాలము గండికోటలోనుండియు, మఱికొంతకాలము గుత్తికోటలోనుండియుఁ బ్రభుత్వము చేసి రనుట యుక్తము కాదనుట పాపకార్యమే. గుత్తికోటకుఁ జేరిన కోడూరురాజ్యము (కోడూరుతాలూకా) నందుఁ బినాకినీతీరభూములు సారవంతములయినవి. అందాకాలమున ముక్కారుపంటలు పండు నని ప్రతీతి. అందు పెంచుకలదిన్న యనుగ్రామమున నీమహాకవికి భూదానము చేయఁబడినది. ఆగ్రామము వంగలూ రని పూర్వము; వంగనూ రని యిపుడు పిలువంబడు గ్రామమునకు సమీపముననున్నది. అందు భూదానమును గ్రహించుట కొక్కదిన మెట్లోవచ్చి దానము తీసికొని ఆమఱుదినమే నెల్లూరునకుఁ బాఱిపోయె నని నిర్ణయించుట బాగుగాదు. హరిహరనాథుఁ డనఁగా నద్వైతమతాభిమానులకు నుపాస్యదైవము. దేవతాతారతమ్య మద్వైతమత మంగీకరింపదు. కావున హరిహరనాథున కంకితముచేసి యీమహాత్ముఁడు ధన్యుఁ డయ్యెను. ఇట్టి కవివర్యునిఁ గడపమండలమునుండి కాలుపట్టి పినాకిని వెంట నెల్లూరువఱకు నీడ్చుట మంచిపనికాదు. కావున నీమండలమువాఁ డనుటయే సరసము. ఈయన పదునాల్గవశతాబ్దియం దున్నవాఁడు.

బమ్మెర పోతన.

ఈయన తెనుఁగుభాగవతమును రచించిన మహాకవి. పరమభక్తాగ్రేసరుఁడు. ఒంటిమిట్టలో నున్నవాఁడు. వీరభద్రవిజయమును భాగవతమును రచించినతర్వాత రచించె నని యందలి యొకపద్యమునుండి తెలియ వచ్చెడిని. ఒంటిమిట్టకు నేకశిలా నగర మనుపేరుగలదు. ఇచ్చట శ్రీకోదండరామాలయ

ము గలదు. రామగంగ యనుతీర్థ మున్నది. ఈదేవాలయమునఁ గొంతభాగము శిథిలమైనందువలన ఆంధ్రవాల్మీకి వావిలికొలను సుబ్బరావుగారు శ్రమంపడి దానిని జక్కఁజేయించుచున్నారు.

అల్లసాని పెద్దనకవి.

ఈమహాకవి కామలాపురమునకు సమీపమందున్న కోకటము నివాసముగాఁ గలవాఁ డని యూహింపఁబడుచున్నది. పెద్దనపాడు, పెద్దనచెఱువు నను రెండు నాసమీపమునఁ గలవు. ఇంతమాత్రముచే బళ్లారిమండలమునుండి యీాయనను మార్ప వీలుండదు గాని యిట్లూహించుట కవకాశముకలదు. ఈమండలముతో సంబంధము మాత్రము కలదనుట నిక్కము.

తాళ్లపాక చిన్నన్న.

అష్టమహిషీకల్యాణమను ప్రబంధమును రచించిన యీకవి తాళ్లపాకకు సమీపమున నున్నవాఁ డని ప్రతీతి కలదు. కొందఱు గుండ్లూరులో నున్నవాఁ డందురు. కాని కడపమండలమున నున్నవాఁ డనుట సత్యమని తోఁచెడి.

అయ్యలరాజు రామభద్రకవి.

ఈమహానీయుఁడు కడపమండలములోని యొంటిమిట్టలో నున్నవాఁడు. విధిలేక యీాయన యొంటిమిట్టలో నున్నవాఁడే యని యంద ఱంగీకరించిరి. పాపము ! మఱియొకచోటికి నీడ్వ వీలులేకపోవుటచేత నెట్లో యంగీకరించిరి. కృష్ణరా

యలకాలమున విజయనగరములోఁ బ్రవేశించి సకలకథాసారసంగ్రహమును రచించె నని వ్రాసియు నాప్రాంతముల నేదో యొకయూరివాఁడుగా నుండు నని వ్రాయ వలనుపడమి నెట్లో యొంటిమిట్టవాఁ డని యంగీకరించిరి. ఇక్కవి రామాభ్యుదయాదిగ్రంథముల రచించెను. ఈతఁడు కవిస్తుతి యొనరించుచు

తే. శబ్దశాసనసుకవి కం-జలియొనర్చి
యుభయకవిమిత్రునకు హస్త-యుగళిమోడ్చి
శంభుదాసుని సోము భా-స్కరుఁ దలంచి
యాంధ్రవాగ్భాగవతకర్త - నభినుతించి.

అని వ్రాసెను. దీనింబట్టి యించుక యూహింపవలసియుండును. ఆంధ్రభాగవతమును రచించిన పోతనామాత్యుఁ డని కదా దీనియర్థము. పేరువ్రాయక యిట్లు వ్రాయనేల ? అనఁగాఁ దన గ్రామమునఁ దెనుఁగు భాగవతము వ్రాయఁబడియె నని తెలుపుటకే యని తోఁచును.

కుమ్మర మొల్ల.

ఈమె నెల్లూరుమండలములోని పడుగుపాడు నివాసముగాఁ గల దని వాడుకనుబట్టి నిర్ణయించిరి. కాని కడపజిల్లా బద్వేలుతాలూకాలోని గోపవరమున నివసించి యున్న కేసనసెట్టి కూఁతురనియు, మల్లికార్జునస్వామి యందే యున్నందున నంకితము చేసెననియు జనప్రవాదము గలదు. ఈరెండుస్థలములలో నేది యని సిద్ధాంతము చేయ వలను పడదు. కాని యిట్టివాడుక యిందును గలిగియుంట నిందే చేర్చి వ్రాసితిని.

రామరాజభూషణుఁడు.

వసుచరిత్రము వ్రాసిన యీసత్కవి కడపమండలములోని పులివెందులతాలూకాలోని బట్టుపల్లెలో నుండినవాఁడు. పాండిత్య మలవఱచుకొని విజయనగరమునకుం బోయి యవిచ్ఛిన్నమగు కాల మాసమయముకాఁగా అనంతపురమండలములోని పెనుగొండఁ జేరి తిరుమలరాయల నాశ్రయించి వసుచరిత్రమువ్రాసి యతని కంకితము చేసెను. పెనుగొండలోని ముత్యాలచెఱువులోనికి వచ్చుచున్నవంకకు శుక్తిమతి యని పేరిడెను. దానికిఁ దూర్పుననున్న కొండకుఁ గోలాహలమని నామకరణము చేసి ప్రబంధము నద్భుతముగా రచించెను. ఇతనింగూర్చి విశేషించి వ్రాయ నిది చోటుగాదు.

మట్లి అనంతభూపాలుఁడు.

పదునాఱవశతాబ్దిలోఁ బొత్తపి నివాసముగానున్న యనంతభూపాలుఁడు కాకుత్స్థవిజయము నైదాశ్వాసములుగా రచించెను. ఈ కవిరాజు సోదరపుత్త్రుఁ డగుననంతరామరాజు క్రీ. 1604 సం॥లో సిద్ధవటము కోటను గట్టింప నారంభించెను. అప్పటి వీరినివాసము పొత్తపి. వీరివంశస్థు లిప్పటికిని గలరు. మఱి కొంతకాలమునకు వీరికుటుంబమువారు పొత్తపిలో నివాసముమాని యెఱ్ఱగుంట్లకోటలో నివసించిరి.

తాళ్లపాక తిరువెంగళనాథుఁడు.

ఈతఁడు పరమయోగివిలాసమను నెనిమిదాశ్వాసములుగల ద్విపదకావ్యమును రచించెను. ఆళ్వారులచరిత్రమే యీ

గ్రంథమునఁ గల కథ. ఈతాళ్లపాకవారు కడపమండలమున నుండువారు. నేఁటికిని రాయచోటి వాయిల్పాడుప్రాంతముల నున్నవారు. నందవరీకులు. వీరు వైష్ణవమతాచారములుగలవారు. నామము పెట్టుదురు. తిరుపతిక్షేత్రమున వీరికి మర్యాద కలదు. నేఁటివఱ కున్నది. రాయచోటి సమీపముననున్న మదితాడు గ్రామ మీయన నివాసమని వారివంశస్థులు చెప్పుచున్నవారు. ఇది వృద్ధులు చెప్పెడిమాటలు. కావున నమ్మఁదగినవి.

చింతకుంట కోదండరామకవి.

సునందాపరిణయమను నైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. ఈగ్రంథమునకుఁ బ్రదీపచరిత్రమను రెండవపేరు గలదు. ఈతఁడు కర్నూలుమండలము వాఁడని కొందఱును, కడపమండలములోని ప్రొద్దుటూరువాఁడని కొందఱు చెప్పుదురు. చింతకుంట ప్రొద్దుటూరునకు సమీపమం దున్నది. నందవరీకు లీప్రాంతముల నున్నవారే. సిద్ధాంతముచేయ వీలుగాని యీయన నివాసము ప్రొద్దుటూ రని యిప్పటికి నమ్ముట మంచిది.

కైప మాయనకవి.

ఈతఁడు ములికినాటి బ్రాహ్మణుఁడు. కడపమండలములోని జమ్ములమడుగున నున్నవాఁడని ప్రతీతి. గండికోటనుండి పడమటిభాగమంతయు గుత్తిదనుక ములికినాఁడని పేరుగలది. ఉషాకల్యాణమును అయిదాశ్వాసములుగాఁ బెంచి వ్రాసెను. ఈ యింటిపేరటివారీమండలమునఁ బెక్కుమంది గలరు.

గుడిపాటి కోదండపతి.

నందవరీకబ్రాహ్మణుఁడగు నీకవి శృంగారరసమంజరి యను గ్రంథమును వ్రాసెను. ఈతెగవారికి చాముండేశ్వరి కులదేవత. చాముండాదేవి కిపుడు చౌడమాంబ యని వాడుక గలదు. ప్రొద్దుటూరునకు సమీపమునందున్న గుడిపాడు కాపురముగా నీయన నుండె నని ప్రతీతి. కర్నూలుమండలమున నున్నవాఁ డని కొంద ఱందురు. వీరి వంశస్థు లిప్పటికిం గలరు. వీరిని కరణకమ్మలనుట పొరపాటు.

చింతలపల్లి వీరరాఘవకవి.

పుష్పగిరిని చేర్కొనిన యీవీరరాఘవయ్య కడపమండలములోని వాఁడనుట పొరపాటుగాదు. దేశాయీల మెప్పించి యని చెప్పుకొన్నాఁడు. దేశాయీ లనువారు కాఁపు కులస్థులు. కడపమండలమునఁ గలరు. ఈ చింతలపల్లివారు కరణకమ్మలలోఁ గలరు. నియోగులలోఁ గలరు. ఈతని దీగ్రామ మని నిర్ణయింప వీలుకలుగలేదు కాని యీమండలములోని వాఁడనుట నిర్వివాద మని యిప్పటి కూహింతము.

శ్రీ ధరమల్లె వేంకటస్వామి.

బ్రహ్మోత్తరఖండమును రచించిన యీవిప్రుఁడు సిద్ధవటమునకు మిగుల సమీపముననున్న యంబాపురము. కవియే చెప్పుకొన్నందున నుత్తరమండలములకో నిజాము రాజ్యమునకో యాడ్వఁబడలేదు.

పాఠకులారా! కడపమండలమున నింకను బెక్కుమంది కవులుగలరు. అందు హంసవింశతి రచించిన అయ్యలరాజు నారాయణకవి, తరిగొండ వెంగమ్మ, కుందవరపు కవిచౌడప్ప,

వేమనకవి లోనగువారు ముప్పదిమంది యింకనుగలరు. కొందఱిని చేర్కొంటిని. కవులచరిత్ర మంతయు వ్రాయ నిందు నవకాశము లేదు. ఈమండలమునఁ బూర్వ మిట్టి మహాత్ములుండిరని వ్రాయుట మండలచరిత్రమునకు గౌరవమే యని యించుక వ్రాసితిని.

ఉపసంహారము.

ఈమండలముచరిత్రము వ్రాయఁదగినంత యిట వ్రాయఁబూననైతిని. శాసనములనుగూడ నిందు వ్రాయలేదు. బాలురకు సాధారణముగా దీని చరిత్ర మిట్టి దని యించుక తెలిపినఁ జాలు నను నుద్దేశమునఁ దెలిసినంతమాత్రము వ్రాయక చాలసంగ్రహముగ వ్రాసితిని. దీనిం జదివి విద్యార్థులు కడపమండలచరిత్రము నింకను దెలిసికొనఁ బ్రయత్నింతురుగాక. మండలమునకు నిర్మలయశస్సును దేఁ బ్రయత్నింతురుగాక. కడపమండలము దినదినము సంపదలచేతను, విద్యాధికులచేతను వెలయునుగాక. భగవంతుఁడు పరాత్పరుఁడు శ్రీగోపాలకృష్ణుఁ డీభూభాగమును విఖ్యాతినొంద నాశీర్వదించును గాక.

శ్రీ కృష్ణార్పణమస్తు.

శ్రీ. శ్రీ. శ్రీ.

'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—చెన్నపురి.

		ప్రతి 1-కి రూ.	అ.
భారతరమణీమణులు, ప్రథమభాగము	...	0	12
,, రెండవభాగము	...	0	8
శ్రీమహాభక్తవిజయము, చిత్రపటములతో	...	4	0
నీతిచంద్రిక, శ్రీచిన్నయసూరిగారు	...	0	6
పంచతంత్రము, సులభశైలి	..	0	6
హితోపదేశము ,,	...	0	12
సంగ్రహరామాయణము, శ్రీ శేషాద్రిశర్మగారిది	...	0	10
సంగ్రహభారతము, శ్రీ శేషాద్రిశర్మగారిది	...	1	0
సంగ్రహభాగవతము	...	1	0
శ్రీరామచంద్రమూర్తి	...	0	10
తెనాలిరామలింగనికథలు	...	0	4
సంస్కృతనాటకకథలు, శ్రీసీతారామశాస్త్రికృతము	...	1	4
దశకుమారచరిత్రము, ఎనముచింతల సంజీవరాయశాస్త్రిది	...	1	8
మదనకామరాజుకథలు, చక్కనికూర్పు	...	0	14
భోజకాళిదాసకథలు	...	0	12
దక్కనుపూర్వకథలు, శ్రీసీతారామశాస్త్రికృతము	...	1	8
దేశింగురాజుకథ, బంగంకథ, శుద్ధప్రతి	...	0	6
ఈసపునీతికథలు, క్రొత్తకూర్పు 1-వ భాగము	...	0	6
డిటో 2-వ భాగము	...	0	8
అరేబియన్ నైట్సు కథలు	...	1	4
షేక్స్పియర్ నాటకకథలు	...	1	8
సత్యసేనవిజయము, శ్రీ అనంతాచార్యకృతము	...	0	4
తాతాచార్యులకథలు	...	0	6
నలుగురు మంత్రులకథలు	...	0	4
ఆరుగురు దొంగలకథ.	...	0	6

END OF
TITLE